అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 27-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 158

Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar

12 పేజీలు వెల : 6.50



బిల్లులపై ఎందుకీ జాప్యం..!

కేరళ, బెంగాల్ గవర్నర్ కార్యాలయాలకు సుప్రీం నోటీసులు

ఢిల్లీ :కేరళ, పశ్చిమ బెంగాల్ గవర్నర్ కార్యాలయాలకు సుప్రీంకోర్టు శుక్ర వారం నోటీసులు జారీ చేసింది. గవర్నర్ల వద్ద పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పరిద్వాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కేంద్ర హెూంశాఖకు, గవర్నర్ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది.రాష్ట్రపతికి పంపించాల్సిన బిల్లులపై ఆమోదం తెలపకుండా ఆలస్యం చేస్తున్న గవర్నర్ల చర్యను సవాలు ...11లో

పేర్లు ప్రదర్శించాలని బలవంతం చేయలేం : సుప్రీం 11లో..

కావడియాత్రపై మధ్యంతర స్టే పొడిగింపు



పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

లోక్‌సభ వాయిదా

రాజ్యసభలో వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన

ఉభయ సభల్లో కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజా సమస్యలు, కేంద్ర బడ్జెట్‌లో వివక్షను నిరసిస్తూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. శుక్రవారం పార్లమెంట్ ఉభయ సభలు ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశాయి. వివిధ సమస్యలపై తాము ఇచ్చిన నోటీసులను అనుమతించాలని పట్టుబట్టాయి. కానీ రాజ్యసభలో చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్, లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసులను తిరస్కరించారు. ఉభయ ...11లో

స్థానిక సమరానికి సై..

సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో ఎన్నికలు ?



బీసీ రిజర్వేషన్ వాటా తేలటం కష్టమే..

జనరల్ కోటాలో బీసీలకే ఎక్కువ సీట్లు కేటాయించే యోచన

ఆరునెలలుగా ఆగిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు

పంచాయతీల్లో పడకేసినపాలనతో మరిన్ని కష్టాలు

మరింత సాగదీస్తే మొదటికే మోసం అన్న భావనలో సర్కారు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మరో ఎన్నికలు రాబోతున్నాయా? త్వరలో స్థానిక పోరు జరగనున్నదా? రుణమాఫీతో పాటు క్షేత్రస్థాయిలో ఎక్కువ ప్రభావం చూపే పథకాలను ప్రారంభించి ఆ ఎన్నికల్లో లబ్ది పొందేందుకే సాగు, పంచాయతీరాజ్‌శాఖకు బడ్జెట్‌లో సర్కారు ప్రాధాన్యత కల్పించిందా? నాన్చేకొద్దీ నష్టమే అన్న భావనకు కాంగ్రెస్ సర్కారు వచ్చిందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. వారం రోజుల్లో ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడం దానికి మరింత బలం చేకూరుస్తున్నది. రాష్ట్ర సర్కారు అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో స్థానిక పోరు జరిగే అవకాశముంది.

రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసి ఆరు నెలలు దాటింది. గ్రామాలన్నీ ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. గడువు పూర్తయినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులు పంచాయతీలకు అందడం లేదు. ఆ నిధులు ఆరు నెలల నుంచి రావడం లేదు. ఓ వైపు పరిపాలనా మండలి లేక, మరోవైపు నిధులు లేక గ్రామాల్లో పాలన పడకేసింది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోటా అమలు ..2లో



ఎన్నికల ప్రక్రియ వేగం పెంచండి

వారంలోపే ఓటర్ల జాబితా రూపొందించండి

గడువులోపే బీసీ కమిషన్ నివేదిక ఇవ్వాలి : స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో వేగం పెంచాలని అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వారంలోగా ఓటర్ల తుది జాబితాను రూపొందించాలని నొక్కిచెప్పారు. రిజర్వేషన్లపై బీసీ కమిషన్ కూడా నిర్దిష్ట గడువులోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభించడానికి ఉన్న ఆటంకాలేంటని సీఎం ప్రశ్నించారు. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నూతన ఓటర్ల జాబితా ఇంకా అందలేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా.. ...2లో

మరో 30వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

ఇప్పటికే 30 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చాం

ఏడాదిలోనే 60వేల ఉద్యోగాల భర్తీ : ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి 3లో..

ధరణి స్థానంలో కొత్త చట్టం

శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత సంప్రదింపులు

సమస్యల అధ్యయనానికి పైలట్ ప్రాజెక్టుగా ఓ మండలం ఎంపిక : సీఎం రేవంత్ రెడ్డి 3లో..

గొర్రెల స్కాంపై సర్కారు దర్యాప్తు

రూ.700 కోట్లకు పైగా చేతులు మారినట్టు ఏసీబీ అభియోగాలు

రెండు విడతల్లో ప్రభుత్వ వ్యయం రూ.5వేల కోట్లు

4లక్షల కుటుంబాలకు 80 లక్షల గొర్రెల పంపిణీ 10లో..



క్యూబాపై అమెరికా ఆగడాలు ఆపాలి

ఉగ్ర జాబితాలో క్యూబా పేరు తొలగించాలి

దాని కోసం అగ్రరాజ్యంపై అంతర్జాతీయ ఒత్తిడి తేవాలి : ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి గులామి లాంగ్

క్యూబాకు అండగా నిలవాలి : సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ : ఉగ్రవాద ప్రోత్సాహక దేశాల జాబితా నుంచి క్యూబాను తొలగించాలని, ఆంక్షలు ఎత్తివేయాలని అమెరికాపై అంతర్జాతీయ ఒత్తిడి తీసుకురావాలని ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి గులామి లాంగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాడిక్కడ హరి కిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో మోన్‌కాడా డే 71వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఉగ్రవాదానికి స్పాన్సర్‌గా ...11లో

సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్ర

29న బెల్లంపల్లిలో ప్రారంభించనున్న తమ్మినేని

- ఆగస్టు 5న కొత్తగూడెంలో ముగింపు సభ
- బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- ప్రయివేటీకరించబోమంటూనే కిషన్‌రెడ్డి తప్పుడు ప్రచారం
- వేలం పాటను ఆపాలంటూ కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య డిమాండ్
- బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి నేరుగా కేటాయించాలనీ, వేలం పాటను ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్రను చేపడుతున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య చెప్పారు. అదేరోజు ఉదయం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం యాత్రను ప్రారంభిస్తారని అన్నారు. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఎనిమిది రోజులపాటు ఈ బస్సుయాత్ర కొనసాగుతుందనీ, కొత్తగూడెంలో ముగింపు సభ ఉంటుందని వివరించారు. ఈ యాత్రకు తాను నాయకత్వం వహిస్తాననీ, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పి ఆశయ్య సభ్యులుగా ఉంటారని చెప్పారు. సింగరేణి పరిరక్షణ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ...3లో





నేడు నిటి ఆయోగ్ పాలకమండలి భేటీ

ఎనిమిది మంది సీఎంలు దూరం

హాజరుకానున్న సీఎం చంద్రబాబు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో నేడు (శనివాం ం) నిటి ఆయోగ్ తొమ్మిదో గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మంది ముఖ్యమంత్రులు దూరంగా ఉండను న్నారు. కేంద్ర బడ్జెట్‌లో వివక్ష చూపడం, రాష్ట్రాల హక్కులు కాలరాయడాన్ని నిరసిస్తూ ఆయా రాష్ట్రాల సీఎంలు ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఈ సమావేశానికి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు చెందిన ఏడుగురు ముఖ్యమంత్రులు హాజరు కావడం లేదని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపడుతూ వారు ఈ నిర్ణయం తీసుకు న్నారు. అయితే హాజరు కాలేమని ప్రకటించిన వారిలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఏ.రేవంత్ రెడ్డి (తెలంగాణ), సిద్ద రామయ్య (కర్నాటక), సుఖ్వీందర్ సింగ్ సుఖ్ (హిమాచల్‌ప్రదేశ్) ఉన్నారు. అలాగే తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కూడా నీటి ఆయోగ్ సమావేశానికి రావడం లేదని ప్రకటించారు. ఢిల్లీ సీఎం ...3లో

ఆగస్టు 2 డెడ్‌లైన్

అంతలోపు కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయాలి

లేదంటే 50 వేల మంది రైతులతో కలిసి మేమే పంప్‌లు ఆన్ చేస్తాం

ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక 11లో..



కేటీఆర్ పేరు మార్చుకుంటే బెటర్

ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందే పాటిస్తాం

కేసీఆర్, కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

కాళేశ్వరంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం

కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాణహితను ఆపేశారు

ఎల్లంపల్లి నుంచే పంపింగ్ చేస్తాం : మంత్రి ఉత్తమ్ 11లో..



ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో వ్యయానికి సంబంధించిన గణాంకాలు పలు పత్రికల పతాక శీర్షికల్లో కన్పించాయి. అయితే ఇందులో దేశంలోని పేదల కోసం చేసిన కేటాయింపులను పరిశీలిస్తే మాత్రం ఆశాభంగం చెందక తప్పదు. అనేక అణగారిన సమాజాలు ఆధారపడుతున్న పథకాలు, అత్యవసర కార్యక్రమాలకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గిపోయింది. ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే అట్టడుగు వర్గాల వారు ఏ వ్యవస్థలపై ఆధారపడి జీవిస్తున్నారో ఆ వ్యవస్థలను బలహీనపరిచే ప్రమాదం కూడా కన్పిస్తోంది.


ఇక పిండుడే..!

సామాజిక రంగాలకు కేంద్రం రిక్తహస్తం

బడ్జెట్ కేటాయింపుల్లో కోతలే కోతలు

పేదల సంక్షేమానికి తూట్లు

రైతన్న నెత్తిన శఠగోపం



న్యూఢిల్లీ : ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం చేస్తున్న మొత్తం ఖర్చులో సామాజిక రంగాల పద్దుల వాటా క్రమేపీ తగ్గిపోతోంది. కొన్ని పద్దులు చిక్కిపోగా మరికొన్నింటిలో పెరుగుదల కన్పించడం లేదు. కొన్ని పద్దులు మాత్రం స్వల్పంగా పెరిగాయి. 2015-16తో పోలిస్తే భారీగా కోత పడిన పద్దుల్లో ఆహార సబ్సిడీ, సాంఘిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం, ఎరువుల సబ్సిడీ ఉన్నాయి. ఉదాహరణకు 2015-16లో ఆహార సబ్సిడీకి బడ్జెట్‌లో 7.79 శాతం కేటాయించగా 2024-25 బడ్జెట్ అంచనాల్లో అది 4.26 శాతానికి తగ్గిపోయింది. అదే విధంగా సాంఘిక సంక్షేమానికి కేటాయింపులు 1.7 శాతం నుంచి 1.1 శాతం, విద్యకు 3.75 శాతం నుంచి 2.61 శాతం, ఆరోగ్యానికి 1.91 శాతం నుంచి 1.85 శాతం, ఎరువుల సబ్సిడీకి 4.04 శాతం నుంచి 3.4 శాతానికి తగ్గిపోయాయి. పెన్షన్ పద్దుకు కేటాయింపు మాత్రం ఎదుగూ బొదుగూ లేకుండా బడ్జెట్ వ్యయంలో 5.05 శాతంగానే ఉండిపోయింది. దీనికి భిన్నంగా వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయింపులు 1.3 శాతం నుంచి 3.1 శాతం, గ్రామీణాభి వృద్ధికి 5.04 శాతం నుంచి 5.5 శాతానికి పెరిగాయి.

ఏ రంగానికైనా తగ్గుదలే

ఒకప్పుడు గ్రామీణ జనాభాకు ఉపాధి హామీ చట్టం మూలస్తంభంగా ఉండేది. 2015-16 బడ్జెట్‌లో దీనికి 2.09 శాతం నిధులు కేటాయించగా 2024-25 బడ్జెట్ అంచనాల్లో అది కేవలం 1.78 శాతంగానే ఉంది. ఇక వృద్ధాప్య పెన్షన్ పథకం, ఇందిరాగాంధీ జాతీయ దివ్యాంగ పెన్షన్ పథకం, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, అన్నపూర్ణతో కూడిన జాతీయ సామాజిక సహాయ కార్యక్రమానికి (ఎన్ఎస్ఏపీ) కూడా కేటాయింపులు 0.48 శాతం నుంచి 0.20 శాతానికి తగ్గిపోయాయి. ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ, ఉపాధ్యాయ విద్యతో కూడిన సమగ్ర శిక్షా అభియాన్ కార్యక్రమానికి కేటాయింపులు 1.46 శాతం నుంచి 0.78 శాతానికి పడిపోయాయి.

ఆరోగ్యం, ఉపాధి కల్పనకు కూడా...

ఆరోగ్య రక్షణకు ఉద్దేశించిన ప్రధానమంత్రి స్వాస్థ్య యోజన పథకానికి కూడా కేటాయింపులు 0.09 శాతం నుంచి 0.05 శాతానికి తగ్గాయి. దేశంలో నిరుద్యోగ రేటు పెరుగుతున్నప్పటికీ ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమానికి బడ్జెట్ కేటాయింపులను 0.07 శాతం నుంచి 0.05 శాతానికి కుదించారు. ప్రధాని మాత్రం లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పుకుంటున్నారు.

ఇవేనా ప్రభుత్వ ప్రాధాన్యతలు?

పేదల జీవితాలకు ఎంతగానో ఉపయోగపడుతున్న కీలక రంగాలకు కేటాయింపులను కుదించడాన్ని చూస్తుంటే ప్రభుత్వ బడ్జెట్ ప్రాధాన్యతలేమిటో అర్థమవుతుంది. దేశంలోని అత్యంత బలహీనులైన ప్రజలకు కీలకంగా ఉన్న మద్దతు వ్యవస్థలను బలహీనపరచడం ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వ సాయం అంతకంతకూ తగ్గిపోతుండడంతో సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కీలక పద్దులకు కేటాయింపుల్లో ప్రభుత్వం పెడుతున్న కోతలను పరిశీలిస్తే అనేక కఠోర వాస్తవాలు కన్పిస్తాయి.

అన్నదాతకు లభించని ఆసరా

మధ్యాహ్న భోజన పథకం స్థానంలో తీసుకొచ్చిన పీఎం పోషణ్ కార్యక్రమానికి 2015-16 బడ్జెట్‌లో 0.51 శాతం నిధులు కేటాయించగా 2024-25 బడ్జెట్ అంచనాల్లో అది 0.26 శాతానికి తగ్గింది. రైతులకు సబ్సిడీపై ఎరువులు అందించేందుకు ఉద్దేశించిన పథకానికి కేటాయింపులు 1.23 శాతం నుంచి 0.93 శాతానికి, అన్నదాతకు ఎంతో కీలకమైన యూరియా సబ్సిడీని 2.82 శాతం నుంచి 2.47 శాతానికి తగ్గించారు. అయితే దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో వారికి ఆర్థికంగా భద్రత కల్పించే విషయంలో చేదోడువాదోడుగా ...11లో

మహిళా హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

- కరీంనగర్‌లో సంఘం రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభం



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

అనేక సంవత్సరాలుగా మహిళా హక్కుల సాధన కోసం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని, హక్కుల కోసం మరోమారు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో ఐద్వా రాష్ట్ర స్థాయిక రాజకీయ శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ప్రారంభ సభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆస్తి హక్కు కల్పించాలని, లైంగిక వేధింపులు అరికట్టాలని అనేక చట్టాలు సాధించుకున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల మూలంగా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లలో మహిళలను విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద మహిళలు పౌష్టికాహార లోపంతో రక్తహీనతకు గురవుతున్నారని, పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణ హత్యలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, నిర్భయ, అత్రాస్, మణిపూర్ ఘటనలే ఇందుకు నిదర్శనమని అన్నారు. దేశానికి బంగారు పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ లైంగికంగా వేధించారని, బాధితులకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వం దుండగులకు వత్తాసు పలకడం సిగ్గుచేటు అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ధరలను అరికట్టాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అభినందనీయమని, దాంతోపాటు మహిళలకు ఇస్తామన్న నెలకు రూ.2500 వెంటనే ఇవ్వాలని అన్నారు. గ్యాస్ సబ్సిడీ కొద్దిమందికి మాత్రమే వస్తోందని, పూర్తిస్థాయిలో అమలు చేయాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన మహిళలకు కేటాయించాలని, ఆ ఇండ్లకు కరెంటు, రోడ్లు, తాగునీటి, డ్రెయినేజీ వ్యవస్థలు పూర్తి చేయాలని కోరారు. ఇండ్ల స్థలం, ఇల్లు లేని వారికి, ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పది లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ రాజకీయ శిక్షణా తరగతులలో మహిళలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా చైతన్యపరిచి మహిళా సమస్యలపై భవిష్యత్‌లో తీవ్రంగా పోరాడుతామని చెప్పారు. నాలుగు రోజులపాటు ఈ తరగతులు ఉంటాయని, ఇందులోనే మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలు రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, మాచర్ల భారతి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు నాగలక్ష్మి, శశికళ, అనుమల మహేశ్వరి, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ధ్యావ అన్నపూర్ణ, రోజా రాణి, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



'సీతారామ'కు బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలి

భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు

నవతెలంగాణ-కామేపల్లి

సీతారామ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోవని, బడ్జెట్ సవరించి రూ.2వేల కోట్లు కేటాయించాలని, ప్రాజెక్టు భూనిర్వాసితులకు ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ అధ్యక్షతన జరిగిన కామేపల్లి, కారేపల్లి సంయుక్త మండలాల రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన రూ.687 కోట్లు భూసేకరణ నష్టపరిహారానికే సరిపోవని, రాష్ట్ర బడ్జెట్ సవరించి రూ.2వేల కోట్లకు పెంచి సత్వరమే ప్రాజెక్టు పూర్తి చేయాలని అన్నారు. అందుకు జిల్లా మంత్రులు ముగ్గురూ ప్రయత్నించాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రాజెక్టుల డిజైన్లు మారుతున్నాయి తప్ప అవి పూర్తి కావడం లేదన్నారు. సీతారామ ప్రాజెక్ట్ పాపకొల్లు గుట్టల దగ్గర తవ్వకాలు నిలిపివేశారని, దీని వల్ల కామేపల్లి, కారేపల్లి, రఘునాథపాలెం మండలాలకు సాగునీరు అందే పరిస్థితి లేదని, తక్షణమే ఆగిపోయిన పనులు పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ భూనిర్వాసితులకు ఎకరాకు రూ.10.50 లక్షలు పరిహారం అందించడం అన్యాయమని, ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ప్రకారం అందించాలని అన్నారు. సదస్సులో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, సొసైటీ మాజీ చైర్మెన్ చిదంబరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల నాయకులు గోపిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అచ్చయ్య, సీపీఐ జిల్లా నాయకులు ఏపూరి లాతాదేవి, పండితాపురం మాజీ సర్పంచ్ కృష్ణ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈ సదస్సులో రైతు సంఘం సీనియర్ నాయకులు ఇంజం నాగభూషణం, కారేపల్లి మండల అధ్యక్షులు ముళ్ళ ఏకాంబరం, కార్యదర్శి వజ్జా రామారావు, కామేపల్లి మండల కార్యదర్శి సకినాల శ్రీనివాసరావు, కారేపల్లి సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కుందనపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపుల్లో వివక్ష

- కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లను సవరించి ఐదు శాతం నిధులు కేటాయించాలి :ఎన్‌పీఆర్‌డీ
- హైదరాబాద్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ల ప్రతుల దహనం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమం, పునరావాసం కల్పన కోసం బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష చూపాయని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య విమర్శించారు. వెంటనే ఆ బడ్జెట్లను సవరించి ఐదు శాతం చొప్పున నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్లకు సంబంధించిన ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం వికలాంగుల సాధికారతకు గతేడాది కంటే 0.02 శాతం అదనంగా పెంచిందనీ, బడ్జెట్ పదిశాతం పెరిగితే దానికి అనుగుణంగా ఎందుకు కేటాయింపులు పెంచలేదని ప్రశ్నించారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల కోసం రూ.615.33 కోట్లు, పరికరాల కొనుగోలు కోసం రూ.315 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. దీన్ దయాల్ వికలాంగుల పునరావాస పథకాన్ని ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కేవలం రూ.165 కోట్లు కేటాయించిందని విమర్శించారు. నేషనల్ ఇనిస్టిట్యూషన్లకు, వికలాంగుల విద్యార్థులకు గతేడాది బడ్జెట్‌లో రూ.155 కోట్లు కేటాయించగా ఈసారి రూ.142.68 కోట్లకు కుదించడం దారుణమని విమర్శించారు. వికలాంగుల క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని ఒక వైపు చెబుతూ మరోవైపు రూ.76 కోట్ల నుంచి రూ.25 కోట్లకు కుదించడమేంటని ప్రశ్నించారు. ఇందిరా గాంధీ నేషనల్ డిసెబుల్డ్ పెన్షన్ పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు ఎందుకు కేటాయించలేదని నిలదీశారు. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేశ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో వికలాంగులకు పొందుపర్చిన హామీలను విస్మరించిందన్నారు. పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని చెప్పి దానికి నిధులు కేటాయించకుండా మోసం చేశారని విమర్శించారు. వికలాంగుల పరికరాలు, స్వయం ఉపాధి రుణాల కోసం నిధులెందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకటేశ్, ఎన్‌పీఆర్‌డీ నాయకులు బాలపీరు, గంగమ్మ, రాజు, నర్సింగ్, జాన్, నర్సింగ్ రావు, శంకర్ గౌడ్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ సిటీ అధ్యక్షులు అశ్విన్, నాయకులు రఘు, తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తును బలి చేసుకోవద్దు

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి సూచించారు. మదాపూర్ రేవ్ పార్టీలో ఇటీవల పట్టుబడ్డ 20 మందికి వారి కుటుంబసభ్యుల సమక్షంలో శుక్రవారం హైదరాబాద్‌లోని అబ్కారీ భవన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల్లో సంపాదిస్తూ, మంచి ఉద్యోగం చేస్తున్నవారు సైతం ఈ మాఫీయా చట్రంలో చిక్కుకుని తమతో పాటు తమ కుటుంబాలను రోడ్డుకీడుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అసాంఘిక కార్యక్రమాల్లో పిల్లలు, భర్తలు, పాలుపంచుకుంటుంటే తల్లిదండ్రులుగా, కట్టుకున్న ఇల్లాలుగా మీరేం చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. భవిష్యత్‌లో ఇలాంటి తప్పులు చేయకుండా కుటుంబ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఈఎస్ ప్రదీప్‌రావు ఇతర సిబ్బంది, పాల్గొన్నారు.

ఏ ప్రభుత్వమూ హైదరాబాద్‌కు ఇన్ని నిధులు ఇవ్వలేదు

- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిందనీ, ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం నగరానికి రూ.10వేల కోట్లు కేటాయించిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇన్ని నిధులు ఇవ్వలేదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బడ్జెట్‌పై మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ చదువుతుంటే కేసీఆర్ బయటికొచ్చి విమర్శలు చేశారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో హైదరాబాద్‌కు ఎన్ని నిధులు ఇచ్చారని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీ, వాటర్ బోర్డు, మెట్రోకు, హైడ్రాకు నిధులు ఇచ్చారని చెప్పారు. వ్యూహాత్మకంగానే సీఎం రేవంత్‌రెడ్డి జంటనగరాల అభివృద్ధికి నిధులు ఇచ్చారన్నారు. హైదరాబాద్‌లో వర్షాలు వస్తే కేసీఆర్ హయాంలో ఫామ్ హౌస్‌లో కూర్చొని మొసలి కన్నీరు కార్చారని తెలిపారు. పిట్ట కథలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట అంటూ తెలిపారు. వాస్తవానికి దగ్గరలో బడ్జెట్ ఉందని చెప్పారు. కేసీఆర్ హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లు చేస్తాననీ, మూసీ నదిలో ఈతకొట్టేలా చేస్తానంటూ గప్పాలు కొట్టారని కేసీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓల్డ్ సిటీలో మౌలిక వసతులు లేవని చెప్పారు. రూరల్ ప్రాంతంతోపాటు రాజధాని హైదరాబాద్ కోసం భారీగా నిధులు కేటాయించారని ఆయన చెప్పారు.

ఓటు విశిష్టతను తెలియజేసే చిత్రం

'అందరూ ఓటు వేద్దాం'

- సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వినయకుమార్

నవతెలంగాణ - ముషీరాబాద్

ఓటు విశిష్టత.. ప్రాముఖ్యతను "అందరూ ఓటు వేద్దాం" అనే లఘు చిత్రం తెలియజేస్తుందని హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వినయకుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దాశరథి థియేటర్ ఆధ్వర్యంలో 'అందరూ ఓటేద్దాం' అనే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆధునిక సమాజంలో సందేశాత్మక చిత్రాల అవసరం ఎంతో ఉందన్నారు. ఈ లఘు చిత్రం ఆ కోవకే చెందిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా.. ఓటు విశిష్టతను ఈ చిత్రం తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విధంగా ఎంతో చక్కగా రూపొందించారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని సరైన నాయకున్ని ఎన్నుకోవాలని కోరారు. షార్ట్ ఫిలిం 2024 పోటీల్లో 'అందరూ ఓటు వేద్దాం' అనే చిత్రం ఉత్తమ చిత్రంగా ఎంపికై 20 వేల రూపాయల నగదు బహుమతి గెలుచుకుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను ప్రదర్శించి ఇటువంటి లఘు చిత్రాలను రూపొందించాలని, దాశరథి థియేటర్స్ వారికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

స్థానిక సమరానికి సై..

(మొదటిపేజీ తరువాయి)

చేసి ఎన్నికలకు వెళ్లాలని భావించింది. దాని కోసం కసరత్తు కూడా ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేసే కొద్దీ ఆచరణలో అంత త్వరగా తేలేటట్టు కనిపించట్లేదు. మరోవైపు బీహార్‌లో చేపట్టిన బీసీ కులగణనకు సుప్రీం కోర్టు మోకాలడ్డింది. ఒకవేళ రిస్కు తీసుకుని ముందుకెళ్లినా, బీసీ రిజర్వేషన్ల వాటా ప్రకటించినా ఆచరణలో న్యాయపరమైన చిక్కులు ఎదురై మరింత జాప్యం జరిగే అవకాశముంది. ఇదంతా తేలేటట్టు కనిపించడంలేదు. ఈ ప్రక్రియ పూర్తి చేయాలంటే కనీసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు 15వ ఆర్థిక సంఘం నుంచి అందే నిధులను మరింత కాలం కోల్పోయే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సర్కారు కొత్త ఆలోచనతో ముందుకెళ్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలు, మండలాలను ప్రామాణికంగా తీసుకుని రిజర్వుడు స్థానాలు పోనూ జనరల్ కేటగిరీలో వీలైనంత ఎక్కువ మేరకు బీసీలకు సీట్లు కేటాయించి ముందుకెళ్లే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తున్నది.

ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం మొదలైనట్టు కనిపిస్తున్నది. కాంగ్రెస్ ఆరు హామీల అమలు విషయంలో కాంగ్రెస్‌పై ప్రతిపక్షాలు ముప్పేట దాడిని పెంచుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రజల్లో కూడా మార్పు మొదలైతే మొదటికే మోసం వస్తుందని ఆ పార్టీ భావిస్తున్నది. హామీల్లో ముఖ్యమైన రూ.2 లక్షల రుణమాఫీని ఆగస్టు 15లోగా పూర్తిచేయాలని కాంగ్రెస్ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. ఆ దిశగా పని మొదలుపెట్టింది. అదే సమయంలో మహిళలకు సత్వరం ప్రయోజనం చేకూర్చే ఒకటెండ్రు పథకాలను కూడా త్వరలో అమలుచేయబోతున్నట్టు చర్చ నడుస్తున్నది. రైతులకు, మహిళలకు మొదట సాంత్వన చేకూర్చి ముందుకెళ్లే ఆలోచనలో రాష్ట్ర సర్కారుంది. ఎన్నికల నిర్వహణ విషయంలోనూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ఆధారంగా మొదట అనుకూలంగా ఉన్న చోట్ల ఎన్నికలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేక భావన రాకుండా చూసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఆ తర్వాత మిగతా ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. ఈసీ నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఓటర్ల జాబితా వచ్చే సరికి కనీసం వారం రోజులు పడుతుందని అధికారులే చెబుతున్నారు. అది జరిగే సరికి ఆగస్టు నెల ప్రథమార్థం అయిపోతుంది. ఓటర్ల జాబితా వచ్చాక అన్ని ఏర్పాట్లు చేసుకునేందుకు ఎన్నికల సంఘానికి కనీసం 15 రోజుల నుంచి నెల సమయం పట్టే అవకాశముంది. వీటన్నిటి దృష్ట్యా సెప్టెంబర్ లేదంటే అక్టోబర్‌లో సర్పంచి ఎన్నికలు జరిగే అవకాశముంది.

అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర

- ఆగస్టు 2 నుంచి 18 వరకు కొనసాగింపు :తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని యాది చేసుకుంటూ ఆగస్టు రెండో తేదీ నుంచి 18 వరకు 'అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర' చేపట్టనున్నట్టు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయాలనీ, బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ యాత్ర బొలగాని పుల్లయ్య 36వ వర్థంతి రోజున ప్రారంభమై సర్దార్ సర్వాయి పాపన్న 374 జయంతి వరకు సాగుతుందని తెలిపింది. ఈ యాత్రను జయప్రదం చేయాలని గీత కార్మికులకు, శ్రేయోభిలాషులకు పిలుపునిచ్చింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సుప్రజ ఆస్పత్రి ఎమ్‌డీ విజయ్‌కుమార్ మాట్లాడారు. సొసైటీల ఏర్పాటు, ఎక్స్‌గ్రేషియా, చెట్ల పెంపకానికి భూమి కేటాయింపు, పింఛన్లు తదితర హక్కులు సాధించుకోవడంలో టీజీకేఎస్ పాత్ర కీలకమన్నారు. గీత కార్మికులందరికీ ఉచితంగా సేఫ్టీ మోకులు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతించారు. అయితే, గీతకార్మికుల సంక్షేమానికి రూ.68 కోట్లు, నీరాకు రూ.25 కోట్లు ఎలా సరిపోయాయని ప్రశ్నించారు. రెండు లక్షల 50 వేల మంది సభ్యత్వం కలిగి ఉన్న వారిలో లక్ష మందికిచ్చినా రూ.90 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. నెక్లెస్ రోడ్డులోని నీరాకేఫ్‌కు అనుబంధంగా జిల్లాల్లో ఏర్పాటు చేసిన మిషనరీకి, మిగతా జిల్లాల్లో విస్తరించడానికి కనీసం వంద కోట్ల రూపాయలు కావాలని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి కేటాయింపులు పెంచాలని కోరారు. గీతకార్మికులు ప్రమాదానికి గురై చనిపోయినా, శాశ్వత వైకల్యం పొందితే వారి కుటుంబాలకు రూ.10 లక్షల సహాయం అందించాలనీ, ప్రమాదాల్లో గాయపడితే లక్ష సాయం అందించాలని కోరారు. బెల్టు షాపులను పూర్తిగా నిషేధించాలనీ, కల్లులోని పోషకాలు, ఔషధ గుణాల గురించి ప్రభుత్వమే ప్రచారం చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. 50 ఏండ్లు నిండిన గీతకార్మికునికి చేయూత పథకం ద్వారా రూ.4 వేలివ్వాలని విన్నవించారు. ఏజెన్సీ ఏరియాల్లో కల్లుగీత కార్మికుల సొసైటీలను ఏర్పాటు చేయాలనీ, గీత వృత్తిదారులందరికీ మోటారు సైకిళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి 5 వేల కోట్లు కేటాయించి టాడి కార్పొరేషన్ను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. తాటి, ఈత వనాలు పెంచేందుకు ప్రతి సొసైటీకి ఐదెకరాల ప్రభుత్వ భూమిని ఇవ్వాలనే 560 జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 439 సొసైటీల భూములకు పెన్సింగ్ వేయించాలని విజ్ఞప్తి చేశారు. గీతకార్మికుల దహన సంస్కారాలకు రూ.50 వేలు, గాయాలైన వారికి వైద్య ఖర్చుల కోసం రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ భవనం నిర్మించి ఇవ్వాలనీ, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. జనగాం జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి..వెంకట నరసయ్య, గౌనీ వెంకన్న, పామనగుండ్ల అచ్చాలు, బాల్నే వెంకట మల్లయ్య, బోలగాని జయరాములు, ఎల్లురి గోవిందు, గాలి అంజయ్య, సంఘం రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు, బూడిద గోపి,ఎస్ రమేష్ గౌడ్, బండకింది అరుణ్, మద్దీ అంజిబాబు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

జీవో 317 బాధితుల వివరాలు సమర్పించాలి

- అధికారులకు మంత్రివర్గ ఉప సంఘం ఆదేశం
- విచారణ చేసి నివేదిక రూపకల్పన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవో 317 బాధితులను గుర్తించి వారి వివరాలను త్వరగా సమర్పించాలని 317 జీవోపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ అధికారులను ఆదేశించింది. ఈ జీవోతో ఎవరికైతే అన్యాయం జరిగిందో వారికి న్యాయం చేయాల్సి ఉందని తెలిపింది. శుక్రవారం హైదరాబాద్ డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కమిటీ సభ్యులు, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సమాచారం అందించినప్పటికీ మరికొన్ని శాఖల నుంచి బాధిత ఉద్యోగులకు సంబంధించిన నిర్దిష్టమైన సమాచారం రావాల్సి ఉందని కమిటీ వెల్లడించింది. జీవో కింద వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు వచ్చిన దరఖాస్తుల్లో 30 నుంచి 40 శాతం మంది ఉద్యోగుల దరఖాస్తులు పునరావృతమైనట్టు కమిటీ గుర్తించింది. 317 జీవో వెసులుబాటు ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలనే ఉద్దేశంతో చేసిందని చెప్పింది. కొంత మంది ఈ వెసులుబాటును ఉపయోగించుకుని వారి వారి సొంత జిల్లాలకు వెళ్లాలనుకుంటున్నట్టు ఉన్నతాధికారులు కమిటీ దృష్టికి తెచ్చారు. కమిటీ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు పూర్తిస్థాయిలో విచారించిన తర్వాతే నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాధారణ పరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి మహేష్ కుమార్ ఎక్కా దత్, హెూంశాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, పీఆర్సీ చైర్మెన్ శివశంకర్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మెన్ శ్రీనివాసరావు, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టీనా, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ వేగం పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

దానికి ఎంత సమయం పడుతుందని అడిగారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలకు జాబితా పంపిందనీ, తెలంగాణతో పాటు మరో ఆరు రాష్ట్రాలకు వారంలోగా జాబితాలు అందుతాయని అధికారులు చెప్పారు. జాబితా రాగానే ఆలస్యం చేయకుండా ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. వారంలోగా ఆయా స్థానిక సంస్థలకు తగినట్టుగా ఓటర్ల జాబితాలు రూపొందించుకోవాలని సూచించారు. రిజర్వేషన్లకు సంబంధించి బీసీ కమిషన్ సైతం నిర్దిష్ట గడువులోగా తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క), ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, వేముల శ్రీనివాసులు, సంగీత సత్యనారాయణ, అజిత్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

గొల్ల కురుమలను విస్మరించిన కాంగ్రెస్

జీఎంపీఎస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గొల్ల, కురుమల సంక్షేమానికి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల పెంపకం దారులకు, గొల్ల కురుమలకు మొండి చేయి చూపిందని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) విమర్శించింది. ఈమేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రూ. 2.90 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో గొల్ల కురుమలు, గొర్రెల పెంపకందార్లకు నయా పైస నిధులు కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో రెండో విడత గొర్రెల పంపిణీని పూర్తి చేస్తామంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చి ఆరు నెలలు గడిచినా పంపిణీ ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో నిధులు కేటాయించి ప్రారంభిస్తారనే ఆశతో ఎదురుచూస్తున్న వారికి మొండి చేయి చూపిందని విమర్శించారు. యాదవ కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు కేటాయించినట్టు చూపుతున్నప్పటికీ ఆ నిధులు ఎలా ఖర్చు చేస్తారనే వివరణ లేదని తెలిపారు.



ఐయామ్ వాట్ ఐయామ్ పుస్తకాన్ని ఆవిష్కరించిన సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ సంఘసేవకురాలు, ప్రజ్వల సేవా సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ సునీతా కృష్ణన్ రాసిన 'ఐయామ్ వాట్ ఐయామ్' పుస్తకాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో గల పార్క్ గ్రీన్ హోటల్‌లో జరిగిన పుస్తకావిష్కరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..హ్యూమన్ ట్రాఫికింగ్‌లో చిక్కుకున్న అమ్మాయిలను కాపాడిన సునీతా కృష్ణన్ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. లైంగిక దాడులకు గురైన వారు కుంగిపోకుండా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపడం సునీతా కృష్ణన్ గొప్పతనమని ప్రశంసించారు. ఆమెను తాను స్ఫూర్తిగా తీసుకుంటానన్నారు. ఎంతో మంది అమ్మాయిలకు కొత్త జీవితాన్ని ఇచ్చి ఆమె పలు అంతర్జాతీయ, జాతీయ సంస్థలకు రోల్‌మోడల్‌గా ఎదిగిన తీరును గుర్తుచేశారు. ఆమె పోరాటాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ కూడా పాల్గొన్నారు.

మరో 30వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్

- ఇప్పటికే 30 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చాం
- ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీ
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తాం
- సహేతుకమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ
- నిరసనలు, ఆందోళనలు వద్దని హితవు



నవతెలంగాణ-గండిపేట్

రాష్ట్రంలో ఏడాదిలోపు 60వేల ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగుల పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకుంటామని, ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలకు నియామకపత్రాలు అందజేశామని, మరో 30వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఖాళీని జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని మరోమారు స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగి మున్సిపాలిటీ గౌలిదొడ్డిలోని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ అండ్ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం నిర్వహించిన ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా సీఎం గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

గతంలో 30 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు అందుకున్న వారిలో 483 మంది ఫైర్‌మెన్లు, 155 మంది డ్రైవర్ ఆపరేటర్స్ ఉన్నారని, వారిప్పుడు కఠిన శిక్షణ కూడా పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. నిరుద్యోగ యువకుల్లో విశ్వాసం కల్పించడమే ప్రాధాన్యతగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. యువత పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా ప్రాణాలను లెక్కచేయకుండా అగ్నిమాపక సిబ్బంది ముందుండి ప్రజలను కాపాడతారని కొనియాడారు. ఉద్యోగాల్లో 90 శాతం మంది గ్రామీణ ప్రాంతాల వారు ఉండటం సంతోషకరమన్నారు. నిరుద్యోగుల సహేతుకమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, మంత్రులు, ఉన్నతాధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని అన్నారు. ఎవరూ నిరసనలు, ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా వైద్యా రంగాలకు పెద్దపీట వేశామన్నారు.

వ్యవసాయ రంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే వ్యవసాయం, విద్యా రంగాలను అధిక నిధులు కేటాయించినట్టు చెప్పారు. ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం యజమానిగా ఉంటుందన్నారు. వారి బాగోగులను చూసుకోవడానికి ప్రతి నెలా మొదటి తేదీనే జీతాలు పడేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు శ్రీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, పోలీసు, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు, సింగిల్ విండో చైర్మెన్ రామ్ దాసముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు నాయకులు మలాకి రత్నం, మల్లేష్ యాదవ్, అంజనేయులు, సాగర్‌గౌడ్, యాదగిరి, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఎంబీ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాకుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలంపాట నిర్వహిస్తున్నదని చెప్పారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దాన్ని ప్రారంభించారని అన్నారు. బొగ్గు గనుల తవ్వకాల కోసమే సింగరేణి సంస్థ ఏర్పడిందని గుర్తు చేశారు. చౌకగా విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడే బొగ్గును ఇస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వనరులను సమకూరుస్తున్నదని వివరించారు. సింగరేణి సంస్థను నీరుగార్చి, దాన్ని దెబ్బతీసేలా బొగ్గుబ్లాకులను వేలంపాటను నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రయివేటు సంస్థలకు బొగ్గుబ్లాకులను కేటాయిస్తే సింగరేణి నిర్వీర్యమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రావణపల్లి బొగ్గు బ్లాకును నేరుగా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రెండు బొగ్గుబ్లాకులను ప్రయివేటువారికి అప్పగించారని చెప్పారు. కార్మికులను, ప్రజలను చైతన్యవంతం చేయడానికే సింగరేణి పరిరక్షణ యాత్రను చేపడుతున్నామని వివరించారు.

సింగరేణి ప్రయివేటీకరణ దిశగా ప్రభుత్వాల నిర్ణయాలు

తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి కేంద్ర గనుల శాఖ మంత్రిగా ఉండడం వల్ల సింగరేణిని కాపాడుకోవడం సులభమని అందరూ భావిస్తారని వీరయ్య అన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నారని చెప్పారు. వారంతా ప్రజల ఆశలను అడియాశలు చేశారని విమర్శించారు. మోడీని మోయడానికే ఉన్నారు తప్ప ఓట్లేసిన ప్రజల ప్రయోజనాలను కాపాడ్డం లేదన్నారు. సింగరేణిని ప్రయివేటీకరించబోమంటూ కిషన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. కేంద్రానికి 49 శాతం, రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉందన్నారు. కానీ కేంద్రం ఏకపక్షంగా సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించకుండా ప్రయివేటు వారికి అప్పగించేందుకు వేలం పాటను నిర్వహిస్తున్నదని వివరించారు. దాని వల్ల సింగరేణి నష్టాలబాట పడుతుందనీ, ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా అలాగే ఉన్నా సింగరేణి సంస్థ మూతపడుతుందని వివరించారు. ఆ సంస్థ నడవాలంటే ప్రయివేటు సంస్థలకు అప్పగించాలంటూ ప్రభుత్వాలు నిర్ణయం తీసుకుంటాయని అన్నారు. సింగరేణి ప్రయివేటుపరం అవుతుందనీ, కార్మికులు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాట చరిత్ర ఉన్న తెలంగాణ ప్రజలు, కార్మికులు కన్నెర్రజేసి సింగరేణిని కాపాడుకోవాలని కోరారు. శ్రావణపల్లి బొగ్గుబ్లాకును సింగరేణికి కేటాయించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరుతున్నారని చెప్పారు. ఇంకోవైపు వేలంపాటలో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొంటున్నదనీ, సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారని గుర్తు చేశారు. ఇంతకంటే అన్యాయం మరొకటి లేదనీ, వేలంపాటలో పాల్గొనడం నేరమని విమర్శించారు. ఈ తప్పును రాష్ట్ర ప్రభుత్వం సరిదిద్దుకోవాలని సూచించారు. వేలంపాటను రద్దు చేయాలనీ, శ్రావణపల్లి బొగ్గుబ్లాకును సింగరేణికే కేటాయించాలంటూ కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.

కోర్టుల్లో పెండింగ్‌లో 5 కోట్లకు పైగా కేసులు

- యూపీ దిగువ కోర్టులలో గరిష్టంగా 1.18 కోట్లు
- కేంద్రం సమాచారం



న్యూఢిల్లీ : భారత్‌లోని న్యాయస్థానాల్లో కోట్లాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. లోక్‌సభలో కేంద్రం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ప్రకారం.. దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో ఐదు కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. యూపీలోని సబార్డినేట్ కోర్టులలో గరిష్టంగా 1.18 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సుప్రీంకోర్టులో 84,045 కేసులు పెండింగ్‌లో ఉండగా, వివిధ హైకోర్టుల్లో 60,11,678 పెండింగ్‌లో ఉన్నాయని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. జిల్లా, సబార్డినేట్ కోర్టులలో అత్యధికంగా 4,53,51,913 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఫిజికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సపోర్టింగ్ కోర్ట్ స్టాఫ్ లభ్యత, ఇమిడి ఉన్న వాస్తవాల సంక్లిష్టత, సాక్ష్యాధారాల స్వభావం, బార్, ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు, సాక్షులు, లిటిగేట్‌లతో సహా వాటాదారుల సహకారంతో సహా అనేక కారణాలు కేసుల పెండింగ్‌కు దారితీస్తున్నాయని మేఘవాల్ చెప్పారు. కేసుల పరిష్కారంలో జాప్యానికి దారితీసే ఇతర అంశాలు వివిధ రకాల కేసుల పరిష్కారానికి కోర్టులు నిర్దేశించిన కాలపరిమితి లేకపోవటం, తరచూ వాయిదాలు వేయటం, విచారణ కోసం పర్యవేక్షించటానికి, ట్రాక్ చేయటానికి, కేసులను పర్యవేక్షించటానికి తగిన ఏర్పాట్లు లేకపోవటమని మంత్రి తెలిపారు.

ధరణి స్థానంలో కొత్త చట్టం

- శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు
- రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత సంప్రదింపులు
- సమస్యల అధ్యయనానికి పైలట్ ప్రాజెక్టుగా ఓ మండలం ఎంపిక : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"ధరణితో తలెత్తుతున్న సమస్యల శాశ్వత పరిష్కారానికి మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరముంది. ఎన్నో ఏండ్లుగా ఉన్న ఈ సమస్యను సులభంగా పరిష్కరించలేం. భూ సమస్యలు నానాటికీ ఎక్కువవుతున్న నేపథ్యంలో విస్తృత సంప్రదింపులు, అఖిలపక్ష భేటీ తర్వాత సమగ్ర చట్టం రూపొందిస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ధరణి సమస్యలు, పరిష్కార మార్గాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఒకప్పు డు గ్రామ స్థాయిలో అందుబాటులో ఉండే రికార్డుల మార్పు క్రమంగా మండల, జిల్లా కేంద్రాలకు ఆ తర్వాత రాష్ట్ర స్థాయికి బదలాయించడంతో భూ సమస్యల పరిష్కారానికి అప్పీలు చేసుకునే అవకాశం లేకుండా పోయిందని సీఎం అన్నారు. గత సర్కార్ చేపట్టిన ధరణి పోర్టల్‌తో గ్రామ, మండల స్థాయిలో ఏ సమస్యకు పరిష్కారం లేకుండా పోయిందని అభిప్రాయపడ్డారు. భూమికి సంబంధించిన మొత్తం అధికారాలు జిల్లా కలెక్టర్లకు అప్పగించడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. కలెక్టర్లు తీసుకునే ఏ నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా ధరణిని రూపొందిం చారని సీఎం వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారా నికి ధరణి కమిటీ ఆధ్వర్యంలో విస్తృత సంప్రదిం పులు, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిం చనున్నట్టు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని అన్ని పార్టీలతో అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేసిన తర్వాతే సమగ్ర చట్టం తీసుకురానున్నట్టు సీఎం పేర్కొ న్నారు. భూదాన్, పోరంబోకు, బంచరాయి, ఇనాం, కాందిశీకుల భూ సమస్యలున్న ఓ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి అధ్యయనం తర్వాత సమగ్ర నివేదిక రూపొందిస్తే వాటిపై పూర్తి స్పష్టత ఏర్పడుతుందని అభిప్రాయ పడ్డారు. అవసరమైతే వీటన్నింటిపై శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, మాజీ మంత్రి జానా రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్ కుమార్, రేమండ్ పీటర్, మధుసూదన్, పాల్గొన్నారు.

నేడు నిటి ఆయోగ్ పాలకమండలి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ మద్యం స్కాం కేసులో తీహార్ జైల్‌లో ఉండటం వల్ల హాజరుకాలేరు. అలాగే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిటి ఆయోగ్ సమావేశానికి హాజరుకారని వార్తాలు వచ్చాయి. ఆమె మాత్రం తాను నిటి ఆయోగ్ సమావేశానికి హాజరు అవుతానని, సమావేశంలోనే నిరసన తెలుపుతానని ప్రకటించారు.విక్షిత్ భారత్ ఏ2024 విజన్‌ని ముందుకు తీసుకెళ్లేందుకు నిటి ఆయోగ్ తొమ్మిదో పాలక మండలి సమావేశం శనివారం రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరగనుంది. 'ఈజ్ ఆఫ్ లివింగ్ పై దృష్టి సారించి, భవిష్యత్తు అభివృద్ధిపై దృష్టి పెట్టండి' అనే నినాదంతో ఈ సమావేశం జరగనుంది. విక్షిత్ భారత్ ఏ 2047లో విజన్ డాక్యుమెంట్ కోసం అప్రోచ్ పేపర్‌పై గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం చర్చిస్తుంది. ఈ సమావేశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భాగస్వామ్య పాలన, సహకారాన్ని పెంపొందించడం. ప్రభుత్వ జోక్యాల మెకానిజమ్‌లను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ, పట్టణ జనాభా రెండింటికీ జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది' అని నిటి ఆయోగ్ పేర్కొంది. ఈ సమావేశంలో విక్షిత్ భారత్ ఏ2047 లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్రాల పాత్రపై వివరణాత్మక చర్చలు కూడా జరుగుతాయని తెలిపింది.

దేశం జీడీపీ 5 ట్రిలియన్ల అమెరికన్ డాలర్లు దాటడం, 2047 నాటికి 30 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవాలనే ఆకాంక్షతో ప్రపంచంలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే మార్గంలో ఉంది. 2047 నాటికి 'విక్షిత్ భారత్' విజన్‌ను సాధించడానికి కేంద్ర, రాష్ట్రాల మధ్య సహకార విధానం అవసరం. 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ఈ విజన్ కోసం రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్రం, రాష్ట్రాల మధ్య టీమ్‌వర్క్‌ను 'టీమ్ ఇండియా'గా ప్రోత్సహిస్తుందని నిటి ఆయోగ్ పేర్కొంది.

నిటి ఆయోగ్ పాలక మండలి 2023 డిసెంబర్ 27-29 మధ్య జరిగిన మూడో జాతీయ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల కాన్ఫరెన్స్ సిఫార్సులపై దృష్టి సారిస్తుంది. 'ఈజ్ ఆఫ్ లివింగ్' అనే విస్తృతమైన థీమ్ కింద, ప్రధాన కార్యదర్శుల మూడో జాతీయ సదస్సులో సిఫారసులు చేయబడ్డాయి.

నిటి ఆయోగ్ ఎజెండా

- **తాగునీరు :** యాక్సెస్, పరిమాణం, నాణ్యత
- **విద్యుత్:** నాణ్యత, సామర్థ్యం, విశ్వసనీయత
- **ఆరోగ్యం:** యాక్సెసిబిలిటీ, స్థోమత, సంరక్షణ నాణ్యత
- **పాఠశాల విద్య :** అందుబాటులో, నాణ్యత
- **భూమి, ఆస్తి :** యాక్సెసిబిలిటీ, డిజిటలైజేషన్, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్

అలాగే సైబర్ సెక్యూరిటీ, వెనుకబడిన జిల్లాలు, బ్లాక్‌ల కార్యక్రమం, రాష్ట్రాల పాత్ర, పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ (ఏఐ) గురించి చర్చించడానికి ప్రత్యేక సెషన్‌లు కూడా నిర్వహించామని నిటి ఆయోగ్ తెలిపింది. వీటిని ప్రధాన కార్యదర్శుల 3వ జాతీయ సదస్సులో కూడా చర్చించారు. నిటి ఆయోగ్‌కి ప్రధానమంత్రి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. సభ్యులుగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు ఎక్స్-అఫీషియో సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్, సభ్యులు ఉంటారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. ఆయనతో పాటు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో పాటు బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. అలాగే ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.

త్వరలో ఎల్బీ స్టేడియంలో సీఎంకు కృతజ్ఞత సభ

- పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో నిర్వహణ
- వేం నరేందర్‌రెడ్డితో ఉపాధ్యాయ సంఘాల సమావేశం
- ఆగస్టు 15 తర్వాత డీఏ విడుదల
- విద్యాశాఖ అధికారులతో ప్రాధాన్యతల వారీగా సమస్యలపై చర్చ
- ఆ తర్వాత రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోన్నతులు పొందిన సుమారు 20 వేల మంది టీచర్లతో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రికి కృతజ్ఞత సభ, ఉపాధ్యాయుల సమ్మేళనాన్ని నిర్వహించాలని ప్రభుత్వం సూచన ప్రాయంగా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపట్టిన విషయం తెలిసిందే. వారితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత చెప్పే సమ్మేళనాన్ని నిర్వహించాలని భావించింది. సీఎం అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత దీన్ని నిర్వహించే అవకాశమున్నది. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్‌తో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో), తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీటీజేఏసీ) ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వచ్చేనెల మూడున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లడానికి ముందే బదిలీలు, పదోన్నతులు సజావుగా నిర్వహించడంపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిసి ధన్యవాదాలు తెలుపుతారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి విద్యాశాఖ అధికారులతో ముందు చర్చించాలని నిర్ణయించారు. ప్రాధాన్యతల వారీగా సమస్యలను క్రోడీకరించి అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వాటిని పరిష్కరించాలని కోరే అవకాశమున్నది.

ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేస్తాం : వేం నరేందర్‌రెడ్డి

రైతు రుణమాఫ పూర్తయిన వెంటనే ఆగస్టు 15 తర్వాత ఉపాధ్యాయ, ఉద్యోగులకు బకాయి ఉన్న డీఏ ప్రకటిస్తామని ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో వేం నరేందర్‌రెడ్డి వెల్లడించారు. ఒకటి లేదా రెండు డీఏలకు సంబంధించి సీఎం నిర్ణయం తీసుకుంటారని వివరించారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు సజావుగా నిర్వహించినందుకు ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. బదిలీలు, పదోన్నతుల్లో ఏర్పడిన సమస్యలపై ఉన్న అప్పీళ్లను సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వాటిని పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశిస్తామని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని విజ్ఞప్తి చేయగా, వెంటనే డీజీపీకి విషయం చెప్పి కేసులను ఉపసంహరించాలంటూ ఆదేశించారని వివరించారు. పరిమిత సంఖ్యలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, అధికారులు సమావేశాన్ని నిర్వహించి సాధ్యాసాధ్యాలపై చర్చించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత ముఖ్యమంత్రితో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించుకుందామని వివరించారు. త్వరలోనే ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పటానికి అపాయింట్‌మెంట్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేసేందుకు మహిళా సంఘాల వారి నుంచి నియమించి సరైన గౌరవ వేతనం చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరారు. పీఆర్సీపై కొంత సమయం తీసుకుని ఆర్థిక పరిస్థితిని చూసి ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలలకు ఉచిత విద్యుత్ పథకం వర్తింపజేయాలని సూచించారు. 317 జీవో బాధితుల సమస్య పరిష్కారం దిశగా మంత్రివర్గం చూస్తుందని వేం నరేందర్‌రెడ్డి వివరించారు. కోర్టు ఆటంకాలను తొలగించి మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేయిస్తామనీ, వాటిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కోసం సీఎం చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో యూఎస్‌పీసీ, జాక్టో, టీటీజేఏసీకి చెందిన 40 ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూసమస్యను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్

- కూలీల భరోసాకు నిధులు లేని రాష్ట్ర బడ్జెట్
- అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం: ప్రధాన కార్యదర్శి బి.వెంకట్




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూమిలేని పేదలకు ప్రభుత్వ భూములను, పోడు భూములను పంపిణీ చేయడం ఇళ్ల స్థలాలు కేటాయించడం వంటి భూ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విస్మరించాయని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. వ్యవసాయ కూలీలకు సంబంధించి ఆర్భాటంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్లో నామమాత్రపు నిధులను కేటాయించటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగార్చారని వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధికి కేంద్రం అదనపు నిధులు కేటాయించేలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మ్యాచింగ్ గ్రాంట్‌గా 10 శాతం నిధులను కేటాయించాల్సి ఉన్నా.. ఒక్క పైసా కేటాయించకపోవడం దారుణమన్నారు. కేంద్రం కేటాయించిన నిధుల్లో ఎక్కువ భాగం గత బకాయిలకే పోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా నాలుగు నెలలకు పైగా చేసిన పనికి కూలీలకు బకాయిలు చెల్లించ లేదని గుర్తుచేశారు. పని దినాలను పెంచుతామనీ, రోజు కూలీ కూడా రూ. 400 ఇస్తామన్నారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇండ్లు కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకోసం బడ్జెట్లో కేటాయించిన రూ. 8,424 కోట్లు ఏ మూలకు సరిపోవని విమర్శించారు. వ్యవసాయ కూలీలకు కూలి భరోసా కింద రూ.902 కోట్లు బడ్జెట్లో చూపారని రాష్ట్రంలో ఎంతమంది వ్యవసాయ కార్మికులు ఉన్నారనే లెక్క ప్రకటించలేదని తప్పుపట్టారు. పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని వాగ్దానం చేసి బడ్జెట్లో ఒక పైసా కేటాయించలేదనీ, కౌలు రైతులకు రూ.15 వేలు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ బడ్జెట్లో వారి పేరే ఉచ్చరించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద నీతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మహిళలకు 2500 రూపాయలు ప్రకటనకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపల ఈ అంశాలపై పునర్‌పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు పాల్గొన్నారు.

సంపాదకీయం

పద్దులపై సుద్దులు...



మెరిసేదంతా బంగారం కాదన్న సంగతి అందరికీ తెలిసిందే. పాలకుల విధానాలు, వారు చెప్పే మాటలకు ఇది సరిగ్గా సరిపోతుంది. గత పదేండ్ల బీఆర్ఎస్ ఏలుబడి అయినా.. ఇప్పటి పాలన అయినా ఇందుకు మినహాయింపేమీ కాదు. ఇంకా చెప్పాలంటే దశాబ్దకాలంగా దేశాన్ని ఏలుతూ మొన్నటి బడ్జెట్‌లో తెలంగాణకు చిల్లి గవ్వ కూడా ఇవ్వని మోడీ సర్కార్‌కు పైసామెత నూటికి రెండొందలపాళ్లు అతుకుతుంది.

'బడ్జెట్ అనేది కేవలం అంకెల సమాహారం కాదు.. అది మన విలువల, ఆశల వ్యక్తీకరణ కూడా...' 2024 -25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా విత్తమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్య ఇది. నిజమే... ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో అన్యాయం జరిగిందని తెలం గాణ ప్రజలు భావించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగానే స్వరాష్ట్రం ఏర్పాటైంది. పదేండ్ల కాలం గడిచిపోయింది. మరి నిజంగా ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాయా?

ఏకకాలంలో రుణమాఫీ చేస్తాం, రైతుబంధు(భరోసా)ను పెంచుతాం, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకూ ఆర్థిక సాయమందిస్తాం, పింఛన్లను రూ.4వేలకు పెంచుతామంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గట్టిగానే మాటలు చెప్పింది. కానీ భట్టి గారి బడ్జెట్ ప్రసంగంలో మాత్రం ఆయా అంశాలకు కేటాయింపులు సరిగా లేకపోవటం గమనార్హం. పైగా అప్పులు, వాటికి వడ్డీలు, పేరుకు పోయిన బకాయిలు, కొత్త పథకాలకు నిధుల గురించి అడిగితే...'ఏం చెయ్య మంటారు మరి..?' అంటూ ఉప ముఖ్యమంత్రి ఉసూరుమంటూ సమాధాన మివ్వటం ఆశ్చర్యకరమే.

అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాల్సిన సమయమిది. నియామకాలకు సంబంధించి అనేకానేక అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకోవటంతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువత గులాబీ పార్టీని ఇంటికి సాగనంపింది. నీళ్ల విషయంలో జరిగిన గోల్‌మాల్ అంతా కాళేశ్వరం నుంచి అసెంబ్లీ దాకా వరదై తాకింది. ఇప్పుడు మనం బడ్జెట్ ఊపులో ఉన్నాం కాబట్టి... నిధుల గురించి లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసర ముంది. బడ్జెట్‌ను ప్రతిపాదించిన ప్రభుత్వ విధానాలను, దాంట్లో ఏమీ లేదంటూ కొట్టిపారేసిన ప్రతిపక్ష నేతల తీరునూ ప్రశ్నించాల్సిన ఆవశ్యకత ఉంది.

గత పదేండ్ల కాలంలో ఉన్నతాధికారులు చెప్పినా వినకుండా మనది ధనిక రాష్ట్రం, మిగులు రాష్ట్రమంటూ ఊదరగొట్టిన గులాబీ బాస్ ఆఖరికి సుమారుగా ఏడు లక్షల కోట్ల అప్పును మన నెత్తిన పెట్టిపోయారు. వాటికి వడ్డీల రూపంలో నెలకు మరో రూ.18 వేల కోట్లను అంటగట్టారు. సుమారు రూ.40 వేల కోట్ల మేర వివిధ రంగాలు, శాఖలకు బకాయిలు 'పేరుకుపోతే... వాటి గురించి కిమ్మనకుండా 'మీ సావు మీరు చావండం'టూ 'కారు' దిగి నెమ్మదిగా జారుకున్నారు. ఇప్పుడదే 'కారు సారు...' ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో 'ఠాక్.. బడ్జెట్ లేదు, గిడ్జెట్ లేదు.. ఇదంతా పొలిటికల్ స్పీచ్, ఒట్టి గ్యాస్, అంతా ట్రాష్...' అంటూ శాసనసభ మీడియా పాయింట్ వేదికగా ఒంటికాలి మీద శివాలెత్తారు. ఒకవైపు ఆర్థిక మంత్రి సభలో పద్దును ప్రతిపాదిస్తుండగానే, ఆయన చదవటం పూర్తి కాకుండానే నిబంధనలకు విరుద్ధంగా మాజీ సీఎం ఈ విధంగా 'మీడియా పాయింటెక్కటం' చూసి రాజకీయ విశ్లేషకులు విస్తుపోతున్నారు. గతంలో ఇదే తరహాలో అప్పటి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నేతలు మీడియాతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారు. వారిని అడుగు కూడా ముందుకు కదలనీయకుండా ఆపేశారు. ఈ నియమాలన్నీ ఈనాటి ప్రతిపక్ష నేతకు తెల్వదా..? ఇవన్నీ ఒక ఎత్తయితే బడ్జెట్‌ను చీల్చి చెండాడుతాం, విశ్వరూపం చూపిస్తాం, ప్రళయ గర్జన చేస్తామంటూ సినిమాల్లో బాలయ్యబాబులా డైలాగులు కొట్టటం మరీ విడ్డూరం. సుదీర్ఘ అనుభవమున్న రాజకీయ నాయకుడిగా, పదేండ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నేతగా బడ్జెట్‌లోని అంశాలను శాస్త్రీయంగా, సహేతుకంగా, అర్థవంతంగా వివరించి, ప్రభుత్వ డొల్లతనాన్ని బయటపెట్టాల్సిన పెద్ద మనిషి బాహుబలి డైలాగులు కొడితే ఏం లాభం? ఇక్కడ కావాల్సింది విశ్వరూపాలు, ప్రళయ గర్జనలు కాదు.. అర్థవంతమైన చర్చలు, సమస్యలకు పరిష్కారాలు.

ఇక పద్దును ప్రవేశపెట్టిన సర్కారేమీ తక్కువేం తినలేదు. వివిధ రంగాలకు కేటాయింపులు భారీగానే ఉన్నా, ఖర్చు ఏ మేరకు ఉంటుందోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ వర్గ, ప్రజాసంఘాలు తమ తమ రంగాలకు కేటాయింపుల పట్ల పెదవి విరవడమే కాదు, ఆందోళనలకు పిలుపునివ్వటం గమనార్హం. ఏకకాలంలో రుణమాఫీ చేస్తాం, రైతుబంధు(భరోసా)ను పెంచుతాం, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకూ ఆర్థిక సాయమందిస్తాం, పింఛన్లను రూ.4వేలకు పెంచుతామంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గట్టిగానే మాటలు చెప్పింది. కానీ భట్టి గారి బడ్జెట్ ప్రసంగంలో మాత్రం ఆయా అంశాలకు కేటాయింపులు సరిగా లేకపోవటం గమనార్హం. పైగా అప్పులు, వాటికి వడ్డీలు, పేరుకు పోయిన బకాయిలు, కొత్త పథకాలకు నిధుల గురించి అడిగితే...'ఏం చెయ్య మంటారు మరి..?' అంటూ ఉప ముఖ్యమంత్రి ఉసూరుమంటూ సమాధాన మివ్వటం ఆశ్చర్యకరమే. పదేండ్ల తెలంగాణ ఆర్థిక స్థితి గతులు, రుణ భారాల గురించి తెలుసుకోకుండానే కాంగ్రెస్ నేతలు ఇబ్బడి ముబ్బడిగా హామీలు ఇచ్చారని భావించాలా? అంటూ జనం బుగ్గలు నొక్కుకుంటున్నారు.

గులాబీ, హస్తం పార్టీల తీరిలా ఉంటే...ఢిల్లీ గద్దెనెక్కిన కమలనాథుల రీతి మరీ దుర్మార్గంగా ఉంది. 'చిన్నప్పుడు చింతకాయలమ్మి బతికినోడు, పెద్దయ్యాక ఆ కాయలేంటి వంకరటింకరగా ఉన్నాయంటూ' వంకలు పెట్టాడంట. ఆ తరహాలో దేశాన్ని అప్పుల ఊబిలో దింపి, జనంపై ఆర్థిక భారాలు మోపి, ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతూ, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలంటూ ఊదరగొట్టి, వాటి సంగతే మరిచిన బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, ఏలేటి మహేశ్వరరెడ్డి రాష్ట్ర బడ్జెట్‌పై విశ్లేషణలు చేస్తూ విరుచుకుపడటం గురివింద చందంగా ఉంది. అందుకే సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పినట్టు 'నేతా నహీ.. నీతి బదలావో...' అంటే నేతలను కాదు, వారి విధానాలను మార్చాలి. తెలంగాణ కొంగు బంగారం సింగరేణి రక్షణకు సీపీఐ(ఎం) సన్నద్ధమవడం దాంట్లో భాగమే.

మెయిల్ @ నవతెంగాణ

'మూడెకరాల భూపంపిణీ' ముందుకు సాగేనా!?

దళితుల జీవన స్థితిగతుల్లో మార్పు తేచ్చేందుకని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'దళితులకు మూడెకరాల భూపంపిణీ' మూన్నాళ్ల ముచ్చటగా మారింది. మూడెకరాల భూమిచ్చి విద్యుత్, బోరుబావులు ఏర్పాటు చేసి నిమ్న వర్గాల ఆత్మగౌరవాన్ని పెంచుతామని ప్రకటించిన పథకం ఆటకెక్కింది.గత సర్కార్ చెప్పినట్టు మెరుగైన సమాజం పక్కనబెడితే దళితుల జీవితాల్లో పెద్దగా మార్పులేమీ రాలేదు. గతంలోనే ఈ పథకం సరిగా అమలు చేయకపోవడం పట్ల అనేక విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంపై తన వైఖరిని ప్రకటించలేదు. తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల్లో దళితుల జనాభా ఎనభై లక్షల పైమాటే. మొత్తం రాష్ట్ర జనాభాలో దళితుల జనాభా ఇరవై మూడు శాతం. అరవై కులాలకు పదిహేను శాతం రిజర్వేషన్లు అమలవుతోంది. అయితే రాష్ట్రం ఆవిర్భవించాక అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేల 242 కుటుంబాలకు 15వేల ఎకరాల భూమిని మాత్రమే పంపిణీ చేసినట్టు గణాంకాలను బట్టి తెలుస్తోంది.ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల్లో సాగుకు యోగ్యమైన భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా సగానికి పైగా సాగుకు అనుకూలంగా లేని రప్పలు, రాళ్ల, బీడు భూములు పంపిణీ చేశారు.దీంతో దళితులు సాగు చేయకుండా పడావు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. విభజనతో పది జిల్లాలు కాస్త ముప్పై మూడు జిల్లాలు ఏర్పాటు కావడంతో అమాంతం భూముల ధరలు అనూహ్యంగా పెరిగిన క్రమంలో దళితులకోసం భూములు కొనుగోలు చేయలేమని తెలంగాణ ఎస్సీ కార్పోరేషన్ ప్రకటించింది. దీంతో అట్టహాసంగా ప్రారంభించిన దళితులకు మూడెకరాల భూపంపిణీ అర్ధాంతరంగా ఆగిపోయింది. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తోంది. దళితులకు మూడెకరాలు భూపంపిణీపై నేటికీ ఒక విధాన ప్రకటన చేయలేదు. ఈ పథకం కొనసాగుతుందా? లేదా అనే విషయమై దళితుల్లో ఆందోళన నెలకొంది.

-గుర్రం రాంమోహన్ రెడ్డి,
7981018644

ఇంకెన్నాళ్లీ... నినాదాలు?


జి.తిరుపతయ్య

రాబోయే పంద్రాగస్టు 'థీం' (నినాదం)ను 'వికసిత్ భారత్'గా కేంద్రం తీర్మానించింది. గత వారం రోజుల ముందు 'ఓకల్ ఫర్ లోకల్' నినాదాన్ని బలంగా వినిపించాలని ఆర్థిక శాఖ యోచిస్తున్నట్లు కూడా తెలియవచ్చింది. కవులు, రచయితలు, మేధావులిచ్చే నినాదాలను స్ఫూర్తిగా తీసుకొని పాలకులు విధానాలను రూపొందించాలి, వాటిని సఫలీకృతం చేయాలి. పాలకులే నినాదాలు ఇస్తూపోతే ఇక ప్రజల కడుపుకిందికి నీళ్లెవరు తోస్తారు? గతంతో పోలిస్తే ప్రస్తుతం ఏర్పడిన ప్రభుత్వానికి మెజారిటీ తగ్గడానికి ప్రధాన కారణం ప్రజల సమస్యల పట్ల సరైన స్పందన లేదనేది స్పష్టం. ఇది గుర్తించకుండా ఇంకా నినాదాలతో కాలం గడపాలనుకోవడం మోసపూరితం, వారి నిస్సహాయత. భారత్ వికసిస్తోందని నమ్మే వారు కింది అంశాలను కాస్త పరిశీలించాలి.

నెలసరి 20 వేలలోపు ఆదాయానికి అవకాశమున్న 2200 ఎయిర్‌పోర్ట్ హమాలీ (లోడింగ్ అన్‌లోడింగ్) పోస్టులకు 25వేల మంది అభ్యర్థులు ఎగబడ్డారు. దేశం నలుమూలల నుండి ముంబై ఎయిర్‌పోర్టుకు వీరందరూ తరలి వెళ్లారు. సదరు ఉపాధికి కావలసిన అప్లికేషన్ ఫారం కోసం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి తిండి నీరు లభించక అనేకమంది సొమ్మసిల్లి పోయారు. అయినా పట్టు వదలకుండా ఊపిరి బిగపట్టుకుని అప్లికేషన్ ఫారం కోసం క్యూ లైన్‌లో ముందుకు నడుస్తూ ఆర్గనైజర్ల నిర్లక్ష్యం వలన పెద్ద ఎత్తున తొక్కిసలాట జరిగి అనేకమంది ఆసుపత్రి పాలయ్యారు. అత్యంత పదునైన యువతలో నిరుద్యోగం తాండవిస్తోందనడానికి ఇది ఉదాహరణగా సరిపోదా? ఇలాంటి సమస్యను నివారించడానికి ప్రయత్నించకపోగా యూనియన్ హోమ్ మినిస్టర్ సమక్షంలోనే మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే "యువత డిగ్రీ సర్టిఫికెట్ల కోసం ప్రయత్నించకుండా మోటార్ సైకిల్ పంక్చర్ దుకాణం పెట్టుకుంటే బాగుపడతారని" ఎద్దేవా చేస్తూ సలహా ఇచ్చారు. పంక్చర్ల షాపులు పెట్టుకోవడం తప్పేమీ కాదు. కానీ



18వ లోక్‌సభ కొలువు తీరగానే ప్రధానమైన ఎనిమిది క్యాబినెట్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉపాధి కల్పనపై ప్రతి సందర్భంలోనూ ఒక కమిటీ ఏర్పడుతుంది. ఈసారి ఉపాధి కల్పనపై ఏర్పడే కమిటీ పేరు మారుస్తూ 'నైపుణ్యం మరియు బతుకుదెరువు' (స్కిల్ అండ్ లైవ్లీ హుడ్) అనే పదాలను జోడించారు. ఇది అభినందనీయం. ఎందుకంటే భారత దేశంలో పెరుగుతున్న మానవ వనరులలో స్కిల్ డెవలప్‌మెంట్ సరిగా లేదని, దాని వలన బతుకుదెరువు కష్టమవుతుందన్న అంశాన్ని ఒప్పుకున్నందుకు. అయితే ఈ పేరు మార్పు కమిటీకే పరిమితం కాకుండా విద్యా విధానంలో, నైపుణ్యాలను ఒనగూర్చే విభాగాలలో విధానాలను రూపొందించినప్పుడే అది సాధ్యమవుతుంది.

చదువుకోవాల్సిన అవసరం లేదని ప్రజాప్రతినిధి సలహా ఇస్తున్నారంటే అది వారి తెలివి తక్కువ తనమా, లేక ఉపాధి కల్పనలో తమ చేతగానితనాన్ని బయట పెట్టుకుంటున్నట్టా? చదువుకున్న వాళ్లలో డిగ్రీ స్థాయికి చేరలేని వాళ్లు 70 శాతం మంది ఉన్నారు. వీరంతా విరామమెరుగని ఉపాధికి ఆమడ దూరంలో ఉన్నారు. అలాంటి వారికి పంక్చర్ షాపు, సమోసా బండి లాంటి అనేక ప్రత్యామ్నాయ ఉపాధిని సూచించండి. దానికోసం ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయండి. కానీ డిగ్రీ స్థాయికి చేరుకోవడం కూడా తప్పే అనే అభిప్రాయాన్ని వ్యక్తపరిస్తే ఈ దేశ యువతను ఏ రకంగా ప్రోత్సహించినట్లౌతుంది? ఇలాంటి నినాదాలతో భారత్‌ను వికసింప చేయాలని చూస్తున్నారా?

యువతలో కొరవడిన నైపుణ్యం

18వ లోక్‌సభ కొలువు తీరగానే ప్రధానమైన ఎనిమిది క్యాబినెట్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉపాధి కల్పనపై ప్రతి సందర్భంలోనూ ఒక కమిటీ ఏర్పడుతుంది. ఈసారి ఉపాధి కల్పనపై ఏర్పడే కమిటీ పేరు మారుస్తూ నైపుణ్యం మరియు బతుకుదెరువు' (స్కిల్ అండ్ లైవ్లీ హుడ్) అనే పదాలను జోడించారు. ఇది అభినంద నీయం. ఎందుకంటే భారత దేశంలో పెరుగుతున్న మానవ వనరులలో స్కిల్ డెవలప్ మెంట్ సరిగా లేదని, దాని వలన బతుకుదెరువు కష్టమవుతుందన్న అంశాన్ని ఒప్పుకున్నందుకు. అయితే ఈ పేరు మార్పు కమిటీకే పరిమితం కాకుండా విద్యా విధానంలో, నైపుణ్యాలను ఒనగూర్చే విభాగాలలో విధానాలను రూపొందించినప్పుడే అది సాధ్యమవుతుంది. ఏటా 15 లక్షల మంది ఇంజినీరింగ్ పట్ట భద్రులు తయారవుతున్నారు. వీరందరిలో అత్యధికులకు క్యాంపస్ ప్లేస్మెంట్‌లు దొరకడం లేదు. చాలా ఆశ్చర్యకరమైన విషయమేమంటే 2022-23 సంవత్సరానికి ఇంజినీరింగ్ పట్టా పొందిన ఐఐటి ఉత్తీర్ణుల్లో 37 శాతం మందికి క్యాంపస్ ప్లేస్మెంట్లు రాలేదు! ఒక మూస పద్ధతిలో భారత యువతకు నైపుణ్యాభివృద్ధి చొప్పించబడుతుంది అని ఈ ఫలితాలు చెప్పకనే చెబుతున్నాయి. దీన్ని రివ్యూ చేసే కమిటీ తక్షణం కావాలి మనకి. ఇదిలా ఉండగా మెడికల్ 'పీజీ' ఎంట్రన్స్‌కు సంబంధించిన నీట్ పరీక్ష పత్రాలు లీకవడం, ఇదివరకే నిర్వహించవలసిన పరీక్ష వాయిదా పడటం, విద్యార్థులను వారి తల్లిదండ్రులను కలవరపెట్టడమే కాకుండా ఇంతటి ప్రతిష్టాత్మకమైన పరీక్ష నిర్వహణలో ఏర్పడుతున్న వైఫల్యాలు దేశ ప్రతిష్టను మసక బారుస్తున్నాయి. సాక్షాత్తు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసి నిందితుల వివరాలు అడిగితే తప్ప అరెస్టులు జరగలేదు.

ఇక భారత దేశ ప్రతిష్ఠకే వన్నెతెచ్చే ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (ఐఏఎస్)కు సంబంధించిన ఎంపికల్లోనూ అవకతవకలు జరిగినట్టు బట్టబయలైంది. పూజా ఖేడ్కర్ అనే ఒక అభ్యర్థి నకిలీ ధృవ పత్రాలతో ఉద్యోగానికి అర్హత సాధించడం, సదరు పత్రాలు అధికారులకు చూపించే క్రమంలో బోల్తా కొట్టించడం జరిగాయని తేలింది. అదీగాక అర్హతకు మించి 12 సార్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షలకు హాజరయ్యిందని తేలడమంటే ఎంతటి సంస్థాగత లోపభూయిష్టానికి ఇది అద్దం పడుతోంది? బయటపడని ఇంకెన్ని కుంభకోణాలు ఇలాంటి ప్రతిష్టాత్మకమైన నియామకాల్లో జరిగాయో అని అనుమానించడంలో తప్పే లేదు. బడా బాబుల పిల్లలందరూ ఇలాంటి పైరవీల ద్వారా గద్దెనెక్కుతున్నారని బహిర్గతమవు తున్నప్పుడు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూతురు కూడా దొడ్డిదారిన ఐఏఎస్ సాధించిందని చక్కర్లు కొడుతున్న వదంతులను కూడా ప్రజల విశ్వసించే అవకాశం ఉంది! నైపుణ్యాభివృద్ధి మాటేమో గాని నైపుణ్యాలను గుర్తించి ప్రతిభావంతులను ప్రజాపాలనలోకి తీసుకొచ్చే క్రమంలో ఇంతటి అవకతవకలు జరుగుతుంటే అది ఈ దేశాన్ని ఎలా వికసింపజేయ గలదు?

ఐటీరంగంలో 'లేఆఫ్'లు

గత రెండేండ్లుగా ప్రపంచ వ్యాప్త ఐటి రంగంలో నియామ కాలలో తగ్గుదల, ఉన్న ఉద్యోగాలను 'లే ఆఫ్'ల పేరున తొలగింపులు సర్వసాధారణమై ఉద్యోగులను వారి కుటుంబ సభ్యులను బహు కలవరానికి గురిచేస్తున్నాయి. వెలువడిన గణాంకాలను బట్టి భారత ఐటీ రంగంలోని ఉద్యోగుల జీతాలలో పెరుగుదల అత్యంత స్వల్ప స్థాయికి పడిపోయింది. ఇన్ఫోసిస్ కంపెనీ సాధారణంగా ప్రతి ఏటా ఉద్యోగులకు ఇచ్చే ఇంక్రిమెంట్లలో మంచి పెంపుదల కనబరుస్తది. కానీ 2022 సంవత్సరంలో 14.6శాతం పెరిగిన ఇంక్రిమెంట్లను 2024 సంవత్సరానికి గాను కేవలం 9 శాతం పెంపుదల చేసింది. గతంలో 10.5శాతం సాలిన వేతనం పెంచిన టిసిఎస్ కంపెనీ ఇప్పుడు 7.9 శాతానికి పరిమితమైంది. విప్రో కంపెనీ కూడా 9.5శాతం సాలీనా వేతనాలు పెంచి సింగిల్ డిజిట్ కే పరిమితమైంది. ఉద్యోగుల నియామకాలలో, వారి నుండి ఆశించే పని విషయంలో, వారికి ఇచ్చే పారితోషికంలో ఎలాంటి యూనిఫార్మిటీ ఈ ఐటీ రంగంలో లేదు. దీనివలన యాజమాన్యం ఎవరినైనా, ఎప్పుడైనా, ఏ విధంగానైనా

ఉపాధి సంబంధిత అంశాలను నిర్లక్ష్యం చేస్తూ తమ ఆశ్రితులకు మాత్రం తాయిలాలు ప్రకటించడంలో వెనుకాడడం లేదు. ఉదాహరణకు; బ్యాంకు రుణాల ఎగవేతదారులను కాపాడడానికి ఇదివరకే ఐబీసీ (ఇన్సాల్విన్సీ బ్యాంక్రప్టసి కోడ్)ను తీసుకువచ్చి డిఫాల్టర్లుగా డిక్లేర్ చేయడానికి ఉన్న 180 రోజుల వ్యవధి కాలాన్ని 90 రోజులకు కుదించి ఎంతో మేలు చేశారు. అసలు డిఫాల్టర్లుగా డి క్లియర్ చేసే కన్నా ముందు మరింత కాలాన్ని ఇవ్వడం కోసం 'ఎవర్ గ్రీనింగ్' (స్వల్ప రుణాలను మంజూరు చేసి ఖాతాను జీవింపజేయడం) పేరుతో ఇచ్చిన రుణాలను ఎన్.పీ.ఎ లుగా మారకుండా చూసేందుకు మరో ప్రతిపాదనతో ఆశ్రిత పెట్టుబడిదారులకు సహాయపడ జూస్తున్నారు. ఇలాంటి వికాసానికి తహతహలాడుతున్నారు కాబట్టే దేశంలోని ఒక శాతం జనాభా 40 శాతం సంపదను తమ గుప్పిట్లో పెట్టుకున్నదని థామస్ పీకేటీ లాంటి వాళ్లే కాదు అధికారిక గణంకాలు కూడా చెబుతున్నాయి.

నియమించుకోవచ్చు, తొలగించవచ్చు. జీతభత్యాల పెంపుదల ల్లోనూ అదే విధానాన్ని పాటించవచ్చు! కార్మిక చట్టాలు ఉద్యోగుల హక్కులను కాపాడేందు కోసం కాకుండా యాజమాన్యాల సంతృప్తి మేరకే అమలు జరుగుతున్నట్టుగా పేపర్ పైన చూపించి సంఘాలు పెట్టుకునే అవకాశాలు లేకపోవడం వల్ల ప్రశ్నించడమే కరువైపోతున్నది ఈ ఐటీ రంగంలో. వాతావరణ మార్పులే మానవ వనరు పునరుత్పత్తిపై ప్రభావాన్ని చూపుతాయి అన్నప్పుడు ఇంతటి మానసిక ఒత్తిడి మరెంత ప్రభావాన్ని చూపిస్తుందో అర్థం చేసుకోవాలి. అందుచేత ఇలాంటి అనిశ్చితి గల రంగాలపై ప్రత్యేకమైన దృష్టి సారించకపోతే భారత్ ఎలా వికసించగలుగుతుంది?

పేదలపై పన్నులు...పెద్దలకు రాయితీలు

ఉపాధి సంబంధిత అంశాలను నిర్లక్ష్యం చేస్తూ తమ ఆశ్రితులకు మాత్రం తాయిలాలు ప్రకటించడంలో వెనుకాడడం లేదు. ఉదాహరణకు; బ్యాంకు రుణాల ఎగవేతదారులను కాపాడడానికి ఇదివరకే ఐబీసీ (ఇన్సాల్విన్సీ బ్యాంక్రప్టసి కోడ్)ను తీసుకువచ్చి డిఫాల్టర్లుగా డిక్లేర్ చేయడానికి ఉన్న 180 రోజుల వ్యవధి కాలాన్ని 90 రోజులకు కుదించి ఎంతో మేలు చేశారు. అసలు డిఫాల్టర్లుగా డి క్లియర్ చేసే కన్నా ముందు మరింత కాలాన్ని ఇవ్వడం కోసం 'ఎవర్ గ్రీనింగ్' (స్వల్పరుణాలను మంజూరు చేసి ఖాతాను జీవింపజేయడం) పేరుతో ఇచ్చిన రుణాలను ఎన్.పీ.ఎ లుగా మారకుండా చూసేందుకు మరో ప్రతిపాదనతో ఆశ్రిత పెట్టుబడిదారులకు సహాయపడ జూస్తున్నారు. ఇలాంటి వికాసానికి తహతహలాడు తున్నారు కాబట్టే దేశంలోని ఒక శాతం జనాభా 40 శాతం సంపదను తమ గుప్పిట్లో పెట్టుకున్నదని థామస్ పీకేటీ లాంటి వాళ్లే కాదు అధికారిక గణంకాలు కూడా చెబుతున్నాయి. ఇదే ఒక శాతం జనాభా దగ్గర సరిగ్గా 30 ఏళ్ల క్రితం 12.5శాతం సంపదనే ఉండేది. సాలీనా నమోదవుతున్న ఆదాయంలో 20శాతం ఈ ఒక శాతం జనాభా ఇప్పుడు అందుకుంటుంటే గత 30 ఏండ్ల క్రితం ఇది 7.9 మాత్రమే ఉండేది. ఎండాకాలంలో మోడు వారిన చెట్టుపై వికసించే మోదుగు పూల రంగుల లాంటిదే ఈ అసమానతల వికసిత్ భారత్. దీనికితోడు పరోక్ష పన్నులను మరింతగా పెంచి, సామాన్య ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. కార్పొరేట్లకు పన్ను రాయితీలిస్తూ, ఎగవేత దారులను, బడా వ్యాపారులను పన్ను పరిధిలోకి తీసుకువచ్చే సాహసమే చేయకపోవడం వల్ల 'వికసిత్' కొందరికే పరిమితమై కష్టాల కడలిలో ఎదురీదడమే అనేకుల కర్తవ్యమవుతున్నది.

సెల్ : 99513 00016

మస్తాన్ టీ స్టాల్

రోజుటి లాగానే పొద్దున్నే 'మార్నింగ్ వాక్' చేసుకుంటూ నేను, నా మిత్రుడు సుబ్బారావు మస్తాన్ టీ స్టాల్ దగ్గరకు వచ్చాం. టీ తాగి, ఏవో కొద్ది కబుర్లు చెప్పుకొని ఇంటికి చేరటం మా దినచర్య. మార్నింగ్ వాక్ చేయడానికి వెళుతున్నామా, మస్తాన్ టీ తాగడానికి వెళ్తున్నావా, కబుర్లు చెప్పుకోవడానికి వెళ్తున్నామా అని అడక్కండి. ఇందులో ఏది లేకపోయినా మాకు ఆ రోజు వెలితిగానే ఉంటుంది. ఆదివారమైతే మరో గంట ఎక్కువగా పిచ్చాపాటి మాట్లాడుకుంటూ తీరిగ్గా పదింటికి ఇంటికి చేరతాం. ఆదివారం మా మస్తాన్ టీ షాపు మిగతా రోజులు కన్నా ఎక్కువమందితో సందడిగా ఉంటుంది.

'మస్తాన్..రెండు స్ట్రాంగ్ టీ' అని కేకేసి అక్కడే బయట ఉన్న చెక్కబల్లపై కూలబడ్డాం. ఒక నలుగురైదుగురు నిలబడి చాయ్ తాగుతూ మాట్లాడుకుంటున్నారు. దాన్ని మేము మస్తాన్ టీ స్టాల్ అని అంటాం కానీ, అక్కడ అటువంటి బోర్డేమి కనబడదు. తెలిసిన వాళ్లకు అది మస్తాన్ షాపు, తెలియని వాళ్లకు టీ స్టాల్.

'కావడి యాత్ర ఇక్కడ జరిగితే, మస్తాన్ తన పేరుతో బోర్డు పెట్టాల్సి వచ్చేది' అన్నాడు సుబ్బారావు యధాలాపంగా.

'కావడి యాత్రా.. అదేమిటి నేనెప్పుడూ వినలేదే' అడిగాడు పక్కనే చాయ్ చప్పరిస్తున్న శ్రోత ఆసక్తితో.

'అది ఇక్కడ లేదులే. నార్త్‌లో జరుగుతుంది. పేపర్లలో కన్వర్ యాత్ర అని చదవలేదా.. అదే' అన్నాడు మావాడు.

'ఓహో.. అదా, గంగానదికెళ్లి కావడిలో ఆ నీళ్లు మోసుకొచ్చి శివాలయాల్లో అభిషేకం చేసేదా? దాని కావడి యాత్ర అని కూడా అంటారా?'

ఇంతలో మరొకరందుకని 'పిచ్చి భక్తి..శివుడు నెత్తినే గంగ ఉంటే మళ్ళీ నీళ్లు గంగా నదికి వెళ్లి తీసుకొచ్చేదేమిటో?.ఈ పాట అన్నవాడు నాస్తికుడేమో.'

'కానీ మనం వేసుకోవాల్సింది ఆ ప్రశ్న కాదు. కావడి యాత్ర జరిగే వందో, రెండువందల కిలోమీటర్ల తోవలో రోడ్డు పక్కన ఉన్న అన్ని రెస్టారెంట్లు, డాబాలు, పాన్ షాపులు, చివరికి బడ్డీకొట్లు కూడా షాప్ పేరుతో బోర్డు పెట్టాలి అని ప్రభుత్వం అంటున్నది. ఆ బోర్డ్ లో షాపు యజమాని, అందులో పని చేసే వాళ్ల పేర్లు వుండాలి. ఇది ఉ. ప్ర. అంటే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశం.'

'ఎందుకంటా..ఈ అనవసరపు ఆయాసపు పని ప్రభుత్వానికి' ప్రశ్న వేశాడు మా మాటలు వింటున్న మరో శ్రోత.

అప్పుడు నేను కల్పించుకుని సంభాషణ సాగించాను.

'మొదట ఇది పోలీసుల ఆర్డర్ లాగా ఉంది గాని, నిజానికి ఇది అక్కడి బీజేపీ ప్రభుత్వం ఆదేశమే. ఎందుకు ఈ ఆదేశం దేనికంటే యాత్రికుల పవిత్రత కాపాడటానికట.అలా అని పోలీసులు అంటున్నారు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమూ అంటున్నది.కానీ, అసలు ఉద్దేశ్యం వేరు."

'అయితే ఇన్నేళ్లు యాత్రికులు పవిత్రంగా ఈ యాత్ర జరపలేదంటున్నదా ఆ ప్రభుత్వం.'

'అలాగైతే మా నాయనమ్మ మైల, మైల అంటూ ఒకటే గోలపెడుతుంటుంది.అక్కడుంటే పోలీస్ ప్రొటెక్షన్‌లో పవిత్రంగా గుడికెళ్లేచ్చేదేమో?'అని ఒకడు నవ్వాడు.

'అలా డైరెక్ట్‌గా అనటం లేదు గాని, యాత్రికులు పూర్తిగా సాత్విక అంటే శుద్ధ శాఖాహారం తీసుకోవాలనుకుంటున్నారట. వారికోసం ఈ ఏర్పాటట.'

' ఏడ్చినట్టుంది చెప్పే కారణం. తాడి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డి కోసం అన్నట్టు. అలా ఉంది ప్రభుత్వం చెప్పేది.' శ్రోత అన్నాడు.

'కరెక్ట్‌గా చెప్పావ్. అసలు విషయం ఏమిటంటే బోర్డు మీద ముస్లిం పేరు ఉంటే అక్కడ ఏమీ కొనవద్దని భోజనం చేయవద్దనే అన్యాపదేశంగా చెప్పటం. ఇది ఒక రకంగా ముస్లింలలో చిన్నాచితక వ్యాపారం చేసుకునే బడుగు జీవుల ఆదాయానికి దెబ్బకొట్టటమే.'

'నాజీ హిట్లర్ టైమ్‌లో యూదులను హింసించటానికి వారి ఇళ్ల మీద గుర్తులు పెట్టేవారు అని చెప్తారు.. ఇది అలాగే వుంది.' అన్నాడు నా మిత్రుడు.

'ఇది అంతకంటే ఘోరంగా ఉంది. మన చేత్తో మనకళ్లే పొడుచుకున్నట్టు బోర్డులు మన ఖర్చుతో మనమే పెట్టుకోవాలి.' ఇంకొకరు మాట కలిపారు.

'ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే, యాత్ర జరిగే మూడు రాష్ట్రాల్లో బీజేపీనే అధికారంలో ఉంది. కానీ, ఈ ఆర్డరు ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనే పెట్టారు. అక్కడి రాష్ట్రాల్లో బీజేపీకి అధికారం సొంతం బలం మీద ఉంది. బీహార్‌లో లేదు. బీహార్‌లో జెడియుతో కలిసి అధికారంలో ఉంది. జెడియు ఇటువంటి ఆదేశాలు ఇవ్వలేదు. పైగా అలా ఇవ్వటం తప్పు అంటున్నది..'



ఒకవైపు పని చేస్తూనే మా మాటలు వింటున్న మస్తాన్ ఒక చేతిలో టీ పొడి, మరో చేతిలో పంచదార తీసుకుని వచ్చి మాకు చూపిస్తూ 'చాయ్ తాగటానికి... టీ తోటలు ఎక్కడ ఉంటాయి, టీ ఆకులు ఎవరు తెంపుతారు, చెరగతోటలకు నీళ్లు ఎవరు పోస్తారు, చెరకు గడల్ని ఎవరు కోస్తారు, వాటిని ఫ్యాక్టరీలకు ఎవరు తీసుకొస్తారు, గేదెల్ని ఎవరు పెంచుతారు, పాలు ఎవరు పితుకుతారు, ఎవరు మా దాకా తీసుకొచ్చి పోస్తారు,వారు హిందువులా , ముస్లింలా, క్రిస్టియన్లా , అనేది చాయ్ తయారుచేసే నాకుగాని, తాగే మీకు గాని అవసరం లేదు.పాలు తెచ్చినవాడు వేరే మతస్తుడని పాలు లేకుండా నేను చాయ్ తయారు చేయగలనా? చాయ్ అద్భుతంగా ఉందని మెచ్చుకుంటూ మీరు తాగగలిగే వాళ్లా? ఇవన్నీ కలిపితేకదా అద్భుతమైన చాయ్ తయారయ్యేది.' అని చెప్పి తిరిగి పనిలో జొరపడ్డాడు.

' బీహార్ లోనే కాదు, ఉత్తరప్రదేశ్‌లో కూడా బీజేపీ మిత్రపక్షాలు ఎస్పీ, బీఎస్పీతో పాటు వ్యతిరేకిస్తున్నాయి. మాట అన్న తర్వాత వెనక్కి తీసుకున్నప్పటికీ బీజేపీ ఉత్తరప్రదేశ్ నాయకుడు అబ్బాస్ నక్వి ఈ ఆదేశాన్ని వ్యతిరేకించాడు. అయినా బీజేపీ ముందుకే వెళుతున్నది, చెట్టు మీద భేతాలుడి లాగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం మౌనంగా వున్నది అంటే ఈ ఆదేశాలకు అంగీకరించినట్టే కదా .'

'అన్నా, ఇది బీజేపీకి ఉన్న అహంకారంగా ఆరెస్సెస్‌కు ఎందుకు కనబడ లేదా?'

ఇట్లా మాట్లాడుకుంటు న్నప్పుడు ఎవరో ఇద్దరు బైక్‌ను టీ స్టాల్ పక్కన ఆపి, మస్తాన్ నుంచి చాయ్ అందుకుని, సిగరెట్లు ముట్టించి, చాయ్ తాగుతూ ఒకపక్క నిలబడి మాట్లాడు కుంటున్నారు.మా మాటలు వింటున్న ఇంకొకరు 'అన్నా, నేను ప్రౌడ్ హిందువును కాకపోయిన ప్పటికీ, హిందువునే. కానీ, నా కొడుకు రంజాన్ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తుంటాడు, వాడికి హలీం అంటే మహా ఇష్టం. మా ఆవిడేమో రంజాన్ పండగ రోజుల్లో కచ్చితంగా చార్మినార్ వెళ్లి తోపుడు బళ్ల దగ్గర షాపింగ్ చేయాల్సిందే.'

'నువ్వు ప్రౌడ్ హిందువు అన్నావు, హిందువులు కాక ఈ రకం హిందువులు కూడా వున్నారా?' వాడి పక్కనున్న వాడు అడిగాడు.

ప్రౌడ్ హిందువు అంటే ఆరెస్సెస్ వాళ్లు, ఇతర మతాలను ద్వేషించే వాళ్లు. మనం మామూలు హిందువులం.అందరూ ప్రశాంతంగా జీవించాలని కోరుకుండేవాళ్లు.'

'అన్నా.. డిసెంబరు, జనవరి నెలల్లో మన వైపు చాలా చోట్ల -అయ్యప్ప భక్తులకు ప్రత్యేక భోజనం కలదు- అనే బోర్డులు కనపడుతుంటాయి. యూపీలో ఈ గొడవెందుకు? అలా బోర్డులు పెడితే సరిపోతుంది కదా,' ఎవరో చెప్తున్నదానికి అందరూ శ్రద్ధగా వింటున్నారు.

'సరిపోతుంది. కానీ వాళ్లకి కావాల్సింది ఆ గొడవేందు కన్నావ్ చూసావా? గొడవే వాళ్లకు కావాల్సింది. హిందూ, ముస్లింల మధ్య తగాదా. అట్లా వుంటేనే తమ అధికారం శాశ్వతంగా ఉంటుందని అనుకుంటున్నారు.' అన్నాను.

అందరూ వింటున్నారు.

'ఇప్పుడు మీరు గమనించారో లేదో, ఇద్దరు బైక్ మీద వచ్చి మస్తాన్ దగ్గర చాయ్, సిగరెట్లు తీసుకుని పక్కన నిలబడి కబుర్లు చెప్పుకుంటూ చాయ్ తాగి వెళ్లారు. వారికి ఈ షాప్ ఏ మతం వాడిదో, ఇక్కడ చాయ్ ఇస్తున్నవాడు ఏ మతం వాడో అక్కర్లేదు. అసలు కొనేవాడికి, అమ్మేవాడికి మధ్య ఈ మత సంబంధం ఉండదు. అది లౌకిక సంబంధం. కానీ దానిలోకి కూడా మతాన్ని జొప్పించాలని చూస్తున్నారు.'

ఒకవైపు పని చేస్తూనే మా మాటలు వింటున్న మస్తాన్ ఒక చేతిలో టీ పొడి, మరో చేతిలో పంచదార తీసుకుని వచ్చి మాకు చూపిస్తూ 'చాయ్ తాగటానికి... టీ తోటలు ఎక్కడ ఉంటాయి, టీ ఆకులు ఎవరు తెంపుతారు, చెరగతోటలకు నీళ్లు ఎవరు పోస్తారు, చెరకు గడల్ని ఎవరు కోస్తారు, వాటిని ఫ్యాక్టరీలకు ఎవరు తీసుకొస్తారు, గేదెల్ని ఎవరు పెంచుతారు, పాలు ఎవరు పితుకుతారు, ఎవరు మా దాకా తీసుకొచ్చి పోస్తారు,వారు హిందువులా , ముస్లింలా, క్రిస్టియన్లా , అనేది చాయ్ తయారుచేసే నాకుగాని, తాగే మీకు గాని అవసరం లేదు.పాలు తెచ్చినవాడు వేరే మతస్తుడని పాలు లేకుండా నేను చాయ్ తయారు చేయగలనా? చాయ్ అద్భుతంగా ఉందని మెచ్చుకుంటూ మీరు తాగగలిగే వాళ్లా? ఇవన్నీ కలిపితేకదా అద్భుతమైన చాయ్ తయారయ్యేది.' అని చెప్పి తిరిగి పనిలో జొరపడ్డాడు.

'కరెక్ట్‌గా చెప్పావ్ మస్తాన్? శ్రమ లేకుండా ఏ వస్తువు తయారుకాదు, ఏ వస్తువు నీ దరి చేరదు. శ్రమ కూడా చేయగలిగేది మనుషులు మాత్రమే. అందుకనే పొలాల్లో, ఫ్యాక్టరీల్లో, ఆఫీసుల్లో, దుకాణాల్లో ఇలా అన్ని చోట్లా, అన్ని దేశాల్లో వందల వేలల్లో పనిచేస్తూ శ్రామికులు కనపడుతుంటారు. మా మతం వాడు చేసిందే తింటామంటే ఆకలితో మలమల మాడి చావాల్సిందే. నోరూరించే మామిడికాయకు మతం ఏమిట్రా బాబోయ్.' అంటూ ఇంటికి వెళ్లటానికి లేచాను.

నాతో పాటే సుబ్బారావు లేచాడు.

'అయినా అటువంటి యాత్రలు ఇక్కడ లేవు కదా. ఇక బోర్డులు, పేర్లు తగిలించే పని వుండదులే' అని వెనక నుంచి ఎవరో అన్నారు.

'మతపిచ్చి వున్నవాడు ఏ సందర్భాన్ని అయినా గొడవలు లేవనెత్తటానికకే వాడుకుంటాడు. అటువంటి పరిస్థితి రాకుండా ఉండటానికి మన జాగ్రత్తలో మనం వుండాలి.'

'అయితే మస్తాన్ కూడా ఎప్పుడో ఒకప్పుడు 'మస్తాన్ టీ స్టాల్ ' అని బోర్డు పెట్టాల్సి వస్తుందేమో.

' సుబ్బారావు, ఒకటి తెలుసుకో. హిందూ, ముస్లిమ్ అనే ఈ రెండు మతాలలోనూ మస్తాన్ పేరుతో వ్యక్తులున్నట్లే, రెండు మతాలలోనూ వున్నది మనుషులే అనే నిజం తెలిసి వుంటే ఈ గొడవలు, అల్లర్లు వుండవు. కాదంటావా?'

ఈ మాటను, మీరైనా, ఎవరైనా కాదనగలరా?

- కర్లపాలెం



షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు

నవతెలంగాణ-కామేపల్లి

రుణమాఫీపై రైతు సమస్యలను కామేపల్లి వ్యవసాయ శాఖ అధికారులను రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అడిగి తెలుసుకున్నారు. కామేపల్లి మండలానికి వచ్చిన ఆయన రైతుసంఘం నాయకులతో కలిసి కామేపల్లి రైతువేదిక వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడారు, రైతు రుణమాఫీపై ప్రభుత్వం నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతుందన్నారు. ఎటువంటి షరతులు లేకుండా బ్యాంకుల్లో పాసుపుస్తకాలపై తీసుకున్న రుణాలన్నింటినీ మాఫీ చేయాలన్నారు. రైతు బంధు ఎకరాలతో సంబంధం లేకుండా పాత పద్ధతిలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేట్లకే కేంద్ర బడ్జెట్

- వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకే అనుకూలంగా ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ అన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా సీపీఐ(ఎం), వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కాచిరాజుగూడెం గ్రామంలో నిరసన తెలిపి బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయడం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడారు. మోడీ మూడోసారి అధికారం చేపట్టాక పేదలపై మరింత కక్షపూరితంగా వ్యవహరించడం హేయమైన చర్య అన్నారు. పాఠశాల విద్యపై అతి తక్కువ బడ్జెట్ ప్రకటించడం దారుణం అన్నారు. ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరోసారి కుట్రపన్నడం బట్టబయలు అయిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు యర్రా శ్రీనివాసరావు, పొన్నెకంటి సంగయ్య ప్రతాపనేని వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) నాయకులు నంద్ర ప్రసాద్, పొన్నం వెంకటరమణ, అద్దంకి తిరుమలయ్య, మురళి, పాషా, భాస్కర్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



ఊరంతా సీజనల్ వ్యాధులే..!

- ప్రత్యేక పాలనలో నిధుల కొరత
- వెంటనే చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-సత్తుపల్లిరూరల్

కాకర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటిలో సీజనల్ వ్యాధుల బారిన పడ్డారని, వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక పాలనలో నిధులు కొరత కారణంగా కనీసం బ్లీచింగ్ కూడా కరువైన పరిస్థితి ఉందన్నారు. దీనికి తోడు ఎడతెరిపి లేని వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చి పడ్డాయన్నారు. కాకర్లపల్లి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. వెంటనే అధికారులు చొరవచూపి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి వేపులపాటి కుమారస్వామి, శాఖ సభ్యులు ఏ చిట్టెమ్మ, లక్ష్మణరావు, బండి వేలాద్రి, కొప్పుల రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ అన్నారు. బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం కేటాయించకుండా కేవలం 7.3% కేటాయించారని, వెంటనే బడ్జెట్‌ని సవరించాలని, ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదన చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. స్థానిక ముస్తఫానగర్‌లోని శాంతినగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు శుక్రవారం దహనం చేశారు.



న్యూవిజన్‌లో కార్గిల్ విజయ్ దివస్

నవతెలంగాణ-ఖమ్మం

భారత వీర జవానులు పాకిస్తాన్‌తో జరిపిన కార్గిల్ పోరులో విజయం సాధించినందుకు గుర్తుగా నిర్వహించే కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నగరంలోని న్యూ విజన్ పాఠశాలలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎమ్‌డి అబాద్ అలీ తెలిపారు. కార్యక్రమంలో ముందుగా వీర జవానుల స్థూపానికి పూలమాలనుంచి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో న్యూవిజన్ పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



యం.వెంకటాయపాలెం, మద్దులపల్లి గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసుతో మంజూరైన చెక్కులను సీపీఐ(ఎం) ఖమ్మంరూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ద్వారా మండలంలో అనేక మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేయడం జరిగిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యండపల్లి వెంకటరామయ్య, జక్కంపూడి నాగేశ్వరరావు, కొట్టే రామయ్య, మునిగంటి యాదగిరి, రామగిరి నాగరాజు, గుర్రం చిన్న వెంకన్న, పాపిట్ల సుధాకర్, గుండెబోయిన రమేష్, పిల్లలమర్రి శ్రీను, గుర్రం రామనాథం, ఏపూరి ఉమ, కోసంగి ఉమేష్, వేమన వినోద్ కుమార్, పెంట్యాల నాగేశ్వరరావు, కర్లపూడి వెంకటేశ్వర్లు, సుభద్ర, తుమాటి నాగయ్య, ఉదయ్, బ్రహ్మం, సతీష్, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సారొచ్చాకే...బాంబుల మోత ఎక్కువైంది

- సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్‌తో అదురుతున్న సత్తుపల్లిలోని భవనాలు
- వర్షంతో ఆగిన ఉత్పత్తిని సాధించే దిశగా పేలుళ్ల తీవ్రతను పెంచిన సింగరేణి
- భయభ్రాంతులకు గురవుతున్న సత్తుపల్లి ప్రజలు



నవతెలంగాణ-సత్తుపల్లి

వాళ్లకి ఇక్కడ సొంతిల్లు ఉండదు... వాళ్లు ఇక్కడ ఏం చేసినా ఊడేదేమీ లేదు...జరిగే నష్టం అంతకన్నా లేదు... ఇక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి లక్ష్యానికి మించి ఉత్పత్తిని సాధిస్తే వీరిని పై అధికారులు నుంచి ప్రశంసలతో ముంచెత్తుతారు... అసలు విషయం చెప్పకుండా ఇదేమి సోది అని అనుకుంటున్నారా... ఇది సోది కాదు... సత్తుపల్లి పట్టణ ప్రజలు, చుట్టుపక్కల, సమీప ప్రాంతాల ప్రజలు ప్రతిరోజూ సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్స్‌తో ఆందోళనకు



గురవుతున్నారనే విషయం అక్షర సత్యం... కష్టపడి ఇల్లు కట్టుకుంటే ఎవరికి కైనా బాధేంటో తెలుస్తుంది... ఏదో ముతక సామెత చందాన ఉంది సత్తుపల్లిలోని ఓపెన్‌కాస్ట్ అధికారుల వ్యవహరిస్తున్న తీరు. సత్తుపల్లికి బొగ్గు గనులు వస్తున్నాయట. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.. సింగరేణి సిరులు కురిపిస్తుందట అని ఓ 30 యేండ్ల కిందట సత్తుపల్లి ప్రాంత ప్రజలు సంబర పడ్డారు. వాళ్లతో వీళ్లతో చెప్పుకుంటూ ఆనంద పడ్డారు. వచ్చాక తెలిసింది సింగరేణి నిజస్వరూపం. 2005లో ఇక్కడ ప్రారంభమైన సింగరేణి బొగ్గు గనులు ఆ రోజు నుంచి మొదలుకొని ఇప్పటి వరకు సమీప ప్రాంతాల ప్రజల ఇబ్బందులకు గురిచేస్తూ ఉత్పత్తే ప్రధాన లక్ష్యంగా మోతాదుకు మించి బాంబులు పేలుస్తూ అధికోత్పత్తిని సాధించి ఆనందపడుతూ ఇక్కడి ప్రజలకు కంటతడి తెప్పిస్తున్నారు. నిబంధనల మేరకు పేలుళ్లు ఉంటే సంస్థ ఇచ్చిన ఉత్పత్తి టార్గెట్‌ను అధిగమించమని కాబోలేమో మోతాదుకు మించి బ్లాస్టింగ్స్ చేస్తూ అధిక ఉత్పత్తిని సాధిస్తోంది సత్తుపల్లిలోని జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనులు.. ఒక్క మాటలో చెప్పాలంటే సత్తుపల్లిని సర్వ నాశనం చేసేంత వరకు సింగరేణి సంస్థ నిద్రపోదని ఇక్కడి ప్రజలకు తేటతెల్లమైంది.

ఈ సారొచ్చాకే బాంబ్ బ్లాస్టింగ్ తీవ్రత ఎక్కువైంది...

2005 నుంచి మొదలుకొని ఇప్పటి వరకు చాలామంది ప్రాజెక్టు మేనేజర్లు ఇక్కడ పనిచేసి వెళ్లారు. బాంబ్ బ్లాస్టింగ్ తీవ్రత ఎక్కువగా ఉందని చెబితే వినేవారు... ప్రజల ఇబ్బందులను గుర్తించి తీవ్రతను తగ్గించే వారు.. తీవ్రతను కొలిచే పరికరాలను సైతం ప్రభావిత ప్రాంతాల వద్ద పెట్టి చూసేవారు. నమోదైన తీవ్రతను బట్టి కొంత వరకు తీవ్రతను తగ్గించేందుకు చర్యలు చేపట్టేవారు. ఇక్కడి ప్రజల బాధలపై పూర్వపు అధికారులకు కొంత వరకైనా కనికరం ఉండేది. ఈ మధ్యకాలంలో పీవోగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ అనే అతను వచ్చిన దగ్గర నుంచి బ్లాస్టింగ్ తీవ్రత గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. దీంతో పాటు ఇటీవల ఎడతెరిపీ లేకుండా కురిసిన భారీ వర్షాలకు గనుల్లోకి నీరుచేరి ఉత్పత్తి కుంటుపడింది.

వారం రోజుల్లో కోల్పోయిన ఉత్పత్తిని సాధించేందుకేనా ఈ బ్లాస్టింగ్ మోతాదు పెంపు..?

వర్షాల కారణంగా కోల్పోయిన బొగ్గు ఉత్పత్తిని కవర్ చేసేందుకు తీవ్రతను పెంచి అధిక మొత్తంలో ఉత్పత్తిని సాధించేందుకు తీవ్రతను పెంచినట్లుగా సింగరేణి అధికారుల పట్ల పట్టణ ప్రజల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తీవ్రత ఉందని చెబితే పాత అధికారులు వినేవారు. ఇప్పుడొచ్చిన అధికారికి వినే ఓపిక కూడా లేదని తెలుస్తోంది. బ్లాస్టింగ్ తీవ్రత గురించి 'నవతెలంగాణ' ప్రతినిధి జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్‌ను వివరణ కోరగా సరైన సమాధానం చెప్పకుండా ఫోన్‌ని మధ్యలోనే కట్‌చేశారు. మరలా ప్రయత్నించగా ఫోన్ ఎత్తకపోవడంతో ఆ అధికారికి వినే ఓపిక లేదని అర్థమైపోయింది.

బాంబ్ బ్లాస్టింగ్ తీవ్రతను తగ్గించకుంటే ఆందోళనకు దిగనున్న ప్రజలు

బాంబుల తీవ్రతను తగ్గించకుంటే సత్తుపల్లి పట్టణ ప్రజలతో పాటు ప్రభావిత ప్రాంతాలకు చెందిన ప్రజలంతా సింగరేణిపై ఆందోళన దిగే అవకాశాలు కనపడుతున్నాయి. ఇప్పటికే మండలంలోని కిష్టారంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లోని నివాసాలు అక్కడి బ్లాస్టింగ్ కారణంగా ఒక్కొక్కటిగా కూలుతున్నాయి. ఇక సత్తుపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఇప్పటికే 200 ఇండ్లకు పైగా సింగరేణి బ్లాస్టింగ్స్‌తో తెబ్బతిని ఉన్నాయి. మైన్‌కు కొద్దిగా దూరంలో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీలోని ఇండ్లు సైతం సింగరేణి పేలుళ్లకు అదురుతున్నాయంటే తీవ్రత ఎంత మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. బ్లాస్టింగ్ తీవ్రతను తగ్గించాలని ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లడం కూడా జరిగింది. తీవ్రతను తగ్గించే విషయంలో ఎమ్మెల్యే దృష్టి సారించాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

నగరంలో పారిశుధ్య సమస్య పరిష్కరించండి

- కుక్కలు, కోతుల బెడద నివారించండి
- పారిశుధ్యం, రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థపై ప్రత్యేక నిధులు కేటాయించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

ఖమ్మం నగరంలో పారిశుద్ధ్యం సమస్య పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. పార్టీ త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నున్నా శుక్రవారం ప్రారంభించారు. పార్టీ త్రీటౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో నున్నా మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యం సమస్య పెరిగిపోయిందని, ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. దీంతో ప్రజలకు విష జ్వరాలు, చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నారని అన్నారు. అలాగే నగరంలో కుక్కలు, కోతుల బెడద చాలా తీవ్రంగా ఉందని, జనాలు రోడ్ల మీదకి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. భారీ వర్షాల కారణంగా రోడ్లు గుంతలుగా మారాయని అనానరు. తక్షణమే నగర పాలకవర్గం స్పందించి ఈ సమస్యలన్నింటికీ త్రీ టౌన్ ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, త్రీ టౌన్ కార్యదర్శివర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాసరావు, 31వ డివిజన్ కార్పొరేటర్ యర్రా గోపి, బండారు యాకయ్య, బండారు వీరబాబు, శీలం వీరబాబు, త్రీ టౌన్ నాయకులు పోతురాజు జార్జి, బజ్జూరి రమణారెడ్డి, సోమవరపు సుధీర్, రంగు హనుమంతచారి, మద్ది సత్యం, వేల్పుల నాగేశ్వరరావు, కొట్టే అలివేలు, శంకర్, పిరయ్య, వెంకటేశ్వరరావు, దాక్షాయిని, మైసమ్మ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలి : వ్యకాస

నవతెలంగాణ-నేలకొండపల్లి



తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పిన వాగ్దానాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మెరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రావెళ్ల సత్యనారాయణ భవన్లో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కె.వి.రామిరెడ్డి అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరల భారంతో పేదలు, వ్యవసాయ కూలీల జీవన పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు రోజువారి కూలీ 250 నుండి 300 రూపాయలు మాత్రమే ఇస్తుండడంతో అవి ఏమాత్రం సరిపోక కుటుంబం గడవక వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు, పేదలకు వాగ్దానం చేసిన నెలకు 2500 రూపాయల జీవనభృతి, భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు, కళ్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం లక్ష రూపాయల ఆర్థిక సహాయం, నెలవారి ఆసరా పెన్షన్ 4 వేల రూపాయలు వంటివి అమలు చేయకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వ్యవసాయ కూలీలకు ఇస్తానని చెప్పిన వాగ్దానాలను అమలు చేయాలని, కౌలు రైతులకు ఎకరానికి 15వేల రూపాయలు పంట సహాయం అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి, తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, ఉపాధిహామీ పనిని 150 రోజులకు పెంచాలని, రోజువారి కూలీ 600 రూపాయలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కంటు పుల్లయ్య, మహిళా సంఘం నాయకులు బెల్లం లక్ష్మి, కెవిపిఎస్ నాయకులు పెదపాక మల్లేశ్వరరావు, వికలాంగుల సంఘం రాష్ట్ర సభ్యులు పి పెరుమాళ్ళు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు, మున్నంగి లక్ష్మి, మందడపు మురళీకృష్ణ, సామల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి ఉమ్మనేని రవి

- సీపీఐ(ఎం) కండువా కప్పి ఆహ్వానించిన 'పొన్నం'

నవతెలంగాణ - బోనకల్



సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు సమక్షంలో శుక్రవారం ఉమ్మనేని రవి సొంతగూటికి చేరాడు. మండల పరిధిలోని గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన ఉమ్మనేని రవి అనివార్య కారణాల వలన సీపీఐ(ఎం) నుంచి బయటకు వెళ్ళాడు. కొంతకాలంగా దూరంగా ఉంటూ తిరిగి తాను మళ్ళీ సిపిఎంలో చేరతానని ఆ గ్రామ పార్టీ నాయకుల ముందు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో ఆ గ్రామ సిపిఎం కమిటీ చర్చించి ఉమ్మనేని రవిని తిరిగి పార్టీలో చేర్చుకునేందుకు పచ్చ జెండా ఊపారు. దీంతో పొన్నం వెంకటేశ్వరరావు సమక్షంలో ఉమ్మనేని రవికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉమ్మనేని రవి మాట్లాడుతూ గతంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడుగా, సిపిఎం మండల కమిటీ సభ్యుడిగా, పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శిగా పని చేశానని, కొన్ని అనివార్య కారణాల వల్ల పార్టీకి దూరమయ్యానన్నారు. మరో పార్టీలోకి వెళ్లే ప్రయత్నం కూడా చేయలేదని, తనకు సరైన పార్టీ సిపిఎం మాత్రమేనని భావించి తిరిగి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పార్టీ గ్రామ కన్వీనర్ ఏడునూతల లక్ష్మణరావు, మాజీ ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, గ్రామ కమిటీ సభ్యులు పొన్నం రాంబాబు, బండి చందర్రావు, కళ్యాణపు బుచ్చయ్య, కళ్యాణపు శ్రీనివాసరావు, నాయకులు పొన్నం రామచంద్రరావు, కోట కాటయ్య, తమ్మారపు లక్ష్మణ్, నల్లమోతు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం

- 9న ప్రపంచ గిరిజన దినోత్సవం ప్రభుత్వాలే జరపాలి
- తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం

నవతెలంగాణ- ఖమ్మం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం విమర్శించారు. శుక్రవారం ఖమ్మంలోని సంఘం జిల్లా కార్యాలయంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం భూక్యా కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వీరభద్రం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లు సవరించి గిరిజనులకు అత్యధిక నిధులు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 9 అంతర్జాతీయ గిరిజన దినోత్సవం కార్యక్రమాన్ని ప్రభుత్వాలు అధికారికంగా జరపాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన సంఘ నిర్వహించే గిరిజన ఉద్యమాలను ప్రజా ప్రజలందరూ బలపర్చాలని విజ్ఞప్తి చేశారు, ఆగస్టు 9న గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలో భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. గిరిజన సాంస్కతి సంప్రదాయాలతో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస నాయక్, భూక్యా కృష్ణ నాయక్, ముడ్ గన్యా నాయక్, బానోత్ బాలాజీ బన్సీలాల్, తజావత్ కృష్ణ కాంత్, హరిచంద్ నాగేశ్వరరావు, నందియా, విజయ, రామారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉపాధ్యాయుల్లేరు....ఆసుపత్రిలో వైద్యుల్లేరు

- ఇదేనా పాలనంటే..?
- విద్య, వైద్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి
- అమ్మ ఆదర్శ కమిటీలను ఎవరు నియమించారు
- సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ కవిత

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ప్రభుత్వ పాఠశాలలలో సరిపోను ఉపాధ్యాయులు లేరు... ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు లేరు... ఇదేనా ప్రభుత్వం విద్య, వైద్యానికి వేస్తున్న పెద్దపీట అని జడ్పిటిసి శీలం కవిత ప్రశ్నించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దేవరకొండ శిరీష అధ్యక్షతన నిర్వహించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద ఎర్రుపాలెం మండలంలో ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కువగా ఉన్నాయని, ప్రాథమిక పాఠశాలలో 50 మంది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో సర్దుబాటు చేసిన తర్వాత ఎన్ని ఖాళీలు ఉన్నాయో తెలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా జడ్పిటిసి కవిత కలగజేసుకొని మాట్లాడుతూ ఎర్రుపాలెం మండలంలోని పాఠశాలలకు మాత్రమే ఉపాధ్యాయుల ఖాళీలు జిల్లాలోనే ఎక్కువగా ఎందుకు ఉంటున్నాయని ప్రశ్నించారు. మండలాన్ని చిన్నచూపు చూస్తున్నారని అన్నారు.

ఎంపీటీసీ సగ్గుర్తి కిషోర్ బాబు మాట్లాడుతూ పెగళ్లపాడు పాఠశాలలో చెట్లు పెరిగి కోతుల వలన విద్యార్థులకు ఏమన్నా అవుతుందని భయమేస్తుందని చెట్లను తొలగించటానికి ఉపాధ్యాయులు సహకరించడం లేదని అన్నారు.

.ఐకెపి ఎపిఎం వెంకటేశ్వర్లు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఎవరు ఎంపిక చేశారన్న సభ్యుల ప్రశ్నకు సమాధానం చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఎంపిక చేయాలని తెల్లవారితే ఎన్నిక కోడ్ వస్తుందనే ఉద్దేశంతో రాత్రికి రాత్రే లిస్టు తయారుచేసి ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులకు తెలియకుండా ఎలా ఎంపిక చేస్తారని సభ్యులు ప్రశ్నించినప్పుడు గ్రామ సమైక్య సభ్యులను నామినేట్‌గా ఎంపిక చేయాలని, ఎన్నికల కోడ్ వస్తుందని ప్రభుత్వం రాత్రికి రాత్రే ఆదేశాలు జారీ చేశారని, మండలంలో 49 మంది కమిటీ సభ్యులతో బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయటం జరిగిందని తెలిపారు. వారి ఎకౌంట్‌లోకి అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి కొరకు 10 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని ప్రభుత్వం ఆదేశాల మేరకే చేశామని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్చార్జి డాక్టర్ సాకేత్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో కుక్కలు, కోతుల దాడిలో 324 మంది గాయపడ్డారని, వారికి వ్యాక్సిన్ అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి కవిత కలగచేసుకుని నవతెలంగాణ పేపర్‌లో 'డాక్టర్లు లేని దవాఖాన' అనే శీర్షిక వచ్చిందని దానిపై మాట్లాడాలని సూచించినప్పుడు దానిపైన చర్చ చేపట్టారు. డాక్టరు సాకేత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పటల్ నందు ఐదుగురు డాక్టర్లు ఉండాలని, ఇన్చార్జి డాక్టర్ గా నేనొక్కడినే పని చేస్తున్నానని పేపర్‌లో వచ్చిన కథనం వాస్తవమే అన్నారు.

ఆగస్టు ఆరవ తారీకుతో ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండటంతో వారిని సన్మానించారు. ఎంపీడీవో కార్యాలయంలో సూపరిండెంట్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్ రెడ్డి బదిలీ కావడంతో వెంకటేశ్వర రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సురేందర్, తాసిల్దార్ మన్నే ఉషా శారద, వైస్ ఎంపీపీ రామకోటేశ్వరరావు, చావా రామకృష్ణ, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన నూతన ఎస్సై బాలస్వామి

నవతెలంగాణ-బోనకల్



బోనకల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న దారెల్లి బాలస్వామి ఎస్సైగా ప్రమోషన్ పొందారు. దీంతో బాలస్వామి శుక్రవారం ఖమ్మం కమిషనరేట్ కార్యాలయంలో సునీల్ దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ బాలస్వామికి ఎస్సై చిహ్నాలను అందజేశారు. బాలస్వామిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు. బాలస్వామి ఎస్సైగా ప్రమోషన్ పొందడం పట్ల సీపీ అభినందనలు తెలిపారు. అనంతరం బోనకల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కడగండ్ల మధుబాబు, ఏఎస్ఐ ఇసంపల్లి స్వర్ణబాబు, సిబ్బంది బాలస్వామికి అభినందనలు తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో పేలుడు

- సిబ్బంది అప్రమత్తం..తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి క్రాస్‌రోడ్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం కేపాసిటర్ సెల్ పెద్దశబ్దంతో పేలింది. అతి వేడికి కెపాసిటర్ సెల్ పేలటంతో సబ్ స్టేషన్‌లో పొగతో కూడి మంటలు ఎగిసాయి. సబ్ స్టేషన్‌లో ఉన్న ఏఈ విజయ్‌కుమార్ వెంటనే స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను ఆర్పివేశారు. సబ్ స్టేషన్‌లో పెద్ద శబ్దం రావటం, పొగలు రావటంతో ఆప్రాంత వాసులు భయాందోళనకు గురైనారు. సకాలం స్పందించటంతో మంటలు పెద్దయంత్రాలకు పాకుండా అడ్డుకోగల్గిగారు. కాలిపోయిన కేపాటిర్ విలువ రూ.50 వేలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఐద్వా రాష్ట్ర రాజకీయ తరగతులు జయప్రదం చేయండి

- జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి

నవతెలంగాణ-ఖమ్మం



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి కోరారు. శుక్రవారం తెల్లవారు జామున జిల్లా ఐద్వా ప్రతినిధుల బృందం రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులకు కరీంనగర్ వెళ్లారు. ఈ సందర్భంగా మాచర్ల భారతి మాట్లాడుతూ శుక్రవారం నుంచి 29 వరకు నాలుగు రోజులు పాటు కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్ రాష్ట్ర క్లాసులు జరుగుతాయని, ప్రతినిధులందరూ సకాలంలో హాజరై రాజకీయ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మేరుగు రమణ, జిల్లా నాయకురాల్లా పయ్యావుల ప్రభావతి, పత్తిపాక సులోచన, అమరావతి, భాగం అజిత, బీబీ, రమ, గుడిమెట్ల రజిత, అరుణ, అమీనా, సునీత, సుమతి, ధనమ్మ, సరోజినీ బి.పద్మ, ఎం.పద్మ, ఝాన్సీ, జ్యోతి, మంగ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలను ఎప్పటికి స్మరించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



సైనికుల త్యాగాలను ఎప్పటికి స్మరించుకోవాలని, వారి సేవలను మనసులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని నూతన మున్సిపాలిటీ వద్ద ఫ్రీడం పార్క్‌లో చేపట్టిన కార్గిల్ విజయ్ దివస్‌లో కలెక్టర్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం ఎలా వచ్చిందో మర్చిపోతున్నామని, ఆనాడు 1877 లో సైన్యంలోని భారతీయులు, మనం బ్రిటిష్ వాళ్ళతో వుండం, మన దేశం తెచుకుంటాం అనే కీలక నిర్ణయం తీసుకోవడంతో మనకు 1947 లో స్వాతంత్ర్యం వచ్చిందని, ఆ సమయంలో సైన్యం లేకుంటే స్వాతంత్ర్యానికి ఇంకో 10-15 సంవత్సరాలు పట్టేదని అన్నారు. మనం ప్రశాంతంగా ఉండి, అభివృద్ధి పథంలో వెళుతున్నామంటే, సరిహద్దులో మన హద్దుల్ని కాపాడే సైనికుల వల్లే నని తెలిపారు. మాజీ సైనికులు, సైనికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా సైనిక సంక్షేమ అధికారి చంద్రశేఖర్, ఎన్సిసి లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షులు సుబేదార్ మేజర్ మహబూబ్ సుభాని, జనరల్ సెక్రటరీ పి. కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ ఏ.సురేష్ బాబు, వింగ్ కమాండర్ సురేంద్ర, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర దొంగ అరెస్టు

- 8 కేసులలో 29 తులాల బంగారం రికవరీ
- విలేకరుల సమావేశంలో ఏసీపీ రమణమూర్తి

నవతెలంగాణ-ఖమ్మం



తాళం వేసిన ఇంట్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను ఖమ్మం త్రీ టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు నగర ఏసీపీ రమణమూర్తి తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీసీఎస్ ఏసీపీ ఎం.భోజరాజుతో కలిసి ఏసీపీ మాట్లాడారు. ఖమ్మం నగరంలోని సారధి నగర్‌లోని ఇంటి యజమాని ఈనెల 20 న ఊరు వెళ్లి తిరిగి 25న ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటికి వచ్చిన ఓనర్‌కు ఇంటి తలుపులు పగులకొట్టి, ఇంట్లోని బెడ్ రూంలో ఉన్న అల్మారాలోని బంగారపు వస్తువులు గుర్తు తెలియని దొంగలు దొంగిలించుకెళ్లినట్లు త్రీ టౌన్ పీఎస్‌లో పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సీసీఎస్ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ఖమ్మం త్రీ టౌన్ ఏరియాలో గాంధీ చౌక్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఖమ్మంలోని పాండురంగపురం రామాలయం వీధికి చెందిన పాత నేరస్థుడు సంపటి ఉమాప్రసాద్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. త్రీ టౌన్‌లో దొంగతనంతో పాటుగా వేరువేరు ఏరియాలలో మరో 8 కేసులలో దొంగిలించిన 289 గ్రాముల, 29 తులాల బంగారంను రికవరీ చేసినట్లు ఏసీపీ చెప్పారు. హైదరాబాదులో లక్ష ఇరవై వేలు విలువైన స్కూటీ కొనుగోలు చేశామని అది త్వరలోనే రికవరీ చేస్తామని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసును చేధించిన సీసీఎస్ సిఐలు బీ.బాలాజీ, బీ.రాజు, త్రీ టౌన్ ఎస్‌హెచ్ఓ డీ.రమేష్, సీసీఎస్ సిబ్బంది బీ.మంగిత్య, ఎం.గజేంద్ర, ఎస్.శ్రీనివాస్, కే.సుధాకర్, కానిస్టేబుల్ కే. శ్రీనివాస్‌ను ఏసీపీ అభినందించారు.

అదనపు బాధ్యతలపై ప్రజలు అసంతృప్తి

- ఎమ్మెల్యేకి ఫిర్యాదు

నవతెలంగాణ-వేంసూరు

మండలంలో ఐదు గ్రామపంచాయతీలల్లో కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉండటంతో గురువారం ఇన్‌చార్జీలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నియమకాల్లో పారదర్శకంగా నిర్వహించలేదని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమాయి దయానంద్‌కు నాయకులు ఫిర్యాదు చేశారు. చిన్న మల్లెల పంచాయతీ కార్యదర్శికి వేంసూరు ఇన్‌చార్జి ఇవ్వటం చర్చనీయాంశంగా మారింది. మండల కేంద్రానికి 18 కి.మీ దూరంలో ఉన్న చిన్న మల్లెల కార్యదర్శికి ఇంచార్జి ఇవ్వటం ఏమిటి అంటూ కొంతమంది పంచాయితీ కార్యదర్శులు గుసగుస లాడుకుంటున్నారు. మొద్దులగూడెం కార్యదర్శి కందుకూరు ఇవ్వటం మెడికల్ లీవ్ పెట్టుకున్న కార్యదర్శికి అదనపు బాధ్యతలు ఇవ్వడం పట్ల మండల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ శాఖ అధికారి తనకు అనుకూలమైన వారిని నియమించారని విమర్శలు ఉన్నాయి. ఇన్‌చార్జీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించలేదని ప్రక్క ప్రక్క పంచాయతీల కార్యదర్శులకు అదనపు బాధ్యతలు ఇచ్చినట్లయితే ప్రజలకు అందుబాటులో ఉంటారని, విధులు నిర్వహించే దగ్గర నుండి 18 కిలోమీటర్ల దూరం నుండి ఏ విధంగా ప్రజలకు అందుబాటులో ఉంటారని, అదనపు బాధ్యతలు ఆర్డర్ రద్దుచేసి ప్రక్కపక్క పంచాయతీల కార్యదర్శులను నియమించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కందుకూరుకు దగ్గరలో ఉన్న భరణిపాడు, దుద్దెపూడి, భీమవరం పంచాయతీల కార్యదర్శిలను కాదని దూర ప్రాంతం మొద్దులగూడెం కార్యదర్శికి కందుకూరు మేజర్ పంచాయితీకి ఇవ్వటం ఏమిటని ఆ పంచాయతీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు మండలంలో సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరుతున్నారు. గ్రామాలలో ఇప్పటికే పారిశుద్ధ్యం లోపించడంతో చాలా గ్రామాలలో ప్రజలు అనారోగ్యాలకు గురయ్యారని, వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను కోరుతున్నారు.

పోగొట్టుకున్న డబ్బులు గంట వ్యవధిలో ఫ్రీజ్

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గుర్తించిన గంటలో ఫిర్యాదు చేయడం వల్ల బాధితులకు మరింత వేగంగా మేలు జరుగుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రోజుకో రకం సైబర్ మోసాలు వెలుగు చూస్తున్నాయని, సులభంగా డబ్బు సంపాదించేందుకు కొందరు కేటుగాళ్లు మోసాల బాట పట్టి మాయమాటలతో అమాయకులను నమ్మించి అందిన కాడికి దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇటీవల నగరానికి చెందిన ఓ యువతికి చెందిన ఇంస్టాగ్రామ్, వాట్సప్, టెలిగ్రామ్ అప్లికేషన్స్‌లో వచ్చిన లింక్‌ను క్లిక్ చేయడంతో రోజు వారిగా మూడు నుండి నాలుగు వేల రూపాయలు ఆదాయం వస్తుందని, వచ్చిన మెసేజ్ నమ్మి విడతల వారిగా రూ.3,43,000 పోగొట్టుకున్నారని, వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాలకు వెళ్లకుండా ఫ్రిజ్ చేసినట్టు తెలిపారు. అనాధికార ఇన్వెస్ట్మెంట్ పోర్టల్, గిఫ్ట్‌లు, కేవైసీ అప్డేట్, క్యాష్ బ్యాక్ ఆఫర్లు, స్కీములు,లోన్లు, జాబ్, వీసా, లాటరీల పేరుతో సైబర్ నేరస్తుల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటే మరో ఆలోచన లేకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని సూచించారు. మెసేజ్‌లు, స్పామ్ కాల్స్ వస్తే వెంటనే బ్లాక్ చేయాలని సూచించారు.

నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలు పంపిణీ

నవతెలంగాణ-మధిర

పట్టణంలోని హరిజనవాడలో నివాసం ఉంటున్న నిరుపేద కుటింభికుడు ఒగ్గు రవి అనే వికలాంగునికి రెండు నెలలకు సరిపడా బియ్యం అర క్వింటా, నిత్యవసర సరుకులు, నూతన వస్త్రాలు వస్తువులు చంద్రశేఖర్ షాప్ వద్ద శుక్రవారం వారి కుమారుడు ఎన్ఆర్ఐ పుల్లఖండం శ్రీరామ్, మనవళ్ళు పుల్లఖండం శ్రేయాన్, శ్రేయస్, చంద్రశేఖర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విశ్రాంత ఎంపీడీఓ సామాజిక సేవకులు మాధవరపు నాగేశ్వరావు, ఆర్యవైశ్య మిత్రులు కొల్లా శ్రీనివాసరావు, ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొండయ్య పాల్గొని పుల్ల ఖండం చంద్రశేఖర్ ఇలాంటి ఆపదలో అభాగ్యులను ఆదుకోవటం ఎంతో అభినందనియమన్నారు.

9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-ఖమ్మం

ముస్తఫా నగర్‌లోని ఓ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని శుక్రవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...పాఠశాలలో హిందీ టీచర్, విద్యార్థులను తీవ్రస్థాయిలో వేధింపులకు గురి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు ఆరోపించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నేతలు పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేధింపులకు గురిచేసిన హిందీ టీచర్‌పై చర్యలు తీసుకుని, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. ఇదే పాఠశాలలో 400 మంది విద్యార్థులకు బాయ్స్‌కి 2, గర్ల్స్‌కి 1 మూత్రశాలలు ఉన్నాయని, విద్యార్థులకు సరిపడు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు యాజమాన్యాన్ని డిమాండ్ చేశాయి. జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలప్ నిఘా పెట్టి సౌకర్యాలు ఏర్పాటుపై జిల్లా అధికారులు రాష్ట్ర,ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

30న 'వాక్ ఇన్ ఇంటర్వ్యూ'

ఖమ్మం : ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి ఖాళీగా ఉన్న పలు పోస్టులను కాంట్రాక్ట్ బేసిస్‌లో భర్తీ చేయుటకు ఈ నెల 30 న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ పోస్టుల్లో ప్రొఫెసర్లు -9, అసోసియేట్ ప్రొఫెసర్లు-11, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-7, మొత్తం 27 పోస్టులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ ఖాళీలను వాక్ ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిన ఎంపిక చేయబడతాయని, వాక్ ఇన్ ఇంటర్వ్యూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఖాళీలు, ఇతర వివరాలు కళాశాల వెబ్ సైట్ www.gmckhammam.gov, జిల్లా వెబ్ సైట్ https: khammam.telangana.gov.in లో పొందుపర్చినట్లు తెలిపారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా జిల్లా సెలక్షన్ కమిటీ నేతృత్వంలో ఎంపిక చేసి, నియామకపు పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మీడియా అండ్ కమ్యూనికేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా గీత అయినాల

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణా కాంగ్రెస్ పార్టీ మీడియా అండ్ కమ్యూనికేషన్ రాష్ట్ర కన్వీనర్, నల్గొండ ఇన్‌చార్జిగా రాష్ట్ర మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మెన్ సామ రామ్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన గీత అయినాల నియమితులయ్యారు. గీత ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగంలో స్టేట్ సెక్రటరీగా చాలా చురుకుగా పనిచేస్తున్నారు. ఆనాటి టీపీసీసీ అధ్యక్షులు, నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేపట్టిన డిజిటల్ మెంబర్షిప్ విభాగంలో ఖమ్మం పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా భాధ్యతలు చేపట్టి 2,50,000 పైగా సభ్యత్వాలు నమోదు చేయించారు. లోక్‌సభ ఎన్నికల ముందు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన రిజర్వేషన్‌పై అమితాషా వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్న నెపంతో ఢిల్లీ పోలీసులు కేసు పెట్టి, తన డివైసెస్‌ను సీజ్ చేశారు. ఎటువంటి రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోయినా ఒక మహిళ స్వశక్తితో అంచెలంచెలుగా ఎదగడంపట్ల, కష్టపడేవారికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'త్రివేణి'లో కార్గిల్ విజయ్ దివస్

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని త్రివేణి పాఠశాలలో కార్గిల్ విజయ్ దివాస్‌ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ 1999 సంవత్సరం జూలై 26వ తేదీన భారత సైన్యం సాధించిన అద్భుత విజయం కార్గిల్ పర్వత ప్రాంతాల్లో పాకిస్తాన్ సైనికులు భారత సైన్యంపై జరిపిన దాడికి దీటైన జవాబు కార్గిల్ యుద్ధం. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పీ.రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వజ్ఞ విద్యార్థినికి నాట్యమయూరి అవార్డు

నవతెలంగాణ-ఖమ్మం



హైదరాబాద్‌లో ఈ నెల 24 న రవీంద్ర భారతి లో 'నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ' వారు తెలంగాణ బోనాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాట్య పోటీలలో నాట్య మయూరిగా సర్వజ్ఞ విద్యార్థిని పీ. యోగ్యశ్రీని నిలిచిందని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ ఆర్వీ. నాగేంద్ర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కళాకారులతో పోటీపడి సర్వజ్ఞ విద్యార్థిని అత్యుత్తమ పురస్కారాన్ని కైవసం చేసుకున్నదని, సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు ఈ రంగంలోనే కాక చెస్, టేబుల్ టెన్నిస్, చిత్రలేఖనం, ఒలింపియాడ్ పోటీలలో గొప్ప ప్రతిభను కనబరచి సర్వజ్ఞ విద్యాసంస్థ గౌరవాన్ని పెంపొందించారని, ఇలాంటి కళలను ప్రోత్సహించడంలో సర్వజ్ఞ ఎప్పుడు ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థిని ఇంత అద్భుతమైన ప్రతిభను కనబరిచినందుకు తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. డైరెక్టర్స్ ఆర్వీ. నాగేంద్ర కుమార్, నీలిమా, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తోటి విద్యార్థులు యోగ్యశ్రీని అభినందించారు.

వేంసూరు ఎంపీడీవోగా రమాదేవి

నవతెలంగాణ-వేంసూరు



వేంసూరు ఎంపీడీవోగా రమాదేవి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంచార్జ్ ఎంపీడీవోగా ఉన్న ఆర్.చిన్న నాగేశ్వరరావు నుండి బాధ్యతలు తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి ఎంపీడీవో బదిలీపై వేంసూరు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవో రమేష్ పదవీ విరమణ చేయడంతో ఆస్థానంలో రమాదేవి వచ్చారు. ఎంపీడీవోను ప్రజాప్రతినిధులు పలు పార్టీల నాయకులు కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కేజీబీవీల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డీ.మధుసూదన్ నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రిన్సిపాళ్ళతో, విద్యాలయాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 14 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు ఉండగా, ఇందులో 4,775 మంది విద్యానభ్యసిస్తూ, వసతి పొందుతున్నారన్నారు. విద్యాలయాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదన్నారు. విద్యాలయాల లోపల, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందజేయాలన్నారు. ప్రిన్సిపాళ్లు తమ జాబ్ చార్ట్ ప్రకారం నడుచుకోవాలని, బాలికలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అధికారులు షెడ్యూల్ ప్రకారం విద్యాలయాల తనిఖీలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, కేజీబివి జిసిడివో భూలక్ష్మి, కెజిబివి ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

- జిల్లా ఉప ఆరోగ్య వైద్యాధికారి సీతారాం
- ప్రయివేటు రక్తపరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కల్లూరు



ప్రయివేట్ ఆరోగ్య పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే పరీక్షలు నిర్వహించాలని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా ఉప ఆరోగ్య వైద్యాధికారి సీతారాం హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని అన్ని రక్త పరీక్ష కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీతారాం ఉపయోగిస్తున్న పరికరాలను, ల్యాబ్ నిర్వహిస్తున్న వారికి అర్హతలను, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు తప్పుడు నివేదికలిచ్చి భయభ్రాంతులకు గురి చేసినట్టు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డెంగీ అనుమానిత కేసులు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని ఆదేశించారు. గడువు దాటిన రక్తపరీక్ష కేంద్రాలు క్రమం తప్పకుండా రెన్యువల్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న రక్త పరీక్ష కేంద్రాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రేవతి, సూపర్వైజర్ రామారావు, చార్లెస్ పాల్గొన్నారు.

రుణమాఫీ పట్ల మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు

నవతెలంగాణ-కూసుమంచి



రైతు సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయడం సంతోషదాయకమని, రైతు రుణమాఫీ చేసినందుకు గాను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లోని తెలంగాణ సచివాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్‌రావు, పెండ్ర అంజయ్య, చాట్ల పరుశురామ్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి, ప్రజల చేత ప్రశంసలు అందుకుంటున్నారన్నారు.

కల్లూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాగం నీరజా దేవి

నవతెలంగాణ-కల్లూరు





కల్లూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి సతీమణి నీరజాదేవిని నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్లూరు, పెనుబల్లి మండలాలకు మార్కెట్ కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా భాగం నీరజాదేవి, వైస్ చైర్మెన్‌గా పెనుబల్లి మండలం కొండ్రుపాడుకు చెందిన రాజబోయిన కోటేశ్వరరావును నియమించారు. డైరెక్టర్‌గా పోతురాజు కిషోర్ (పెనుబల్లి మండలం మర్లపాడు,) బానోత్ బాలాజీ నాయక్, (చిన్నా తండా,) కర్రి వెం కటేశ్వరరావు (కొత్తకారాయి గూడెం), రెడ్యుట కృష్ణారావు (చిన్న కోరుకొండి), లింగ బోయిన పుల్లారావు (చంద్రుపట్ల), ఏటుకూరి హరీష్ చౌదరి (తాళ్లపెంట), కర్నాటి శ్రీనివాస్‌రెడ్డి (చింతగూడెం), దేవరపల్లి నాగమణి (లింగాల), దారా రామారావు, (కల్లూరు), దొడ్డపునేని శ్రీనివాసరావు (ఎర్రబోయినపల్లి), బందెల మల్లేశ్వరి (పుల్లయ్యబంజర), సయ్యద్ నబి (కల్లూరు), నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చైర్‌పర్సన్ కుటుంబ నేపథ్యం

భాగం ప్రభాకర్ చౌదరి కుటుంబం తొలి నుండి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ పార్టీకి సేవలందిస్తున్నారు. కొత్తగూడెం మండలం సుజాతనగర్ గ్రామానికి చెందిన భాగం ప్రభాకర్ చౌదరి ఇటీవల కొన్ని సంవత్సరాల క్రితం కల్లూరులో స్థిరపడ్డారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పనిచేశారు. ప్రస్తుత సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టరాగమయ దయానంద్, మట్ట దయానంద్ విజయకుమార్, కాంగ్రెస్ పార్టీలో చేరిన దగ్గర నుండి, వారితోనే ఉంటూ వారు గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. కష్టపడి పనిచేయడంతో ఎమ్మెల్యే మట్ట రాగమయ దయానంద్, భాగం ప్రభాకర్ చౌదరి అందించిన సేవలకు కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి మహిళకు కేటాయించడంతో ప్రభాకర్ చౌదరి భార్య బాగం నీరజాదేవిని చైర్మెన్ పదవి వరించింది. ఎమ్మెల్యే సహకారంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం మేరకు చైర్మెన్ పదవి దక్కింది. శుక్రవారం చైర్మెన్‌గా ఎంపిక కాబడిన భాగం ప్రభాకర్ చౌదరి దంపతులు సత్తుపల్లి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ శాలవతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా సత్తుపల్లి కల్లూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా, వైస్ చైర్మెన్ ఎంపికైన వారిని డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఇచ్చినందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాఘమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాధులు ప్రభలకుండా పరిశుభ్రత పాటించాలి

- వైద్య శిబిరం కార్యక్రమంలో డాక్టర్ లోహిత

నవతెలంగాణ-ఇల్లందు



వర్షాకాలం సీజన్లో రకరకాల బ్యాక్టీరియా, వైరస్లు వస్తుంటాయని ఇల్లు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి డాక్టర్ లోహిత అన్నారు. మండలంలోని కొమరారం పీహెచ్సి పరిధిలోని కోటన్న నగర్ గ్రామంలో శుక్రవారం డాక్టర్ లోహిత ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వర పీడితుల నుండి రక్త నమూనాలు సేకరించి ఉచితంగా వైద్యం అందించారు. గ్రామంలో మొత్తం 57 గృహాలు ఉండగా ప్రతి ఇంటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధుల పట్ల వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి హెచ్.భద్రు, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ సత్యం, హెల్త్ అసిస్టెంట్ బాలాజీ, ఏఎన్ఎంలు మంజుల, సావిత్రి, బ్రీడింగ్ చెక్కర్స్ జగదీష్, శ్రీధర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మేకలు మృతి

నవతెలంగాణ-దమ్మపేట

గుర్తు తెలియని వాహనం ఢీ కొని 12 మేకలు మరణించిన సంఘటన శుక్రవారం ఉదయం మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం..మండల పరిధిలోని మందలపల్లి ప్రధాన రహదారిలోని చంద్రా నర్సరీ ప్రాంతంలో రైతు మీగడ వెంకటేశ్వరరావుకు చెందిన 12 మేకలను అశ్వారావుపేట నుండి సత్తుపల్లి వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీ కొట్టి వెళ్ళి పోయింది. దీంతో 12 మేకలు అక్కడికక్కడే మరణించగా వీటి విలువ దాదాపు రూ.1లక్ష పైనే ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరాడు.

సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక బోనాల జాతర

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా

నవతెలంగాణ-కొత్తగూడెం

కుల, మతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జరుపుకునే పండుగ బోనాల పండుగ అని, అనాదిగా ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్ పాషా అన్నారు. మున్సిపల్ పరిధిలోని బూడిదగడ్డ ఏరియాలో శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. కాళీ ఉపాసకులు నరేంద్ర భవాని స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాబీర్ పాష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్మెన్ కాపు సీతా లక్ష్మీ, పలువురు కౌన్సిలర్స్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సురేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-దమ్మపేట

సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 35 మంది పేద విద్యార్థులకు శుక్రవారం నోట్ పుస్తకాలు, కంబాక్స్లు పంపిణీ చేశారు. మండలంలోని గణేష్ పాడు పాఠశాలలో 20, సీతారాంపురంలో 10, గుండె పట్వారిగుడెంలో పాఠశాలలో 5 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, కంపాక్స్ బాక్స్లను అందజేశారు. ఈ పాఠశాలలు మారుమూల గ్రామాలలో ఉండడంతో పాటు ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు పేదలు కావడంతో సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి వీటిని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చంద్ర రామయ్య చిరస్మరణీయుడు

- వర్ధంతి సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం

నవతెలంగాణ-జూలూరుపాడు

చంద్ర రామయ్య చిరస్మరణీయుడని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో కీర్తిశేషులు చంద్రా రామయ్య 17వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలో మెగా హెల్త్ క్యాంప్ను భాగం ప్రారంభించి, చంద్ర రామయ్య స్థూపం వద్ద 17వ వర్ధంతి సభ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. చంద్ర రామయ్య పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల కోసం నిరంతరం శ్రమించాడన్నారు. వారి స్మారక స్థూపం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా కార్యదర్శులు ఎస్కె సాబీర్ పాషా, పోటు ప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపులో 500 మంది వైద్య పరీక్షలకు హాజరవ్వటం పట్ల హెల్త్ క్యాంపు నిర్వహించిన సీపీఐ మండల సమితిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, చంద్ర నరేంద్ర కుమార్, సలిగంటి శ్రీను, చంద్రగిరి శ్రీనివాస్, తోట రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, కుమారి హనుమంతరావు, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-పినపాక

మండల పరిధిలోని జానంపేట జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గ్రామ అభివృద్ధి కమిటీ, పీజీ హెడ్మాస్టర్ కారం విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీడీ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగి జీవితంలో బదిలీలు తప్పనిసరి అని, ఎక్కడ పని చేసిన వారి సేవలు, జ్ఞాపకాలు మాత్రమే మదిలో శాశ్వతంగా నిలిచిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవరావు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

హరినామ సంకీర్తనలు ప్రారంభం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

కోదాడ మండలం ఎర్రవరం గ్రామంలోని శ్రీ దూళ్ల గుట్టపై ఇటీవల స్వయంభుగా వెలసిన ఉగ్ర వీర నృసింహస్వామి దేవాలయ నందు శుక్రవారం దుమ్ముగూడెం మండలం లక్ష్మీనరం గ్రామానికి చెందిన పిలక నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిత్య అఖండ హరినామా సంకీర్తనలను ప్రారంభించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణానికి చెందిన స్వర రాగ సుధ రిజిస్టర్ 131 భజన బృందం కళాకారులు దేవాలయం నందు హనుమాన్ చాలీసా పాటించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జవ్వాజి వరలక్ష్మి, కార్యదర్శి సునీత, రామలక్ష్మి, నాగమణి, సుశీల, అరుణ, మాధవి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఓసీ 4 కార్మికులకు కనీస వసతులు కల్పించాలి

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు పీకేఓసీ ఫోర్ కార్మికులకు కనీస వసతులు కల్పించాలని గుర్తింపు కార్మిక నాయకులు ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారి ఆధ్వర్యంలో ఓసీ 4ను సందర్శించి కార్మికులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వై.రాంగోపాల్ మాట్లాడుతూ ఓసీ 4 నందు కార్మికులకు కనీస రక్షణ సౌకర్యాలు లేవన్నారు. ప్రయివేట్ వారితో ఉత్పత్తి సాధిస్తున్నామని ధీమాతో కార్మికులను, రక్షణ చర్యలను, క్యాంటీన్, కనీస అవసరాలను పట్టించుకోవడం మానివేశారని అన్నారు. ఈ పర్యటనలో నంబూరు శ్రీనివాసరావు, కందిమల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన లాభాలలో 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలి

- సీఎండీకి వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి సంస్థకి 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నికర లాభాల నుంచి ప్రోత్సాహం కింద 35 శాతం వాటా కార్మికులకు, ఉద్యోగులకు చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజకుమార్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సింగరేణి చైర్మెన్ ఎన్.బలరాం నాయక్‌కు వినతి పత్రంలో అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిలో గత 24 సంవత్సరాలుగా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం ద్వారా సంస్థ లాభాలను ఆర్జిస్తుందని వారు తెలిపారు. సింగరేణిలో ఉద్యోగులు, సూపర్‌వైజర్‌లు, అధికారులు, కార్మిక సంఘాలు చేసిన సమిష్టి కృషి వల్ల బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్‌తో పాటు తదితరులు ఉన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సమరమే...

7.3 శాతం నిధులతో విద్యారంగ సమస్యలు తీరేదెలా..?

- రూ.8240 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పై అసెంబ్లీలో చర్చేదీ..?
- మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-కొత్తగూడెం



విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే పోరాటాలు తప్పవని, 7.3 శాతం నిధులతో రాష్ట్ర విద్యారంగ సమస్యలు తీరేదెలా...? అని, రూ.8240 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై అసెంబ్లీలో చర్చఎందుకు చేయలేదని, వెంటనే మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం స్థానిక పోస్టాఫీసు సెంటర్‌లో విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ బడ్జెట్ ప్రతులను దహనం చేసారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర 2023-24 బడ్జెట్‌లో విద్యారంగానికి 7.6 శాతం నిధులు కేటాయిస్తే 2024-25 బడ్జెట్లో కేవలం 7.3 శాతం నిధులే కేటాయించారన్నారు. రూ.2.91 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం విద్యారంగానికి రూ.21,292 కోట్లు (7.3శాతం) మాత్రమే కేటాయించారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, రాష్ట్ర యూనివర్సిటీలకు రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారనీ, రూ.500 కోట్లు కేవలం యూనివర్సిటీ సిబ్బంది వేతనాలు, పెన్షన్లు, నియామకాలకే సరిపోతాయని, ప్రగతి పద్దు ఒక్క రూపాయి కేటాయించలేదని అన్నారు. పాఠశాల విద్యకు, ఉన్నత విద్యకు కేటాయించిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదని అన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలకు సొంత భవనాలు గూర్చి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాల గూర్చి బడ్జెట్ సమావేశాల్లో కనీసం చర్చించడం లేదనీ ఇటువంటి చర్యలు రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగానికి తీరని అన్యాయం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్, అజయ్, శివ, వేణు, గీతిక, వరూధిని తదితరులు పాల్గొన్నారు.

మెడ మీద కత్తి పెట్టి రిటైర్మెంట్ చేయడం సరికాదు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాస్

నవతెలంగాణ-అశ్వాపురం



రిటైర్మెంట్ కొచ్చిన అంగనవాడీ ఉద్యోగులను మెడ మీద కత్తి పెట్టి రిటైర్మెంట్ చేయాలని కోరడం సరైనది కాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రిటైర్మెంట్ పేరుతో అంగన్వాడీ ఉద్యోగులను బలవంతంగా విధుల నుంచి తొలగించి వారి స్థానంలో ఇన్‌చార్జీలను నియమించడం అమానుషమన్నారు. గత కొన్నేళ్లుగా అంగన్వాడీలు విధులు నిర్వహిస్తూ కాలం గడిచిపోయిన ఉద్యోగులను గౌరవప్రదంగా ప్రభుత్వం పంపాలి గాని ఇలా నిర్బంధంతో పంపడం సరికాదన్నారు. ఓ పక్కన జీవో నెంబర్ 10ని రద్దు చేస్తామని ప్రభుత్వం చెబుతూనే ఇలా ఉద్యోగుల పట్ల నిరంకుశ వైఖరితో వ్యవహరించడం ఏంటని ఆయన ప్రశ్నించారు. చిరు ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆకృత్యాలపై పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఏఎంసీ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలి : ఐద్వా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం పట్టణంలో ఏఎంసీ కాలనీలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి జిల్లా నాయకులు నాదెళ్ళ లీలావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశం వారి దృష్టికివచ్చిన సమస్యలపై వారు మాట్లాడారు. కాలనీలో అనేక సమస్యలు ఐద్వా దృష్టికి వచ్చాయని, కాలనీ వాసులు జూలై, సెప్టెంబర్ నెలలో మొత్తం కాలనీలోకి గోదావరి వస్తుందని అక్కడ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. అలాగే అక్కడ ఉన్న ప్రజలు ముఖ్యంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలనీలో ప్రధానంగా వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్‌లు ప్రతినెల సరిగ్గా రావటం లేదని ప్రజలు ఆందోళను చెందుతున్నారన్నారు. పక్క రాష్ట్రం అయిన ఆంధ్ర ప్రదేశ్‌లో ఇంటింటికీ పింఛన్లు తీసుకొచ్చి ఇస్తున్నారు, కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఫించను సరిగ్గా రాకపోవటం వలన ప్రజలు ఫైనాన్సియల్‌గా ఇబ్బందులు పడుతున్నట్టు వారు తెలిపారు. కావునా ప్రతి నెల 1వ తారీఖున పింఛను ఇంటింటికీ తీసుకురావాలి, లేదా వాళ్ళ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని వారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలానే వర్షాకాలం సీజన్ విషపు జ్వరాలు మలేరియా, డెంగ్యూ వంటివి వస్తాయి కాబట్టి ప్రతి కాలనీలో హెల్త్ క్యాంప్ నిర్వహించాలన్నారు.

అలాగే వర్షపు నీరు నిలువ ఉండకుండా డ్రయినేజీలు శుభ్రపరచాలని, కాలనీలో దోమలు రాకుండా దోమల మందు, బీజింగ్ చల్లించాలని వారు పట్టణ అధికారులను డిమాండ్ చేశారు. తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఐద్వా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు యు.జ్యోతి, స్థానిక ప్రజలు సత్యవతి, కుమారి, రమ, సుధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

- ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయాలి
- డీఆర్డీఓ ఏసీఎల్బీ విద్యా చందన

నవతెలంగాణ-కొత్తగూడెం



ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని, ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ త్వరగా పూర్తిచేయాలని డీఆర్డీఓ ఏసీఎల్బీ విద్యా చందన కోరారు. శుక్రవారం చుంచుపల్లి మండలంలోని 3 ఇంక్టెన్ నర్సరీని సందర్శించారు. ఖాళీగా ఉన్న బ్యాగులల్లో మునగ విత్తనాలు వేసి మొక్కలు పెంచాలని, గ్రామ పంచాయతీలలో ఖాళీ స్థలాల్లో విరివిగా మునగ, చింత చెట్లు పెంచాలని ఆదేశించారు. అనంతరం పెనగడప నర్సరీ సందర్శించి ప్రక్కనే ఒక రైతు ఐదేకరాల్లో జామాయిల్ మొక్కలు వేయడాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. అంబేద్కర్ నగర్ గ్రామ పంచాయతీలో పర్యటించి, పలు పనులు పరిశీలించారు. ఉత్సాహవంతులైన రైతులు మునగా మొక్కలు నాటి విరివిగా మునగ చెట్లు వేస్తే భవిష్యత్తులో మంచి లాభసాటిగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు ఈ మండలంలో ఉత్సాహవంతులైన రైతులు ఉంటే వారు డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు ఎకరానికి 900 మొక్కలు నాటితే వారికి మూడు లక్షల ప్రోత్సాహం ఉంటుందని, రెండు సంవత్సరాలు మెయింటెనెన్స్ కింద మొక్కకి రూ.2.50 పైసలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. తేనెటీగల పెంపకం పుట్టగొడుగుల పెంపకంపై రైతులు ముందుకు వస్తే వారికి రుణాలు ఇప్పిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీడివి అశోక్ కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఏపీవో ఈజీఎస్ ఎం.రఘుపతి, ఈసీ పి.నాగరాజు, టీఏలు యశ్వంత్, అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, హనుమంతు, అరుణ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండల పరిధిలోని పలు గ్రామాల్లో కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పంపిణీ చేశారు. నూతనంగా వివాహం చేసుకున్న వధువు ఇంటికి, హాస్పటల్‌లో వివిధ రకాల సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న వారి ఇంటికి స్వయంగా వెళ్లి చెక్కులు ఇచ్చి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని లబ్ధిదారులు సన్మానించి వారి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పాషా, మండల అధ్యక్షులు వనమా గాంధీ, యూత్ లీడర్ దుబాకుల రాము, మాజీ ఎంపీటీసీ భీమిరెడ్డి వెంకటరామిరెడ్డి, పర్స వెంకట్, వేముల నరేష్, రమణ, రాజా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ప్రాజెక్ట్ అధికారికి వినతి

నవతెలంగాణ-మణుగూరు



పీకే ఓసీ సెక్షన్-2 కొత్త సైట్ ఆఫీస్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వర్క్ షాప్ కార్మికులు శుక్రవారం పీకే ఓసీ ప్రాజెక్ట్ అధికారి తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్‌కి సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్క్ షాప్ కార్మికులుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాజెక్ట్ అధికారి దృష్టికి తీసుకు వెళ్ళామని వారు తెలిపారు. పీకే ఓసీ నూతన క్షేత్ర కార్యాలయం వద్ద (సైట్ ఆఫీస్) భారీ యంత్రాల మరమ్మతులు బేస్ వర్క్ షాప్ (ఎస్అండ్‌డీ)లో సుమారు 300 మంది వరకు కార్మికులం పనిచేస్తున్నామని, పీకే ఓసీ భవిష్యత్ ప్రణాళికలో భాగంగా మరో ఆరు నెలల్లో అన్ని విభాగాల్లో కలుపుకుని ఇంకా 500 మంది ఆపైన కార్మికులు కూడా ఇక్కడ పనిచేసే అవకాశం అవసరం కూడా ఉందన్నారు. దయచేసి తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నూతన సైట్ కార్యలయం పక్కనే ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను వర్క్ షాప్ దాటిన తరువాత ఏర్పాటు చేయాలన్నారు. ద్విచక్ర వాహనాల పార్కింగ్ షెడ్ పక్కనే ఖాళీగా వున్న స్థలములో ఏర్పాటు చేసి, వర్క్ షాప్ మ్యాన్ వేను వెంటనే ప్రారంభించాలన్నారు. తదితర సమస్యల పట్ల అధికారి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లూరు వెంకటరత్నం, వై.రామ్మూర్తి, మేకల ఈశ్వర్, షేక్ అబ్దుల్ రవూఫ్, వెంకటేశ్వర్లు, భూక్యా భద్రయ్య వీర్యా మందాడి సంజీవ్, విల్సన్ రాజ్, హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్స్ ద్వారా దోమల వృద్ధి

- వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించాలి

నవతెలంగాణ-మణుగూరు

ఏరియాలో క్వార్టర్ కౌన్సిలింగ్‌లు నిర్వహించకపోవడంతో లార్వా వృద్ధి చెంది కార్మికులు రోగాల బారిన పడుతున్నారని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు నాగేళ్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. క్వార్టర్‌లలో నివాసం ఉండే కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ఇకనైనా యాజమాన్యం నిద్రావస్థను వీడి ఏరియా నందు త్వరితగతిన క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించి కార్మికులు వారి కుటుంబ సభ్యులు రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యులు బంగారి పవన్ కుమార్, మస్తాన్, మునిగేల నాగేశ్వర రావు, ఇజ్రాయిల్, రమేష్, మురళీకృష్ణ నాయకులు రాజ్ కుమార్, పద్దం శ్రీనివాస్, గుగులోత్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగు ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేపట్టండి

- టీడీపీ నాయకులు కట్రం స్వామి దొర

నవతెలంగాణ-అశ్వారావుపేట



భారీ వర్షాలకు గండి పడ్డ పెద్దవాగు ప్రాజెక్ట్ కు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ అశ్వారావుపేట నియోజక వర్గం ఇంచార్జి కట్రం స్వామి దొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మండల పరిధిలోని గుమ్మడి వల్లి పెద్దవాగు ప్రాజెక్ట్ గండిని శుక్రవారం పరిశీలించారు.దాని ముంపుకు గురైన సాగు భూములను సందర్శించి,నిర్వాసితులను ఆయన పరామర్శించారు. తక్షణమే ప్రభుత్వం మరమ్మత్తులు చేసి రైతులకు భూములకు నీరు అందించి పంటలు పండించు కోవడానికి చేయూత నివ్వాలి అని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షులు నార్లపాటి శ్రీనివాసరావు,మహిళా నాయకురాలు బొడ్డపాటి రమాదేవి,అంకోలు వెంకటేశ్వరరావు,పోతురాజు నాని,రమాదేవి,తుమ్మల నాగేశ్వరరావు,అనపర్తి శ్రీనివాస్ రావు,డికొండ వెంకన్న, బ్రహ్మేంద్రరావు,నర్రా రాకేష్, గుణ్ణం సురేష్,బుచ్చిరాజు, కిషోర్,రమేష్,సురేష్,గన్మెన్ (సాయిల వెంకటేశ్వరరావు), పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్ద పీట

- టీడీపీ మండల అధ్యక్షులు దామోదర్ రావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్‌లో వ్యవశాయ రంగానికి 72 వేల కోట్లను కేటాయించి పెద్దపీట వేశారని, తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు కొమరం దామోదర రావు అన్నారు. అదేవిధంగా సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వలన భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం ఎకరాకు రూ.20 లక్షలుగా ప్రకటిస్తూ నిధులు విడుదల చేసి ప్రతీ కుటుంబానికి అందించాలన్నారు. రుణమాఫీ విడతలవారీగా కాకుండా ఒకేసారి షరతులు లేకుండా విడుదల చేసి, రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

నవతెలంగాణ-మణుగూరు

మున్సిపాలిటీలోని సుందరయ్య నగర్‌లోని బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్‌లో కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. స్కూల్ చిన్నారులకు సైనికుల దుస్తులు వేయించి దేశ రక్షణలో సైనికుల శౌర్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రాంబాబు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమ, గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

జామే మసీద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నిక

నవతెలంగాణ-పాల్వంచ





పట్టణ పరిధిలోని అబ్దుల్ కలాం టవర్ సెంటర్‌లోని జామే మసీద్‌లో శుక్రవారం నిర్వహించిన జామే మసీద్ అధ్యక్షా, కార్యదర్శుల ఎన్నికలలో అధ్యక్షా పదవికి పోటీ చేసిన ఎమ్‌డీ ఫయాజ్ ఉల్ హస్సేన్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, కార్యదర్శి పదవికి మోజువాణి పద్ధతిలో నిర్వహించిన ఎన్నికలలో ఎమ్‌డీ ఇబ్రాహీం ఖురేషి కార్యదర్శిగా ఎన్నికైయ్యారు. గతంలో ఉన్న పాత కమిటీని సుమారు రెండు నెలల క్రితం రద్దు చేసి, ఖాజా అహ్మద్ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీని నియమించారు. అధ్యక్షా పదవికి కేవలం ఒక దరఖాస్తు మాత్రమే రావటంతో ఎమ్‌డీ ఫయాజ్ ఉల్ హస్సేన్ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు స్టీరింగ్ కమిటీ ప్రకటించింది. ఇది ఇలా ఉండగా కార్యదర్శి పదవికి మొత్తం ముగ్గురు నామినేషన్ వేశారు. వీరిలో ఇబ్రహీం ఖురేషి, మాజిద్ ఖురేషి, గౌస్ పాషాలు ఉన్నారు. శుక్రవారం నమాజు అనంతరం జరిగిన కార్యదర్శి పోటీలలో మోజువాణి పద్ధతిలో నిర్వహించిన ఎన్నికలలో ఇబ్రహీం ఖురేషి కంటే మాజిద్ ఖురేషి, గౌస్ పాషాలకు తక్కువ మెజార్టీ రావటంతో స్టీరింగ్ కమిటీ కన్వీనర్ ఖాజా అహ్మద్, ఇబ్రహీం ఖురేషిని కార్యదర్శిగా ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్‌ఫయాజ్ ఉల్ హస్సేన్, ఎండి ఇబ్రాహీం ఖురేషిలు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించిన స్టీరింగ్ కమిటీకి, ఎన్నికల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు.

విద్య రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

జూలూరుపాడు : విద్యారంగ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని, ఇది ముమ్మాటికీ విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం అని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్‌కార్యకర్త సమావేశంలో వంశీ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3% నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తు శుద్ధి ఉందని తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రామ్ చరణ్, అనిల్ కుమార్, సాయి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రాయల సంతాప సభ పోస్టర్ ఆవిష్కరణ

లక్ష్మీదేవి పల్లి : ఈ నెల 28న ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంతాప సభకు సంబంధించి పోస్టర్లను మాస్‌లైన్ మండల కార్యదర్శి గుగులోతు రామచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చంటి, నరసింహారావు, మంగీలాల్, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | జులై 27, 2024 | www.navatelangana.com

చర్లలో సీజనల్ వ్యాధులను అరికట్టాలి

- గ్రామ గ్రామాన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి
- సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు



నవతెలంగాణ-చర్ల

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలు, తుఫాను కారణంగా మండలంలో విష జ్వరాలు విజృంభించాయి. కావున అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు, మండల నాయకులు కారం నరేష్ డిమాండ్ చేశారు. ప్రజలు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించడం లేదని అన్నారు. ఒకపక్క చుట్టూ గోదావరి ప్రమాదం పొంచి ఉన్నది, వెంటనే మెడికల్ క్యాంపులు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా డ్రైనేజీలు పూడిక తీపించాలని, బురద గుంతలను శుభ్రం చేయాలన్నారు. పీహెచ్సి హాస్పిటల్‌ని సీమాంగ్ సెంటర్‌గా ఏర్పాటు చేస్తామని చెప్పి రాజకీయ నాయకులు, అధికార పార్టీ నాయకులు ప్రలోభాలు పలికారు, ఇప్పటివరకు హాస్పటల్లో మాత్రం సరైన సిబ్బందిని ఏర్పాటు చేయలేదన్నారు. తక్షణమే సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సాంబశివరావు, రాజు, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టండి



నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టి, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని మెడికల్ ఆఫీసర్‌కి డీవైఎఫ్ఐ వినతి అందజేసింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు గోగ్గల సుధీర్ మాట్లాడుతూ నీటి నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్, ప్రతి ఇంట్లో దోమల మందు పిచికారి చేయించాలని, గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి నునవత్ విజయ్ కుమార్, సాంబ, సందీప్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జవాన్ల త్యాగం వెలకట్టలేనిది

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

దేశ రక్షణ కోసం భారతదేశం సరిహద్దుల్లో కాపలాకాసే సైనికుల త్యాగాలు మరువలేనిదని, వారి త్యాగాల ఫలితాలను ఎల్లప్పుడూ విద్యార్థులు స్మరించుకోవాలని మణుగూరు మిట్టగూడెం గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల బాలురు ప్రిన్సిపాల్ స్వప్న ఆకోజు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గురుకుల డిగ్రీ కళాశాల మణుగూరులో కార్గిల్ విజయ దివాస్ ను పురస్కరించుకొని కళాశాల ఎన్సిసి విద్యార్థులు అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. భారతదేశంలోని ప్రజలు సుఖశాంతులతో ఎటువంటి భయాందోళనకు లోను కాకుండా జీవిస్తున్నారంటే దేశ సరిహద్దుల్లో కాపులాకాసే సైనికులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారే విస్తృత పర్యటన

నవతెలంగాణ-చంద్రుగొండ

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటన చేశారు. సీతయ్య గూడెం, మద్దుకూరు, చంద్రుగొండ, రావికంపాడు, దుబ్బ తండ, రేపల్లెవాడ, తుంగారం, తిప్పనపల్లి గ్రామాలలోని లబ్దిదారుల ఇండ్లకు వెళ్లి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్వయంగా అందజేశారు. ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తుకు భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యవతి, ఎంపీడీవో అశోక్, ఆర్ఐ అక్బర్ బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దారం గోవింద్ రెడ్డి, సీనియర్ నాయకులు బొజ్యా నాయక్, ఉప్పతల ఏడుకొండలు, బొర్రా సురేష్, ఎంపీపీ భానోత్ పార్వతి, ఫజల్ బక్షి తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో మహిళా శక్తి కేంద్రాలు

- మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో మహిళా శక్తి కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సీతాలక్ష్మీ అధ్యక్షతన మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వము నూతనంగా ప్రవేశ పెట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా లక్ష్యాలను, పథకము వివరాలను ఉద్దేశించి మహిళా సంఘ సభ్యులకు మార్గ దర్శకాలు, నిర్వహణ పద్ధతులను గురించి వివరించారు. కొత్తగూడెం పురపాలకంలో 4-క్యాంటీన్లు, 4-మీ సేవా యూనిట్లు, 9-ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు అయినట్టు తెలిపారు. ఈ యూనిట్లు మహిళా సమాఖ్యలకు కేటాయించుట జరుగుతుందని వివరించారు. ఈ యూనిట్లను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా ఏడిఎంసీ చంద్రశేఖర్ బాబు, కొత్తగూడెం మెప్మా టీఎంసీ బి.వెంకటేశ్వర్లు, సీఓలు జె.శాంత కుమార్, ఇ.మౌలాల్ బి.సరిత సమాఖ్య ఆర్పీలు, ఓబీలు, సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన రైతులు జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలి

- ప్రకృతి వ్యవసాయ పథకం అమలు తీరును పరిశీలించిన ఐటీడీఏ పీఓ బి.రాహుల్



నవతెలంగాణ-దుమ్ముగూడెం

గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయంలో వరి పంటలే కాకుండా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే ఆయిల్ ఫామ్, వేరుశనగ పంటలు, ఉద్యాన వనానికి సంబంధించిన పంటలు పండించి జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఎస్.లక్ష్మీపురం గ్రామంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులకు పలు సూచనలు ఇస్తూ... రైతు ఉత్పత్తి సంఘం పరిధిలో గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించుకుంటే భూసారం కూడా శక్తిని కోల్పోదని అన్నారు. అనంతరం గోశాలను పరిశీలించి పల్లె ప్రాంతాలలో ఎక్కువ శాతం గోవులను పెంచుతారని, గోవుల వల్ల పేడ, జీవామృతం, ఘనామృతం తయారు చేసుకొని పంటలకు ఎరువుగా ఉపయోగించుకోవచ్చని అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు గడుస్తున్న గిరిజన రైతు ఎర్రం సత్తిబాబును ఆయన అభినందించారు. అనంతరం రైతులకు సంబంధించిన చేపల చెరువును పరిశీలించి ప్రమాదకరమైన వ్యర్థాలను వేసి చేపల పెంపకం చేయకూడదన్నారు. అనంతరం గిరిజన రైతుల పంట పొలాలకు నీరు సరఫరా చేయడానికి త్రీఫేస్ లైన్ కరెంటును పీఓ పరిశీలిస్తున్న సమయంలో రైతులు మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులను గుర్తించి త్రీఫేస్ సౌకర్యం కల్పించారన్నారు. దీనివల్ల మా పంట పొలాలకు సులభంగా నీటి సరఫరా అందడం వల్ల పంటలు పండించుకుంటున్నామని అన్నారు. గోదావరి వరదల వల్ల సింగారం బ్రిడ్జి కూలిపోయిందని, దీని వల్ల ఎస్.లక్ష్మీపురం గ్రామానికి వెళ్లడానికి గిరిజనులకు రహదారి సౌకర్యం లేదని నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అనంతరం జీపీఎస్ పాఠశాలను సందర్శించి పిల్లల నైపుణ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడి భాస్కర్, ఉద్యానవన అధికారి ఏటీడీఓ అశోక్, సెర్ప్ ఏపీఎం హేమంతిని, విద్యుత్ శాఖ ఏఈ మోహన్ రెడ్డి గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా హ్యాండ్ రైటింగ్ క్లాసులు

- విద్యారత్న అవార్డు గ్రహీత హుస్సేన్



నవతెలంగాణ-పినపాక

ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఉచితంగా హ్యాండ్ రైటింగ్ క్లాసులో నిర్వహిస్తున్నామని విద్యారత్న అవార్డు గ్రహీత హుస్సేన్ తెలియజేశారు. శుక్రవారం మండలంలోని ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత హ్యాండ్ రైటింగ్ క్లాసులు క్లాసులు ప్రారంభించారు. వివేకానంద ఉచిత గ్రూప్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీరామ్ బృహస్పతి, చెన్నారెడ్డి కోరడంతో ఈ క్లాసులు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మరిన్ని కార్యక్రమాలు చేస్తామని ఆయన తెలియజేశారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. రెండు నెలల పాటు ఉచితంగా హ్యాండ్ రైటింగ్ క్లాసులు నేర్పుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సమ్మయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రులు

- తొలుత కొత్తగూడెంలో ఏర్పాటు చేయాలని సూచన



నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్రంలోని 6 జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యార్థం కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐ) సేవలను సింగరేణి ప్రాంతంలో విస్తరింపజేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ కమల్ కిషోర్ సోన్‌ను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఢిల్లీలో ఈఎస్ఐ డీజీని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. సింగరేణి వ్యాప్తంగా 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, కాంట్రాక్టు ఉద్యోగులకు కంపెనీ తరఫున వైద్య సేవలు అందిస్తున్నామని, అయితే వారి కుటుంబ సభ్యులకు కూడా సేవలు అందించాలని విజ్ఞప్తులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి వీలుగా తొలుత కొత్తగూడెం, సింగరేణి థర్మల్ ప్లాంట్‌లో ఈఎస్ఐ ఆసుపత్రులను ప్రారంభించి సేవలను ప్రారంభించాలని కోరారు. వీలైనంత త్వరగా ఈఎస్ఐ సేవలు ప్రారంభించేందుకు సింగరేణి తరఫున మౌలిక సదుపాయాలైన క్వార్టర్లను కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ డీజీ మాట్లాడుతూ... తొలుత ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరం మేరకు ఆసుపత్రులుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలోని ఈఎస్ఐ అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సింగరేణిలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు అందరూ కూడా ఈఎస్ఐ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని, వారిని, వారి వద్ద పనిచేస్తున్న కార్మికుల వివరాలను కూడా ఈఎస్ఐలో నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. సింగరేణి ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ఈఎస్ఐ డీజీకి సీఎండీ ఎన్.బలరామ్ కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

- ఎస్పీ రోహిత్ రాజు



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీస్ శాఖతో పాటు జిల్లా ప్రజలు భాద్యతగా వ్యవహరించాలని ఎస్పీ రోహిత్ రాజు కోరారు. శుక్రవారం ప్రకటనను విడుదల చేశారు. జిల్లాలో ఎవరైనా నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్నట్టు, విక్రయిస్తున్నట్టు, సేవిస్తున్నట్టు గానీ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేసి, నిషేధిత గంజాయిని జిల్లాలో సమూలంగా నిర్మూలించేందుకు సహకరించి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అలవాటుగా యువకులు గంజాయి సేవించే ప్రదేశాలను గుర్తించడం జరిగిందని, అట్టి ప్రదేశాలలో నిషేధిత గంజాయిని సేవిస్తూ ఎవరైనా కనపడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. నిషేధిత గంజాయి రవాణా, విక్రయం, వినియోగాలకు సంబంధించి సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జిల్లాలో గంజాయిని నివారించడానికి ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజలు సమాచారం అందించాల్సిన ఫోన్ నంబర్లు 8712682133, 8712682135 తెలిపారు.

పంచాయతీలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

- తహసీల్దార్, జానంపేట స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ

నవతెలంగాణ-పినపాక

గ్రామపంచాయతీలలో ప్రతీ రికార్డును సక్రమంగా నిర్వహించాలని పినపాక తహసీల్దార్, జానంపేట స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ సెక్రటరీలకు సూచించారు. శుక్రవారం ఆయన జానంపేట గ్రామపంచాయతీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రికార్డుల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు ఖాజా హుస్సేన్, నాగిని, సిబ్బంది పాల్గొన్నారు.

జానంపేట నూతన సెక్రటరీగా ఖాజా హుస్సేన్

పినపాక : మండలంలోని జానంపేట గ్రామపంచాయతీ నూతన సెక్రటరీగా ఖాజా హుస్సేన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీలో భాగంగా అశ్వాపురం మండలం జగ్గారం నుండి జానంపేటకు వచ్చినట్టు తెలిపారు. అనంతరం ఆయన గ్రామపంచాయతీ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు.

బీఈడీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రాష్ట్రంలోని ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థుల సంక్షేమం కోసం భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక గిరిజన బీఈడీ కళాశాలలో 2024-26 విద్యా సంవత్సరంనకు గాను 26 బ్యాచ్ 02 సంవత్సరముల రెగ్యులర్ బీఈడీ కోర్సులో ప్రవేశం నిమిత్తం ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన పట్టభద్రుల నుండి నేరుగా దరఖాస్తులను కోరుచున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో ప్రవేశం కోసం తెలంగాణకు చెందిన అభ్యర్థులు ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతములకు చెందిన గిరిజన పట్టాభద్రులై ఉండాలని, డిగ్రీ పాసై కనీసం 40 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. సంబంధిత డిగ్రీ పరీక్షలో సాధించిన మెరిట్‌ను బట్టి ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. దరఖాస్తులు ఏటూరు నాగారం, ఉట్నూరు, మన్ననూరు ఐటీడీఏ కార్యాలయం, గిరిజన బీఈడీ కళాశాల భద్రాచలం నందు ప్రాస్పెక్టస్, దరఖాస్తులు పొందవచ్చునని తెలిపారు.

దరఖాస్తులు పోస్టు ద్వారా పొందగల అభ్యర్థులు తమ సొంత అడ్రస్ గల కవర్ రూ.10 స్టాంపుతో ప్రిన్సిపాల్ గిరిజన విద్యా కళాశాల భద్రాచలంకు పంపి పొందవచ్చునని దరఖాస్తు, ప్రాస్పెక్టస్ క్షుణ్ణంగా చదివి దరఖాస్తులను సక్రమంగా పూర్తి చేసి సమర్పించాలని తెలిపారు. తగు ప్రతులు జతచేసిన దరఖాస్తులు బీఈడీ కళాశాల భద్రాచలంకు 23 ఆగస్టు 2024 వరకు అందజేయాలని, మరిన్ని వివరాల కోసం 8978477345 ఫోన్ నెంబర్‌కు సంప్రదించి తెలుసుకోగలరని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్ తెలిపారు.

ఖరీఫ్ సాగుకే నీళ్లు అందిస్తాం...

- పెద్ద వాగు ప్రాజెక్ట్ మరమ్మతు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ ఖరీఫ్ సాగు కే నీళ్ళు అందిస్తామని, అందుకోసమే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ అన్నారు. మండల పరిధిలోని గండి పడిన పెద్ద వాగు ప్రాజెక్ట్‌కు మరమ్మతుల పనులకి శుక్రవారం కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్ సాగు కే ఆయకట్టు రైతులకి నీరు అందిస్తాం అనే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంప్రదించి తాత్కాలిక మరమ్మతులు నిమిత్తం రూ.3.5 కోట్లలు నిధులతో యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించటం జరుగుతుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, నీటి పారుదల శాఖ ఈఈ సురేష్ కుమార్, డీఈ ఎల్ క్రిష్ణ, తహసీల్దార్ వి.కృష్ణప్రసాద్, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, నాయకులు కార్యకర్తలు, ఆయకట్టు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్మిక నేత కూకట్ల శంకర్ మృతి

- సీపీఐ(ఎం), సీఐటీయూ సంతాపం
- నేడు అంత్యక్రియలు
- తరలి రానున్న రాష్ట్ర నేతలు



నవతెలంగాణ-ఇల్లందు

సీపీఐ(ఎం), సీఐటీయూ ఉమ్మడి ఇల్లందు డివిజన్ సీనియర్ నాయకులు కూకట్ల శంకర్ అనారోగ్యంతో శుక్రవారం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెదాడు. ఆయనకు భార్య కుమారుడు వున్నారు. శంకర్ ఎమర్జెన్సీ కాలం నుండి పార్టీలో పనిచేశారు. సీఐటీయు యూనియన్‌లో కీలకమైన పాత్రను పోషించారు. బొగ్గు గని కార్మికుడిగా గోదావరిఖని, ఇల్లందు, సత్తుపల్లి ఏరియాలలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్‌లో రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకుడిగా పని చేశారు. సీఐటీయూ, సీపీఐ(ఎం) ఇచ్చిన అనేక పిలుపుల్లో పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేశారు. సింగరేణిలో సంఘం బలోపేతానికి తీవ్రంగా కృషి చేశారు.

ఇల్లందులో బిల్డింగ్ వర్కర్లు, ఇతర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై పోరాడి పరిష్కారానికి కృషి చేశారు. స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం పనిచేశాడు. ఇల్లందులో సీఐటీయూ నిర్మాణంలో తన వంతు పాత్ర పోషించారు.

ట్రాన్స్‌ఫర్‌పై సత్తుపల్లి వెళ్లిన అనంతరం కూడా ఉద్యమాన్ని వదిలేయకుండా అక్కడ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఆందోళనలు నిర్వహించాడు. సత్తుపల్లిలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్, సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం (ఎస్‌సీకేఎస్)ల నిర్మాణంలో ప్రధాన పాత్రపోషించాడు.

నేడు అంత్యక్రియలు

శంకర్ మృతదేహం శుక్రవారం రాత్రి హైద్రాబాద్ నుంచి ఇల్లందుకు వచ్చిందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబీ తెలిపారు. నెంబర్-2 బస్తీ భజన మందిరం ఏరియాలోని ఆయన నివాసంలో శనివారం ఉదయం అంత్యక్రియలు జరగనున్నట్లు తెలిపారు. జిల్లా, రాష్ట్ర నేతలు తరలి రానున్నట్లు పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) మండల పార్టీ జోహార్లు

కూకట్ల శంకర్ మృతికి సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, ఆలేటి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతి దురదృష్టకరం : సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు



సింగరేణి, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన సీఐటీయూ రాష్ట్ర నాయకులు కూకట్ల శంకర్ మృతి దురదృష్టకరమని సింగరేణి కాంటాక్ట్ కార్మికు సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ తరఫున సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.



సీఐటీయూ నివాళి : అమరజీవి కూకట్ల శంకర్ మృతదేహానికి సీఐటీయూ రాష్ట్ర నాయకులు వంగూరు రాములు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్‌లు నివాళులు అర్పించారు. హైద్రాబాద్‌లోని అసుపత్రిలో ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



కేంద్రానిది ప్రజా వ్యతిరేక బడ్జెట్

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సారపాకలో నిరసన

నవతెలంగాణ -బూర్గంపాడు

కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సారపాక సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ ఇది కోటీశ్వరులకు, శతకోటీశ్వరులకు తప్ప సామాన్య ప్రజలకు కాదని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు 8 మంది ఉండి కూడా తెలంగాణకు బడ్జెట్లో ఏమి లేకుండా చేసిన చరిత్ర వారికి దక్కుతుందని ఆయన అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనికి 2లక్షల కోట్లు బడ్జెట్లో కేటాయించాల్సింది పోయి కేవలం 806 వేల కోట్లకే పరిమితం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, ఎస్.కె అబీద, భయ్యా రాము, కనకం వెంకటేశ్వర్లు, పి.చంద్ర రావు, కమటం మరియమ్మ బత్తుల ఏడుకొండలు, ఎంకమ్మ, నాగమణి, పద్మ, రజిత, మంజుల, రామ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడుతున్న బ్యాంక్ అధికారులు

నవతెలంగాణ-జూలూరుపాడు

స్థానిక ఏపీజీవీబీ బ్యాంక్ వారు రుణమాఫీ కింద వచ్చిన నగదును వేరువేరు అప్పులకు, డ్వాక్రా సంఘాల రుణాలకు లింకుపెట్టి రైతులను బ్యాంక్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యాసా నరేష్ అన్నారు. రుణమాఫీ వచ్చిన రైతులకు తక్షణమే రీ షెడ్యూల్ చేసి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. లేని యడల రైతులతో కలిసి పోరాటం నిర్వహిస్తామని ఆయన అన్నారు.

డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత : ఎంపీడీవో రామకృష్ణ

నవతెలంగాణ-పినపాక

డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని పాటించటం వల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని ఎంపీడీవో రఘువరపు రామకృష్ణ తెలియజేశారు. శుక్రవారం గోపాలరావుపేట, మల్లారం, జానంపేట, పినపాక గ్రామాలలో ఆరోగ్య పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం అందరూ డ్రై డే పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.ఉమామహేశ్వరరావు, జైపాల్ రెడ్డి, రహీం, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్స్, పంచాయతీ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అన్ని గ్రామాలలో ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యాధికారి పుల్లారెడ్డి తెలిపారు. నీళ్ల నిల్వ ఉన్నచోట డి వార్మింగ్, ఆయిల్ బాల్స్ వదలడంతో పాటు టిమోఫాస్ పిచికారి చేశారు. ఇంటింటికీ తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రిపూట ప్రతి ఒక్కరూ దోమతెరలను ఉపయోగించాలన్నారు.

లక్ష్మీనగరం ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

లక్ష్మీనగరం గిరిజన బాలికల వసతి గృహంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దుమ్ముగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి పుల్లారెడ్డి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో వసతి గృహం ప్రధానోపాధ్యాయురాలు ధనసరి నాగమణి, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల అవస్థల వేళ బదిలీలు

- పంచాయతీలో పాడకేసిన పాలన
- ఈ సమయంలో అధికారుల బదిలీలు



నవతెలంగాణ - అశ్వారావుపేట

ఒక వైపు ఎడతెరిపిలేని వానలతో ఎటు చూసినా వరదలే. దీనికి తోడు ఎక్కడికక్కడ నీరు నిలిచి గ్రామాలు అంతర్గత వీధులు అన్నీ బురద మాయం కావడంతో దోమలు విజృంభిస్తున్నాయి. అయితే ఇటీవల తెలంగాణ ప్రభుత్వం బదిలీలు చేపట్టడంతో కార్యదర్శులు బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో మండలంలో 30 పంచాయతీలకు గాను మేజర్ పంచాయతీ అశ్వారావుపేట ఈ.ఓ సైతం బదిలీ అయ్యారు. కానీ ఆ స్థానాల్లో కొత్త కార్యదర్శులు రాకపోవడంతో పరిపాలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారు అయింది. వీటన్నింటికీ తోడు పంచాయతీల్లో సాధారణ పనులు నిర్వహణకు సైతం పైసా లేకపోవడంతో ప్రత్యేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉంటే మండల స్థాయిలో పంచాయతీలు పర్యవేక్షించాల్సిన ఎంపీఈఓ మెడికల్ లీవ్ పై ఉన్నట్లు తెలుస్తుంది. ఫిబ్రవరిలోనే సర్పంచ్‌లు పాలన ముగియడంతో ప్రతీ పంచాయతీకి మండల స్థాయి అధికారులను నియమించారు. వీరు సైతం ఈ బదిలీలు కావడంతో పాలన అస్తవ్యస్థంగా ఉన్నట్లు పలువురు అధికారులు వాపోతున్నారు.

వరదల కారణంగా చెరువులు దగ్గర నిఘా పెంచాలని, ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసారు. మండలంలో మొత్తం 42 చెరువులు/కుంటలను గుర్తించి వాటి సామర్థ్యానికి అనుగుణంగా మించి వరదలు చేరితే సుమారు 5 వేలుపై చిలుకు ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని ఖాళీ సంచులు సరఫరా చేసారు. ఇప్పుడు వీటిని సక్కబెట్టే వారు కరువయ్యారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శనివారం జులై 27, 2024 www.navatelangana.com

వ్యక్తిపై చీటింగ్ కేసు

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని బోడు పోలీస్ స్టేషన్లో తప్పుడు సమాచారంతో కేసు నమోదు చేయించి, ఫిర్యాదు చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు సీఐ తాటిపాముల సురేష్ తెలిపారు. శుక్రవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇల్లందు స్టేషన్ బస్తీకి చేందిన ఎండి ఖాజా సలీముద్దీన్ లారీ ఓనర్ అండ్ డ్రైవరు గత కొన్నేండ్లుగా లారీ నడుపుతున్నాడు. గత సంవత్సరం జనవరి నెలలో, చొల మండలం ఫైనాన్స్ వారి రూ.8,00,000 లోన్ సహాయంతో, లారీ బి.నెంబరు ఏపీ 20 టీబీ 9008ని కొనుగోలు చేసి బొగ్గు ట్రాన్స్పోర్ట్ కోసం ఉపయోగిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో సరైన లారీ కిరాయిలు లేనందు వల్ల అప్పులు ఎక్కువ అయి, లారీ ఫైనాన్స్ నెలవారి వాయిదాలు కూడా కట్టలేని పరిస్థితి వచ్చిందన్నారు. మిగిలిన వాయిదాలు కట్టకుండా ఉండాలంటే ఆ లారీని ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగిలించినట్లుగా, అందరినినమ్మించి, బోడు పోలీస్ స్టేషన్లో ఈనెల 12వ తేదీన ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేయిస్తే ఫైనాన్స్ వారు వాయిదాల డబ్బులు అడగరని, పోలీస్ స్టేషన్లో కేసు అయింది కాబట్టి వారు ఇన్సూరెన్స్ ద్వారా డబ్బులు పొందుతారన్నారు. లారీని ఎవరికైనా పాత బండిగా చెప్పి తుక్కు (స్క్రాప్)గా అమ్మి వచ్చిన డబ్బులను అవసరాలకు వాడుకోవచ్చు అనుకొని, అట్టి లారీని విజయవాడ ఆటోనగర్‌కు చెందిన ఎస్.కె. రహేమన్ అనే అతనికి అమ్మినట్టు తెలిపారు. లారీని ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగిలించినట్లుగా ఫైనాన్స్ వారిని, పోలీసు వారిని నమ్మించి, పోలీస్ స్టేషన్ నందు తప్పుడు ఫిర్యాదు చేసినందుకు అట్టి వ్యక్తిపై ఛీటింగ్, తప్పుడు కేస్ నమోదు చేపించినందుకు గాను అతనిపై కేస్ నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు తెలిపారు.

భవిష్యనిధి కార్యాలయం ప్రారంభించిన జెడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల జీపీఎఫ్(భవిష్య నిధి విభాగం) ఆఫీస్‌ను జిల్లా పరిషత్ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు శుక్రవారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.చంద్రశేఖర్, జిల్లా పరిషత్ జీపీఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ వివివికే ప్రసాద్, కార్యాలయం సిబ్బంది, టేకులపల్లి, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, అశోక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఏఎంసీ చైర్మెన్‌గా దోమ ఆనంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా పట్టణానికి చెందిన దోమ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అందించిన ప్రతిపాదనల మేరకు రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ సరితారాణి నుంచి గురువారం రాత్రి ఆనంద్ ను నియమిస్తూ ఉత్వరులు విడుదల చేశారు. ఆనంద్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మట్టా రాగమయి దయానంద్ విజయం కోరుతూ నియోజకవర్గ వ్యాప్తంగా విస్తతంగా ప్రచారం నిర్వహించారు. కష్టపడి పని చేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందనడానికి ఆనంద్ ను మార్కెట్ కమిటీ చైర్మన్ చేయడమే ఇందుకు తార్కాణం. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆనంద్ ను అభినందిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు, పెనుబల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిరుద్యోగులకు మొండిచేయి

నవతెలంగాణ-చంద్రుగొండ

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో నిరుద్యోగులకు సాధికారత నిధి కేటాయింపు లేదని నిరుద్యోగం యువత మిరియాల మోహన్రావు విమర్శించారు. శుక్రవారం నిరుద్యోగ యువత సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్లో నిరుద్యోగ యువత గురించి మాట్లాడలేదని, ఉద్యోగ అర్హత కలిగి లక్షలాదిమందికి వారికి రూ.5లక్షలు బ్యాంకులో రుణం ఇవ్వాలన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, సివిల్స్ గ్రూప్స్ తదితర ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, రాయి రాజా, రాజశేఖర్, సుధీర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో వాహన తనిఖీలు

నవతెలంగాణ-జూలూరుపాడు

ఎస్ఐ రాణా ప్రతాప్ శుక్రవారం తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో వాహన తనిఖీలు, స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనానికి సంబంధించిన ఆర్‌సి, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్స్, నంబర్ ప్లేట్స్ లేని సుమారు 30 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చారు. ప్రతి ద్విచక్ర వాహనం ముందు, వెనకాల తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ కలిగి ఉండాలని ఆ విధంగా లేనిచో వాహనం సీజ్ చేస్తామన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - అశ్వారావుపేట

ఒంటరిగా ఉంటున్న ఓ వివాహితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని సోదరుడు గుళ్ళ నాగు ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు ఎస్.ఐ శివరాం క్రిష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. మండల పరిధిలోని నారం వారి గూడెం కు చెందిన గుళ్ళ లక్ష్మణ్ రావు (25) భార్య సుధారాణి, ఇరువురు సంతానం ఉన్నారు. ఈయన మద్యానికి బానిసై కావడంతో భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లోనే ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం అతని సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మొక్కలు పంపిణీ బాధ్యతగా చేయాలి

ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత

నవతెలంగాణ-వైరాటౌన్



పర్యావరణ పరిరక్షణలో భాగంగా వైరా మున్సిపాలిటీలో ఇంటింటికీ చేస్తున్న మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది భారంగా భావించకుండా బాధ్యతగా చేయాలని ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్‌లో ఇంటింటికీ పంపిణీ చేసిన మొక్కలను మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా ఇండ్ల ముందు పడేయడం వలన చాలా మొక్కలు విరిగిపోయి పెంచడానికి పనికిరాకుండా పోయాయని, కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా ప్రజాధనం వృథా కావడంతో పాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యం మొక్కదశలోనే చనిపోతుందని అన్నారు. మొక్కలు పెంచడంతో పాటు పంచడం కూడా సామాజిక బాధ్యతగా భావించాలని, మొక్కల పంపిణీని మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షణ చేయాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఎన్ఐటి వరంగల్ విద్యార్థినికి ఆర్థికసాయం

నవతెలంగాణ-వైరాటౌన్



తండ్రి లేకపోయినప్పటికీ, ఆర్థికంగా వెనకబడి ఉన్నప్పటికీ ఎంతో పట్టుదలతో దాతల సహాయంతో కొణిజర్ల మండలం తనికెళ్ళ గ్రామంకు చెందిన ఎన్ఐటి వరంగల్‌లో బిటెక్ 3వ సంవత్సరం సిఈసి చదువుతున్న బీద విద్యార్థినీ భూక్యా లావణ్యకు చదువుకై వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన ప్రముఖ ప్రవాస భారతీయులు కొండబోలు సురేష్ పంపిన పదివేల రూపాయలను అందజేశారు. భవిష్యత్తులో ఇంకా కష్టపడి ఉన్నత స్థానానికి చేరాలని ఉపాధ్యాయులు జీ.వి సూర్యప్రకాష్‌రావు, పెనుగొండ ఉపేంద్రరావు, గోపాలరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాడికొండ రాము, కట్ల సురేష్, తల్లి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల కోసమే కేంద్ర బడ్జెట్

- వ్యకాస రాష్ట్ర అధ్యక్షుడు బుర్రి ప్రసాద్
- బడ్జెట్లో తెలంగాణకు మొండిచేయి
- రాష్ట్ర నాయకులు మెరుగు సత్యనారాయణ



నవతెలంగాణ- సత్తుపల్లి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తుల కోసమేనని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్రి ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద బడ్జెట్‌పై జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జీడీపీ కోసం అనునిత్యం శ్రమిస్తున్న శ్రమజీవులకు సంబంధించిన అంశాన్ని బడ్జెట్లో ప్రస్తావించకపోవడం విచారకరమన్నారు. సంఘ రాష్ట్ర నాయకులు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు మొండి చేయి చూపించారని దయ్యబట్టారు. ఈ కార్యక్రమానికి ముందు ప్రదర్శన నిర్వహించి కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు మోరంపూడి పాండురంగారావు, మల్లూరు చంద్రశేఖర్, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, రైతు సంఘ జిల్లా నాయకులు రావుల రాజబాబు పాల్గొన్నారు.


కలవరపెడుతున్న పార్కిన్సన్స్

- వయస్సుతో సంబంధం లేకుండా ప్రబలుతున్న వ్యాధి
- పాల్వంచలో బయటపడ్డ కేసు

నవతెలంగాణ-కొణిజర్ల

పార్కిన్సన్స్ వ్యాధి అనేది కేంద్ర నాడీ వ్యవస్థలో సంభవించే దీర్ఘకాలిక క్షీణత రుగ్మతకు సంబంధించినది. ప్రస్తుతం ఈ వ్యాధి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చాపకింద నీరులా పెరుగుతూ కలవరపెడుతుంది. ఇది ప్రధానంగా మోటారు వ్యవస్థను అనగా శరీర అవయవ చలనమును ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. వ్యాధి తీవ్రత పెరిగేకొద్ది, నాన్ మోటార్ లక్షణాలు సర్వసాధారణం కనిపిస్తుంటాయి. ఈ వ్యాధి లక్షణాలు సాధారణంగా చాలా నెమ్మదిగా బయటపడుతుంటాయి. వ్యాధి ప్రారంభంలో చాలా స్పష్టమైన లక్షణాలు అంటే వణుకు, బిగుసుకు పోవడం, కదలిక మందగించడం, నడకలో ఇబ్బంది వంటివి కనిపిస్తుంటాయి. ముఖ్యంగా ఆలోచించడం, ప్రవర్తనా సమస్యలు కూడా సంభవించి చిత్తవైకల్యం, జ్ఞాపక శక్తి తగ్గటం సాధారణం అవుతుంది. ఈ వ్యాధి ఉన్న వారిలో, 3వ వంతు వారికి వికారం, ఆందోళన చెందటం సాధారణం. ఇతర లక్షణాలు ఇంద్రియ, నిద్ర, మానసిక సమస్యలు ఉంటాయి.

ప్రధాన మోటారు లక్షణాలను సమిష్టిగా "పార్కిన్సోనిజం" లేదా "పార్కిన్సోనియన్ సింద్రోమ్" అని వైద్యులు పిలుస్తుంటారు. ప్రధానంగా పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి చేతి రాతలోనే వ్యాధి లక్షణాలు గుర్తించవచ్చు. ఈ వ్యాధి వల్ల న్యూరోసైకియాట్రిక్ సమస్యలు మానసిక స్థితి, జ్ఞానం, ఆలోచన మార్పులు ముఖ్యంగా వాసన మారుతుంది. అదేవిధంగా నిద్ర ఇబ్బందులు వంటి లక్షణాలు కూడా సర్వసాధారణంగా కనిపిస్తాయి. ఈ వ్యాధి ఇది ఔషదాల వాడకంతో మరింత దిగజారిపోతుంది. పగటి మగత (నార్కోలెప్సీని పోలి ఉండే ఆకస్మిక నిద్ర దాడులతో సహా రెమ్ నిద్రలో ఆటంకాలతోపాటు నిద్రలేమి వంటి లక్షణాలు కనిపిస్తాయి.



దోపమైన్..

పార్కిన్సన్ వ్యాధికి ప్రధాన కారణం మెదడుకి డోపమైన్ అనే రసాయనం అందకపోవడం వల్లే ప్రధానంగా ఈ వ్యాధి సోకుతుంది. అసలు ఈ డోపమైన్ ఏంటి దాని పనితీరు వివరాలు...

మెదడు, శరీరంలోని కీలకపాత్ర పోషించే ఒక నాడీ ప్రసారిణి (న్యూరోట్రాన్స్‌మిటర్). ఇది ఒక కార్బన రసాయనం. మెదడులో ఇది ఒక నాడీ ప్రసారిణిలా పనిచేస్తుంది. న్యూరాన్లు ఒకదాని నుంచి మరొకదానికి సందేశం పంపుకోవడానికి దీనిని ఉత్పత్తి చేస్తాయి. ఇవి మెదడులోని కొన్ని ప్రత్యేక భాగాల్లో ఉత్పత్తి అవుతాయి, కానీ చాలా భాగాలను ప్రభావితం చేస్తాయి. మోటారు నియంత్రణ, ప్రేరణ, బహుమతి, అభిజ్ఞా పనితీరు, పునరుత్పత్తి ప్రవర్తనలు వంటి న్యూరోమోడ్యులేషన్‌లో డోపమినెర్జిక్ వ్యవస్థ ముఖ్యమైన పాత్రలను పోషిస్తుంది. ఇది రెండు దశల ప్రక్రియ ద్వారా మెదడులో తయారవుతుంది. మొదట, ఇది అమైనో ఆమ్లం టైరోసిన్‌ను డోపా అనే పదార్థానికి మారుస్తుంది, ఆపై డోపమైన్‌గా మారుతుంది.

ఏదైనా ప్రతిఫలం దక్కుతుందన్న ఊహ జనించగానే మెదడులో డోపమైన్ విడుదల స్థాయి పెరుగుతుంది.అలాగే ఏదైనా మానలేని మాదక ద్రవ్యాలు కూడా డోపమైన్ స్థాయిని పెంచుతుంది. ఒకసారి విడుదలైన తర్వాత న్యూరాన్లు దానిని తిరిగి లోపలికి తీసుకోకుండా అడ్డుకుంటుంది. నరాల సంబంధించిన చాలా సమస్యలకు డోపమైన్ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం ముఖ్యకారణం. వీటిని నయం చేసే ఔషధాలు కూడా డోపమైన్ ప్రభావాల్ని మార్పు చేయడం ద్వారా పనిచేస్తాయి.

డోపమైన్ ద్వారా ప్రభావితం అయ్యే శారీరక భాగాలు ప్రేరేపణ, గుండె కొట్టుకునే రేటు, రక్తనాళాలు, మూత్రపిండాల పనితీరు, నిద్ర, ధ్యాస, వికారం, వాంతులు, నియంత్రణ, నొప్పి స్పందన, కదలికలు లాంటివి రోగిలో కనిపిస్తుంటాయి.

ఈ వ్యాధి నిర్ధారణ పరీక్ష లేదు. ముందు మానసికంగా సిద్ధం కావాలి : ప్రముఖ సీనియర్ న్యూరోఫిజిషియన్ అనుమోలు అప్పారావు (యండి డియం)స్పర్శ హస్పిటల్



పార్కిన్సన్ వ్యాధి గురించి ఒక్కమాటలో చెప్పాలంటే వాహనంలో ఇంధనం ఉంటేనే ముందుకు పోతుంది. లేకపోతే ఆగిపోతుంది. అలాంటి వ్యాధే పార్కిన్సన్. టాబ్లెట్ వేస్తేనే కొన్ని గంటలపాటు తగ్గుతుంది. టాబ్లెట్ పవర్ తగ్గినతర్వాత వ్యాధి యధావిధిగా ఉంటుంది. పార్కిన్సన్ వ్యాధి లక్షణాలను శారీరక వైద్య పరీక్షలతో గుర్తించవచ్చు. ఈ వ్యాధిని నిర్ధారించేందుకు ప్రత్యేక పరీక్షలు అంటూ ఏమి ఉండావు. ఒకసారి వ్యాధి సోకితే కుటుంబ సభ్యులంతా ముందు మానసికంగా సిద్ధంగా ఉండాలి. ఎందుకంటే ఈవ్యాధి ఒక్కసారి సోకితే వ్యాధిగ్రస్తుడితో జీవితకాలం కుటుంబ సభ్యులు ప్రయాణం చేయాల్సిందే. సమయానికి "సిండోపా" అనే టాబ్లెట్ తోపాటు మరికొన్ని మందులు వేస్తూ చిన్న చిన్న వ్యాయమాలు చేయిస్తుండటం వల్ల కొంతమేరకు వణుకుడు తగ్గించవచ్చు. ఈ వ్యాధి ఉన్నవాళ్లకు శస్త్రచికిత్స విధానం అందుబాటులో ఉంది. డిప్ బ్రెయిన్ స్టిమ్యూలేషన్ (డీబీఎస్) సర్జరీ చేస్తే రికవరీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

పార్కిన్సన్ వ్యాధిని ఆరోగ్యశ్రీ లో చేర్చాలి : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



పార్కిన్సన్ అనే భయంకరమైన వ్యాధిని ఆరోగ్యశ్రీ లో చేర్చాలి. ఇటివలే ఈ వ్యాధి వయస్సుతో సంబంధం లేకుండా వస్తుంది. పేదవాడు రెక్కాడితే కానీ కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితిలో ఉన్న కుటుంబాలలో ఈ మధ్య కాలంలో ఈ వ్యాధి సోకుతోంది. ఒక్కసారి ఈ వ్యాధి సోకితే జీవితాంతం కుటుంబ సభ్యులు భరించాలి. కావున రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీరియస్‌గా తీసుకోవాలి. పార్కిన్సన్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వికలాంగులుగా గుర్తించి నెలకు పదివేలు రూపాయలు అందించాలి..

ముఖ్యమంత్రి గారు నాకు ఆపరేషన్ చేయించండి :

బొల్లెద్దు కిషోర్, పాల్వంచ



పాల్వంచ పట్టణంలో వెల్డింగ్ చేసుకోని జీవిస్తున్న నాకు గత ఐదుసంవత్సరాల క్రితం పార్కిన్సన్ వ్యాధి సోకింది. ఈవ్యాధి సోకిన దెగ్గర నుంచి తిరగని హస్పిటల్ లేదు. వాడని మందులు లేవు. అయిన ఫలితం లేకుండా పోతుంది. ఇప్పటికే పదిలక్షల వరకు ఖర్చు అయ్యాయి. నా ఆర్థిక పరిస్థితికి మించి ఖర్చుపెట్టాను. చివరి ప్రయత్నంగా హైదరాబాద్ లోని ఓప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లాను. పరీక్ష చేసిన వైద్యులు డిప్ బ్రెయిన్ స్టీమ్యూలేషన్ (డిబిఎస్) సర్జరీ చేయాలని 19 లక్షలకు ఫైనల్ బిల్లు వేశారు. ఇప్పుడు ఆపరేషన్ చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఆపరేషన్ చేయించాలని మా కుటుంబ సభ్యులమంతా వేడుకుంటున్నాము.

విధులలో చేరిన నూతన పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-బోనకల్

బోనకల్ మండలానికి బదిలీపై వచ్చిన నూతన గ్రామపంచాయతీ కార్యదర్శులు అధికార బాధ్యతలను స్వీకరించారు. మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉండగా 11 మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వీరు స్థానంలో 11 మంది బదిలీపై బోనకల్ వచ్చారు. ఖాళీగా ఉన్న తూటికుంట్ల గ్రామపంచాయతీకి కూడా నూతన గ్రామపంచాయతీ కార్యదర్శి బదిలీపై వచ్చారు. ఆళ్లపాడు గ్రామపంచాయతీ కార్యదర్శిగా మల్లారపు శ్రీనివాసరావు, జానకిపురం పంచాయతీ కార్యదర్శిగా కన్నెధర శ్రీనివాస్, పెద్దబీరవల్లి కార్యదర్శిగా తలుపుల రాము, సీతానగరం కార్యదర్శిగా దామాల వినోద్ కుమార్, రావినూతల కార్యదర్శిగా నాయుడు వెంకట్రావమ్మ, తూటికుంట్ల కార్యదర్శిగా బి సురేష్, లక్ష్మీపురం కార్యదర్శిగా పొన్నెకంటి జ్యోతి, కలకోట కార్యదర్శిగా చెవుల మహేష్, బ్రాహ్మణపల్లి కార్యదర్శిగా ఎం.రాధాకృష్ణమూర్తి, రాయన్నపేట కార్యదర్శిగా జీడిమెట్ల రాధమ్మ, చిరునోముల కార్యదర్శిగా వెంపటి సురేందర్, చొప్పకట్లపాలెం కార్యదర్శిగా మొగిలి శివశంకర్‌లు బాధ్యతలు స్వీకరించారు. గోవిందాపురం ఏ, రామాపురం గ్రామపంచాయతీ కార్యదర్శులు మెడికల్ సెలవులో ఉండటం వలన గోవిందాపురం ఏకు ఆళ్లపాడు కార్యదర్శి మల్లారపు శ్రీనివాసరావును ఇన్చార్జి కార్యదర్శిగా నియమించారు. రామాపురానికి గార్లపాడు కార్యదర్శి కాశిబోయిన నాగేశ్వరరావుని ఇన్చార్జి కార్యదర్శిగా నియమించారు.



సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలకు సిఫార్సు

నవతెలంగాణ-కామేపల్లి

సర్వసభ సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామని ఎంపీపీ బాణోత్ సునిత, ఎంపీడీవో రవీందర్ హెచ్చరించారు. మండలపరిషత్ కార్యాలయంలో సర్వసభ్యసమావేశం ఎంపీపీ సునిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు కొందరే హాజరయ్యారు. పనిచేయని అధికారులపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. సర్పంచులు చేసిన పని తప్ప స్పెషల్ ఆఫీసర్ల వల్ల ఒరిగింది ఏమీలేదని, వారిని కనీసం గ్రామపంచాయతీలలో ఎప్పుడు చూడలేదని మండిపడ్డారు. ఇంచార్జ్ ఎంఇఓ ఉండటం వలన ప్రభుత్వ విద్య కుంటుపడుతుందన్నారు. పర్మినెంట్ ఎంఇఓ పోస్టును ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుధాకర్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నలుగురు తహసీల్దార్ల బదిలీలు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం జిల్లాలో నలుగురు తహసిల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. కొణిజర్ల తహసీల్దార్ రాంబాబు మధిర, చింతకాని తహసీల్దార్ రమేష్ కల్లూరు, కలెక్టరేట్లో విధులు నిర్వహిస్తున్న హుస్సేన్ను కొణిజర్లకు బదిలీ చేశారు. అటు మధిర తహసీల్దార్ వెంకటేశ్వర్లును ఖమ్మం కలెక్టరేట్లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

బాణాపురంలో వైద్యశిబిరం

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలో బాణాపురంలో వల్లభి పిహెచ్సి వైద్యాధికారి కె ధర్మేందర్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి ధర్మేంద్ర మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి వివరించారు.గ్రామాల్లో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని,మురికి నీరు,నిల్వ లేకుండా ఉంచుకోవాలన్నారు.డెంగ్యూ మలేరియా రోగాలు రాకుండా ప్రజలు ఆరోగ్య నియమాలు పాటిస్తూ,జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు.జ్వరాలు వస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలలో శానిటేషన్ బ్లీచింగ్ చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ వాల్మీకి కిషోర్, పంచాయతీ కార్యదర్శి వేమూరి నాగమణి, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



దేవస్థానం పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో ముత్తారం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఇన్చార్జి ఈవో రెంటాల సమత సమక్షంలో శుక్రవారం నూతన పాలక మండల సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.అనంతరం పాలక మండల సభ్యులు,దేవాలయ పాలకమండలి చైర్మన్ గా తాళ్లూరి జీవన్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీతారామచంద్రస్వామి దేవాలయంకు ఏడుగురు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో ఉత్తర్వులు జారీ చేసిన విషయము విదితమే. ఈకార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు,మధిర నియోజకవర్గ ఇంచార్జ్ వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుల్లెట్ బాబు,మల్లెల అజయ్,పిల్లుట్ల రాఘవ గ్రామ మాజీ సర్పంచ్ తాళ్ల నాగయ్య, మాజీ ఎంపీటీసీ ఏటుకూరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

'రజకుల సంక్షేమానికి బడ్జెట్ పెంచాలి'

నవతెలంగాణ-కొణిజర్ల

2024-25 సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో సేవ వృత్తిదారుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా వివక్షత చూపించిందని, రజకుల సంక్షేమానికి బడ్జెట్ పెంచాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రజక వృత్తిదారుల సంక్షేమ రుణాలకు కేవలం 30 కోట్లు మాత్రమే కేటాయించారని, కమ్యూనిటీ సర్వీస్ లైన దోబిగాట్లకు కేవలం మూడు కోట్లు మాత్రమే బడ్జెట్లో పొందుపరిచారని, ఉచిత విద్యుత్‌కు గత సంవత్సరం విద్యుత్ సంస్థకు 100 కోట్లు బకాయి ఉందని చెప్పిన ప్రభుత్వం ఈ బడ్జెట్లో ఉచిత విద్యుత్‌కు 150 కోట్లు కేటాయించారు. రజక వృత్తిదారుల సొసైటీలు 3400 లకు పైగా ఉన్నప్పటికీ వాటికి సుమారు 500 కోట్లు రుణాలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రజకుల సంక్షేమానికి 30 కోట్లు కేటాయించడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్లో రజక వృత్తిదారుల సంక్షేమానికి 1000 కోట్లు అవసరమని రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేస్తూ వస్తున్నాము ప్రభుత్వం వెంటనే రజక వృత్తిదారులకు బడ్జెట్ పెంచాలని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లో రజకులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐలమ్మ జయంతి నాటికి హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

చింతకాని తహశీల్దార్‌గా అనంతరాజు

నవతెలంగాణ- బోనకల్ (చింతకాని)

చింతకాని తహశీల్దార్‌గా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుంచి కే.అనంతరాజు బదిలీపై రానున్నారు. చింతకాని తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అనంతుల రమేష్ కల్లూరు ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. చింతకాని తహసిల్దార్‌గా విధులు నిర్వహించిన అనంతుల రమేష్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా భూ సమస్యపై అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఆ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన భోజడ్ల ప్రభాకర్ భూ సమస్య కారణంగా ఆత్మహత్య చేసుకున్న సంగతి విదితమే. ప్రభాకర్ భూ సమస్యపై సరిగా స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా మున్నూరు కాపు సర్టిఫికెట్ల విషయంలోనూ తల్లిదండ్రుల సర్టిఫికెట్ల ఆధారంగా వారి పిల్లలకు మున్నూరు కాపు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారనే ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి. సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ కారణాల చేతనే ఆయనపై బదిలీ వేటు పడినట్లు తెలుస్తుంది.

శాంతి నిలయంలో పసుపులేటి సమ్మయ్య వర్ధంతి

నవతెలంగాణ - బోనకల్



మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణానికి చెందిన అగ్రికల్చర్ అండ్ సెరికల్చర్ ఆఫీసర్ అమరజీవి పసుపులేటి సమ్మయ్య 3వ వర్ధంతిని మండల కేంద్రంలో గల శాంతి నిలయంలో మానసిక వికలాంగుల మధ్య శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగులకు పసుపులేటి సమ్మయ్య భార్య పసుపులేటి కరుణ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మాట్లాడుతూ అమ్మనాన్నలు లేని అనాధ దివ్యాంగ చిన్నారుల మధ్య పసుపులేటి సమ్మయ్య వర్ధంతిని నిర్వహించిన కరుణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పసుపులేటి కరుణ, శ్రీలక్ష్మి సారిక, ప్రణవి, సమ్మయ్య కుమారులు పసుపులేటి ప్రశాంత్, పసుపులేటి వివేక్, శాంతి నిలయం నిర్వాహకులు సిస్టర్ ఆల్ ఫీ, సిస్టర్ బిజిలీ, సిస్టర్స్ శ్యామల, ప్రేమ, రోజా, లియా తదితరులు పాల్గొన్నారు.



'క్రాంతి'లో వన మహోత్సవం

నవతెలంగాణ-వైరాటౌన్

స్థానిక క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఆధ్వర్యంలో "ఏక్ పెడ్ మాకే నామ్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కళాశాల ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆవరణ శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని, పచ్చని ప్రకృతి ద్వారా మానవజాతి మనుగడ ఉంటుందని లేకపోతే రాబోయే కాలానికి ప్రాణవాయువు సమస్య ఎదురవుతుందని అన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంయోగిత, ఎన్ఎస్ఎస్ పిఒ లింగారావు, కృష్ణారావు, నాగలక్ష్మి, వేణు, చైతన్య, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

వృత్తిదారులకు మొండిచేయి

- ఎన్నికల హామీలకు బడ్జెట్‌కు పొంతనే లేదు
- అసమానతలతో కూడిన బడ్జెట్ : సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

బడ్జెట్‌లో వృత్తిదారులకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలకు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు సారూప్యత లేదన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లేదన్నారు. అసమానతలతో కూడుకున్న బడ్జెట్ అని తెలిపారు. చేనేత రంగానికి రూ.367 కోట్లు కేటాయించినప్పటికీ జీతభత్యాలకే సరిపోదన్నారు. ఎన్నికల ముందు వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి సన్నవడ్లకు మాత్రమే ఇస్తామనడం సరికాదన్నారు. అన్ని రకాల వడ్లకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు భరోసాపై స్పష్టత లేదన్నారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి గుండుసున్నా పెట్టిందని విమర్శించారు. దీనిపై సీపీఐ(ఎం) పోరాటం చేస్తుందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు డిండి ఎత్తిపోతలు, ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తి చేయాలన్నారు. వివిధ రంగాలకు కేటాయించిన నిధులను విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు. జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్ రెడ్డి భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నారని, ఇకనైనా ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలన్నారు. మూసీ సుందరీకరణ తప్ప ప్రక్షాళనకు నిధుల ఊసే లేదన్నారు. బడ్జెట్ సవరణల్లోనైనా ప్రజా కోణంతో నిధుల కేటాయింపులు ఉండాలన్నారు. రాజకీయ భేషజాలకు భిన్నంగా బడ్జెట్ రూపకల్పన జరగాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతోందని, ఇక రాజకీయ మాటలతో కాలయాపన చేయడం తగదని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం వేగవంతం చేయాలన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. డిండి ఎత్తిపోతల పథకానికి నీళ్ల ఎక్కడి నుంచి ఇస్తారనే స్పష్టత ప్రభుత్వానికి లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దోనూరు నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసాచారి, ఎండి పాషా, పుట్టపాక మాజీ ఎంపీటీసీ మర్రి వసంత, గడ్డం వెంకటేష్, సీనియర్ నాయకులు దొంతగాని పెద్దులు, తుమ్మల నర్సిరెడ్డి, అయితరాజు గాలయ్య, పల్లె మధు, పిట్ట రాములు, ఉప సర్పంచ్ వర్కాల చంద్రశేఖర్ ఉన్నారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన ఇన్నోవా

- ఇద్దరు మృతి.. 12 మందికి గాయాలు



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్నోవా వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆపై పల్టీ కొట్టి అవతలి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం, బీఈ కంపెనీ బస్సును గుద్దేసింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో 12మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ఇన్నోవా వాహనం సిద్దిపేట రోడ్డు నుంచి హైదరాబాద్ వైపునకు వస్తోంది. జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట గ్రామం విమల ఫీడ్స్ దగ్గరలో రాజీవ్ రహదారి మెయిన్ రోడ్డుపైన వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో పల్టీ కొట్టింది. రోడ్డుకు మరో వైపు ఎదురుగా హైదరాబాద్ నుంచి తుర్కపల్లి వైపు వెళుతున్న యాక్టీవా వాహనంతోపాటు బయలాజికల్ ఈ లిమిటెడ్ కంపెనీకి చెందిన బస్సును ఢీ కొట్టింది. దాంతో ఇన్నోవా వాహనం నుజ్జు నుజ్జయింది. ఇన్నోవాలోని హాకింపేటకు చెందిన మోహన్(25), మౌలాలికి చెందిన దీపికా (23) అక్కడికక్కడే మృతిచెందారు. యాక్టీవాపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బీఈ కంపెనీ ఉద్యోగులు సుమారు 10 మందికి, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేడారం సారలమ్మ పూజారి కాక సంపత్ మృతి



నవతెలంగాణ-తాడ్వాయి

కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మేడారం సారలమ్మ పూజారి కాక సంపత్ (38) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ఊరట్టం గ్రామ పంచాయతీ పరిధిలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన పూజారి సంపత్ ఆరోగ్యం బాగాలేక కొన్ని రోజులుగా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. కాగా, ఇటీవల ఇంటికి వచ్చిన ఆయన గురువారం రాత్రి మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఇంటి వద్దే మృతి చెందాడు. కాగా ఇటీవలే మేడారం సమ్మక్క ప్రధాన పూజారి మల్లెల ముత్తయ్య (50) కూడా అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.

పాలకవర్గంతో 'ఢీ'సీసీబీ

ఖమ్మం సహకార బ్యాంకు సీఈవో, చైర్మెన్ ఏకపక్ష ధోరణి

- డైరెక్టర్లతో సంబంధం లేకుండా టెస్కాబ్ పేరుతో నిర్ణయాలు
- పాలకవర్గం ఆమోదం లేకుండానే బదిలీలు, ఉద్యోగోన్నతులు
- 13 మందికి ఉద్యోగోన్నతిలో డిగ్రీ కొర్రీపై పాలకవర్గం విమర్శలు
- డిగ్రీ చదివినా మళ్లీ చేస్తేనే ప్రమోషన్‌పై డైరెక్టర్ల వ్యతిరేకత



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలనా వ్యవహారాలు పాలకవర్గం ప్రమేయం లేకుండానే ఏకపక్షంగా సాగుతున్నాయి. చైర్మెన్ డి.వెంకటేశ్వర్లు, సీఈవో అబిద్ ఉర్ రెహ్మాన్ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వస్తున్నాయి. పాలకవర్గం నిర్ణయాలకు వ్యతిరేకంగా బదిలీలు, ప్రమోషన్లు.. ఇలా ఒకదాని వెంట ఒకటి సాగుతున్నాయి. పాలకవర్గం వ్యతిరేకించినా టెస్కాబ్ నిబంధనల పేరుతో అమలు చేస్తున్నారు. మరో ఆరునెలలు మాత్రమే ఈ పాలకవర్గం పదవీకాలం ఉండటంతో సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్యాంకు వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదని తెలుస్తోంది. పాలకవర్గం డైరెక్టర్లుగా ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు ఉండటంతో ఇక డీసీసీబీ వ్యవహారాల్లో ముగ్గురు మంత్రుల్లో ఎవరూ జోక్యం చేసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో పాలకవర్గం ప్రమేయం లేకుండానే బ్యాంకులో నిర్ణయాలు అమలవుతున్నాయి. తమతో సంబంధం లేకుండా బ్యాంకు నిర్వహణ కొనసాగుతున్న నేపథ్యంలో మెజార్టీ డైరెక్టర్లు సమావేశాలకు దూరంగా ఉండటంతో కోరం లేక మీటింగ్‌లు వాయిదా పడుతున్నాయి.

డీసీసీబీ పాలన అస్తవ్యస్తం..

చైర్మెన్‌ది ఓ దారి.. సీఈవోది మరో దారి.. డైరెక్టర్లది ఇంకోదారిగా ఉండటంతో బ్యాంకు పాలన అస్తవ్యస్తంగా తయారవుతోందనే విమర్శలున్నాయి. కొన్నిరోజులుగా సమావేశాలు, తీర్మానాలు, ఎజెండా ఇవేవీ లేకుండా బ్యాంకు పాలన గాడి తప్పుతోంది. వందేండ్ల చరిత్ర, రూ.3వేల కోట్ల లావాదేవీలున్న ఖమ్మం డీసీసీబీ.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉంది. బ్యాంకు పరిధిలో వంద పీఏసీఎస్‌లు, 176 వ్యవసాయేతర సహకార సంఘాలు, 50 డీసీసీబీ బ్రాంచీలు ఉన్నాయి. పాలకవర్గం మధ్య విభేదాల కారణంగా ఇప్పుడు వీటి నిర్వహణలో రకరకాల లోపాలు తలెత్తుతున్నాయి. సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత జిల్లాలోనే ఈ పరిస్థితి నెలకొనడంతో ఈ విషయంలో మంత్రి జోక్యం చేసుకోవాలనే డిమాండ్ ఊపందుకుంటున్నాయి.

13 మంది ప్రమోషన్స్‌పై డైరెక్టర్ల వ్యతిరేకత..

ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో పనిచేస్తున్న 13 మంది ఆఫీస్ సబార్డినేట్లకు తాజాగా స్టాఫ్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వారికి సీఈవో రెహ్మాన్ చేతుల మీదుగా మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. అయితే దీన్ని పాలకవర్గం వ్యతిరేకించింది. 2020 తర్వాత డిగ్రీ చేసిన వారికి మాత్రమే ప్రమోషన్లు ఇవ్వడాన్ని డైరెక్టర్లు తప్పుబట్టారు. అయినప్పటికీ టెస్కాబ్ నిబంధనల పేరుతో ఉద్యోగోన్నతి కల్పించారు.

టెస్కాబ్ పేరు చెప్పి...

టెస్కాబ్ నిబంధనల పేరుతో బ్యాంకులో బదిలీలు, ప్రమోషన్లు చేపడుతుండటాన్ని పాలకవర్గం వ్యతిరేకిస్తోంది. 2020కి పూర్వం డిగ్రీలున్నా అవి చెల్లవని, ఆ తర్వాత డిగ్రీ చేసిన వారికి మాత్రమే స్టాఫ్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించడంపై డైరెక్టర్లు సీఈవోను ప్రశ్నించారు. ఎవరైనా ఒక్కసారే డిగ్రీ చేస్తారు కానీ పదే పదే డిగ్రీలు ఎలా చేస్తారని పాలకవర్గం నిలదీసింది. ఎప్పుడో ఉద్యోగంలో జాయినయిన వాళ్లు మళ్లీ డిగ్రీ చేయాలంటే ఎలా అని ప్రశ్నించారు. దేశంలో ఏ సహకార వ్యవస్థలోనూ ఈ రకమైన నిబంధన లేదని, కేవలం తెలంగాణ సహకార రంగంలోనే ఈ రకమైన నిబంధన ఉండటం ఏంటని ప్రశ్నించారు. అయినప్పటికీ టెస్కాబ్ ఎండీ దీనిపై సానుకూలంగా లేరని, నిబంధనల ప్రకారమే ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నామని సీఈవో డైరెక్టర్లకు వివరించారు.

డైరెక్టర్ల మూడు డిమాండ్లు..

సమావేశాలను కోరం లేకుండా డైరెక్టర్లు బహిష్కరించడానికి ప్రధానంగా మూడు డిమాండ్లు ఉన్నాయి. వీటిలో ఒకటి ఎజెండాలో చైర్మెన్ ఎన్నికను పెట్టాలి. రెండోది ఇటీవల జరిగిన బదిలీల్లో హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయకుండా అక్రమంగా ట్రాన్స్‌ఫర్లు చేశారని, దీనివల్ల కొందరికి అన్యాయం జరిగిందని అంటున్నారు. కాబట్టి ఈ బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక మూడో అంశానికొస్తే కొద్దిరోజుల క్రితం 22 మంది ఖాతాదారులకు రూ.20లక్షలకు పైగా మార్టిగేజ్ రుణాలు మంజూరు చేశారు. వాస్తవానికి రూ.10 లక్షలకు పైగా రుణాలు ఇస్తే డీజీఎం అనుమతి తప్పనిసరి. కానీ డీజీఎంను వదిలేసి ఆ లోన్లు మంజూరు చేశారనే సాకుతో మేనేజర్లపై చర్యలు తీసుకునేందుకు పూనుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇదీ కరెక్టు కాదు.. తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని డీజీఎంపై చర్యలు తీసుకోవడంలో చైర్మెన్, సీఈవో వెనుకాడుతున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మూడు అంశాలు తేలకుండా సమావేశాలకు వచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. ఈనెల 6వ తేదీన జరిగిన సమావేశాన్ని సైతం బహిష్కరించారు. అంతకుముందు రెండు, మూడు సమావేశాలకు కూడా గైర్హాజరయ్యారు. వీటిలో చైర్మెన్, డైరెక్టర్ల ఎన్నికకు సంబంధించిన అంశాన్ని మంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని చైర్మెన్ తెలిపినట్టు విశ్వసనీయ సమాచారం. డైరెక్టర్ల డిమాండ్లకు సంబంధించిన మినిట్స్ కాపీ సైతం 'నవతెలంగాణ'కు అందడం గమనార్హం.



గొర్రెల స్కాంపై సర్కారు దర్యాప్తు

- రూ.700 కోట్లకు పైగా చేతులు మారినట్టు ఏసీబీ అభియోగాలు
- రెండు విడుతల్లో ప్రభుత్వం రూ.5వేల కోట్లు వ్యయం
- 4లక్షల కుటుంబాలకు 80 లక్షల గొర్రెల పంపిణీ
- అయినా సంఖ్య పెరగక పోవడంపై సందేహాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గొర్రెల పంపిణీ పథకంలో భారీ అవినీతి జరిగింది. వేలు కాదు లక్షలు కాదు, రూ. 7వందల కోట్లకుపైగా మింగేశారు. ఈ స్కీంను పెద్ద స్కాంగా మార్చేశారు. రైతులకు బదులు ప్రయివేట్ వ్యక్తుల ఖాతాల్లోకి నిధులు మళ్లించారు. 2019 నుంచి జరిగిన ఈ కుంభకోణంలో పశుసంవర్ధకశాఖలోని కింది స్థాయి సిబ్బంది నుంచి మొదలుకుని ఉన్నతాధికారుల వరకు ఉన్నారని పేర్కొంటూ ఏసీబీ కేసులు నమోదు చేసి పలువురిని ఇప్పటికే అరెస్ట్ చేసింది. ఈ అవినీతిపై లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరముందని సర్కార్ భావిస్తోంది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని 2017 జూన్ 20న ప్రారంభించింది. రెండు విడుతల్లో రాష్ట్రంలో అర్హులుగా గుర్తించిన 7.30 లక్షల మందికి రెండేండ్లలో గొర్రెలను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఒక్కో యూనిట్ కింద 21 గొర్రెలకు రూ.1.25 లక్షలుగా నిర్ణయించారు. ఆ తర్వాత మునుగోడు ఎన్నికల సందర్భంలో ఈ మొత్తాన్ని రూ.1.75 లక్షలకు పెంచారు. రెండు విడుతల్లో కలిపి నాలుగు లక్షల యూనిట్లకు 21 గొర్రెల చొప్పున దాదాపు 84 లక్షల గొర్రెలను పంపిణీ చేశారు. అయితే రెండో విడుతలో అనేక అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వెల్లువెత్తడంతో సర్కార్ ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఈ పథకంలో అవినీతికి పాల్పడి ప్రయివేట్ వ్యక్తులతో కలిసి బినామీ బ్యాంక్ ఖాతాల్లోకి పథకం నిధులను తరలించినట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది. ఈ పథకం కింద పంపిణీ చేసిన గొర్రెలెన్ని? ఎంత మొత్తాన్ని దీని కోసం వెచ్చించారు? పశు సంపద ఎంత మేర పెరిగింది? తదితర అంశాలపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విచారించింది. ఫలితంగా నమ్మశక్యం కాని నిజాలు బయటపడ్డట్టు తెలుస్తోంది.

2019 లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1,90,81,605 గొర్రెలు, 4,96,465 మేకలు ఉన్నాయి. రెండు విడుతల్లో గొర్రెల పంపిణీ తర్వాత 2024 జూన్ నాటికి 1,24,14,299 గొర్రెలు, 3,92,609 మేకలు మొత్తం కలిపి 1,62,69,908 ఉన్నట్టు తేలింది. 2019 నుంచి 2024 గణాంకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెలు, మేకల సంఖ్య సగటున 32.40 శాతం తగ్గిందని వెల్లడైంది. రెండు విడుతల పంపిణీ తర్వాత ఎందుకు తగ్గింతో తేలాల్సి ఉంది

జిల్లాల వారీగా గొర్రెలు, మేకల సంఖ్య

S.No	District	2019			2024 (జూన్ 30 నాటికి)				తగ్గుదల శాతంలో
		గొర్రెలు	మేకలు	మొత్తం	కుటుంబాల సంఖ్య	గొర్రెలు	మేకలు	మొత్తం	
1	మేడ్చల్	149401	40020	189421	963	51915	22929	74844	60.49
2	వరంగల్	733016	103722	836738	4571	266360	67101	333461	60.15
3	సంగారెడ్డి	438757	229029	667786	5321	185790	126347	312137	53.26
4	మెదక్	637146	152770	789916	4668	289734	101577	391311	50.46
5	నిజామాబాద్	735539	156619	892158	3578	381354	97034	478388	46.38
6	సిద్దిపేట	801259	183442	984701	5515	400338	130130	530468	46.13
7	ఖమ్మం	667318	190013	857331	6344	316070	156822	472892	44.84
8	కరీంనగర్	638706	92687	731393	4407	351413	62280	413693	43.44
9	రంగారెడ్డి	768716	257129	1025845	6828	414205	172479	586684	42.81
10	పెద్దపల్లి	552257	97368	649625	3432	307686	76075	383761	40.93
11	రాజన్న సిరిసిల్ల	393683	88533	482216	2794	231143	57646	288789	40.11
12	జనగాం	679829	126668	806497	5467	391053	99716	490769	39.15
13	కామారెడ్డి	587156	169012	756168	4348	361092	121729	482821	36.15
14	మహబూబాబాద్	677922	178042	855964	8733	425712	127344	553056	35.39
15	భద్రాద్రి కొత్తగూడెం	267256	255909	523165	6297	141287	207413	348700	33.35
16	జగిత్యాల	611080	97033	708113	5159	381650	94967	476617	32.69
17	సూర్యాపేట	779090	140439	919529	9134	494440	128327	622767	32.27
18	యాదగిరి భువనగిరి	650426	147947	798373	3317	436487	118947	555434	30.43
19	నాగర్ కర్నూల్	970150	206493	1176643	7299	680728	147318	828046	29.63
20	నిర్మల్	502576	131866	634442	4212	347994	100113	448107	29.37
21	ఆదిలాబాద్	153214	186469	339683	5050	89746	155187	244933	27.89
22	మహబూబ్‌నగర్	1008098	154933	1163031	6386	761292	102070	863362	25.77
23	ములుగు	128836	75483	204319	2036	82749	70617	153366	24.94
24	కొమురం భీం ఆసిఫాబాద్	160958	259539	420497	6060	123504	199656	323160	23.15
25	వికారాబాద్	238786	254673	493459	9649	168993	214778	383771	22.23
26	జయశంకర్ భూపాలపల్లి	291765	80848	372613	3151	198123	91686	289809	22.22
27	హనుమకొండ	387752	54787	442539	3205	284562	62521	347083	21.57
28	నారాయణపేట	1294124	125760	1419884	7377	1078945	92452	1171397	17.50
29	నల్లగొండ	1102533	337530	1440063	14865	876913	320096	1197009	16.88
30	మంచిర్యాల	520731	183526	704257	7350	454994	151952	606946	13.82
31	జోగులాంబ గద్వాల	576693	67568	644261	2839	522848	60127	582975	9.51
32	వనపర్తి	976832	80608	1057440	4760	915179	65173	980352	7.29
	మొత్తం	19081605	4906465	23988070	175115	12414299	3802609	16216908	32.40

లక్ష్యం మేరకు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలి

- కమిషనర్ ఆమ్రపాలి




నవతెలంగాణ-సిటీబ్యూరో

లక్ష్యం మేరకు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. శుక్రవారం జోనల్ అడిషనల్ కమిషనర్‌లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సీఆర్ఎంపీ ద్వారా చేపట్టిన రోడ్లకు సంబంధించిన ఏజెన్సీలతో చేసుకున్న అగ్రిమెంట్‌కు డిసెంబర్ వరకు గడువు ఉండటంతో పెండింగ్‌లో ఉన్న మెయింటెనెన్స్ పనులు వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. ఏజెన్సీ ఒప్పందంలో ఉన్న అంశాలకు పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. అవసరమైతే ఏజెన్సీలతో జోనల్ స్థాయిలో సమీక్ష చేసి ఒప్పందం చేసుకునే విధంగా ఏమైనా గ్యాప్ ఉంటే వెంటనే పనులు చేయించాలని చెప్పారు. డెంగ్యూ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరంగా చేపట్టాలని తెలిపారు. దోమలతో వచ్చే వ్యాధులతో పాటుగా ఈగల ద్వారా వచ్చే వ్యాధులపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై నగర వాసులు దృష్టి సారించాలన్నారు. కమ్యూనిటీ హాల్స్ వివరాలు సర్కిల్స్ వారీగా పూర్తి నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు.

కేంద్ర బడ్జెట్‌పై కేసీఆర్ మౌనం వెనక మర్మమేంటి..?

- బీజేపీ వైపు బీఆర్ఎస్ అడుగులు
- తమది రైతు పక్షపాత ప్రభుత్వం : రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

తెలంగాణ బడ్జెట్‌పై గగ్గోలు పెడుతున్న కేసీఆర్ కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి మంత్రి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల విషయంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని అదే రోజు సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి ఖండించారని గుర్తు చేశారు. బీజేపీ వైపు బీఆర్ఎస్ అడుగులు పడుతున్నాయని, అందుకే కేంద్ర బడ్జెట్‌పై నోరు మెదపడం లేదని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికే రూ.73 వేల కోట్లు కేటాయించామని, అయినా బీఆర్ఎస్ నేతలు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. చెప్పిన పథకాలతో పాటు కొత్తవాటిని కూడా అమలు చేస్తామని చెప్పారు. వారం రోజుల్లో లక్షన్నర, ఆగస్టు 15లోపు రెండు లక్షలలోపు రుణమాఫీ చేస్తామని అన్నారు. రైతు కూలీలకు ఇచ్చే రూ.12000 పథకం అమలు చేస్తామని తెలిపారు. రెండుసార్లు అసెంబ్లీ నడిపిస్తే కేసీఆర్ రాకుండా.. నేడు వచ్చి కాంగ్రెస్‌ను చీల్చి చెండాడుతానని అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చీల్చి చెండాడారని ఎద్దేవా చేశారు. అయినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదన్నారు. దక్షిణ తెలంగాణలోని ఎస్ఎల్బీసీ సొరంగం, బ్రాహ్మణ వెల్లంల, సీతారామ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని చెప్పారు. తమది రైతు పక్షపాతి ప్రభుత్వమని అనడానికి రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించడమే నిదర్శనమన్నారు. పది రోజుల్లో బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు ట్రయల్ రన్ నిర్వహిస్తామని, డిసెంబర్‌లోపు కాలువలను పూర్తి చేస్తామని వెల్లడించారు.

తగ్గుతూ...! పెరుగుతూ....!


- గోదావరితో అధికారులకు 'ముంపు' తిప్పలు
- పోలవరం వల్లే ఈ ముంపు
- వరదకు 'భద్రాచలం' బలికాకతప్పదా..?



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

తగ్గుతూ.. పెరుగుతూ.. భద్రాచలం వద్ద గోదావరి అధికారులను ముప్పు తిప్పలు పెడుతోంది. గురువారం మధ్యాహ్నం నుంచి తగ్గిన గోదావరి శుక్రవారం మధ్యాహ్నం నుంచి తిరిగి పెరగటం ప్రారంభించి ఇటు లోతట్టు ప్రాంత ప్రజలను, అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో వర్షాలు కొంతమేరకు తగ్గినా, ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గకపోవడంతో భారీగా వరద నీరు గోదావరికి చేరుతోంది. దాంతో భద్రాచలం వద్ద గోదావరి శుక్రవారం మధ్యాహ్నం నుంచి మళ్లీ పెరగటం ప్రారంభించింది. దిగువ ప్రాంతంలో ఉన్నటువంటి శబరి నది శాంతించి ఎదురుపోటు లేకపోవడంతో వరద ఉధృతి తీవ్రత కొంతమేర భద్రాచలం వద్ద తగ్గింది. శుక్రవారం రాత్రికి మరోసారి 48 అడుగులకు చేరుకొని రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహించే అవకాశం ఉందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ములుగు జిల్లా పేరూరు వద్ద గోదారి వేగంగా పెరుగుతుండటంతో భద్రాచలం అధికారుల్లో ఆందోళన అంతకంతకు పెరుగుతోంది. పెరుగుతూ.. తగ్గుతూ.. దోబూచులాడుతున్న గోదావరి ప్రభావంతో జాతీయ రహదారుల వద్ద రాకపోకలు కొనసాగటం, కొంత సమయానికే మళ్లీ నిలిచిపోవడంతో సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాలు భద్రాచలం పట్టణంలోనే ఉండిపోవాల్సి వస్తుంది. పట్టణంలోని ఏఎంసీ కాలనీ, కొత్త కాలనీ, పరిసర ప్రాంతాల్లో స్లూయిజ్‌ల నుంచి లీకైన వరద నీరు వెనక్కి పోకపోవడంతో ఆయా కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎటపాక వద్ద ఉన్న స్లూయిజ్ లాకులు ఎత్తితే తప్ప, వరద నీరు వెనక్కి పోని పరిస్థితి ఉంది. 46 అడుగులకు గోదావరి తగ్గితేనే లాకులు ఎత్తే అవకాశం ఉందని అధికారులు తేల్చి చెప్పారు. దాంతో ఎన్ని రోజులు వరద నీటిలో ఉండాల్సి వస్తుందో తెలియక లోతట్టు ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇటు పోలవరం ముంపు మండలాల్లో సైతం అదే పరిస్థితి నెలకొంది.



పోలవరం పాపమే ఈ ముంపు

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తే భద్రాచలం నియోజకవర్గంతో పాటు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు జల సమాధి కాక తప్పదని 2006లోనే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక రకాల ఉద్యమాలు చేశారు. అప్పటి పాలకులు గాని, ఇతర రాజకీయ పార్టీలకు గాని ఆ సమస్యను పెద్దగా పట్టించుకోలేదు. కానీ గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల గోదావరి పరివాహక ప్రాంతంలో భద్రాచలంతో పాటు విలీన మండలాలలోనే ఎక్కువ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంటే పోలవరం ప్రభావం ఈ ప్రాంతంపై ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పోలవరం ప్రాజెక్టు వద్ద కేవలం కాపర్ డ్యామ్ పూర్తయితేనే విలీనం మండలాలతో పాటు భద్రాచలం పట్టణానికి 45 నుంచి 50 అడుగులకు వరద వస్తుంది. అయితే ప్రాజెక్టు పూర్తయితే 50 నుంచి 60 అడుగుల వరకు గోదారి నీటిమట్టం వస్తే ఈ ప్రాంతాల పరిస్థితి ఏంటిని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంతో పాటు అన్ని రాజకీయ పక్షాలు మేల్కొని పోలవరం ముంపుపై నిర్దిష్టమైన కార్యచరణ చేపట్టకపోతే భవిష్యత్తులో భద్రాచలంతో పాటు విలీనం మండలాలు గోదారమ్మకు బలికాక తప్పదని స్పష్టమవుతుంది. కాగా, సరిహద్దులోని ముంపునకి గురైన ప్రజలను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరద బాధితులకు తక్షణ సహాయంగా రూ.3వేలు ప్రకటించారు. ప్రధానంగా కూనవరం, వీఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వరద బాధితులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులపై కోతుల దాడి

- తొమ్మిది మందికి గాయాలు




నవతెలంగాణ-చివ్వెంల

పాఠశాలలో విద్యార్థులపై కోతులు దాడి చేశాయి. తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో విద్యార్థులపై శుక్రవారం ఉదయం కోతులు దాడి చేశాయి. ఈ దాడిలో విద్యార్థులు దొడ్డిరామ్, కలకొండ రియ, గోగుల ప్రతీక్, రావిచెట్టి ఆజ్ఞసి, నవ్యశ్రీ, కలకొండ రక్షిత్, నవిలె ఈశ్వర్ ప్రసాద్, షేక్ బషీర్, జి.హాసినికి గాయాలయ్యాయి. వారికి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. వ్యాక్సినేషన్ వేయించారు. కోతుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొత్త జీవితమే పరిష్కారం

ప్రేమ... దీన్ని అందరూ కోరుకుంటారు. అలాగే ఆమె కూడా అతన్ని ప్రాణంగా ప్రేమించింది. అతనితోనే తన జీవితం అనుకుంది. కానీ పెద్దలు ఆ ప్రేమను తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా ఆమె మనసు అతన్నే కోరుకుంది. జీవితం అతనితోనే అని నిర్ణయించుకుంది. ఏండ్లు గడుస్తున్నా అతనికోసమే ఎదురు చూసింది. ఇంతకీ ఆమె ఎదురు చూపు ఫలించిందా? అతడు ఆమె జీవితంలోకి వచ్చాడా? అది తెలుసుకోవాలంటే ఈ వారం ఐద్వా అదాలత్ చదవాల్సిందే...



ఐద్వా అదాలత్
సెల్: 9490098024

ప్రియ, అశోక్ ఒకే స్కూల్లో చదువుకున్నారు. ఒకరంటే ఒకరికి చిన్నప్పటి నుండి ఎంతో ఇష్టం. పదో తరగతి తర్వాత ఇంటర్ కూడా ఇద్దరూ ఒకే కాలేజీలో చేరారు. ఒకరిని విడిచి ఒకరు ఉండేలి స్థితికి వచ్చారు. కొన్ని రోజుల్లోనే కాలేజీ మొత్తానికి వీరి ప్రేమ గురించి తెలిసిపోయింది. ఇద్దరూ కలిసి సరదాగా సినిమాలకు, పార్కులకు వెళ్లేవారు. ఇంత వరకు అంతా బాగానే ఉంది. వచ్చిన సమస్య ఏమిటంటే వీరిద్దరి కులాలు వేరు. పైగా ప్రియ వాళ్ళు కాస్త స్థితి మంతులు. అశోక్‌కు పెద్దగా ఆస్థిపాస్తులేమీ లేవు. ఇంటర్ సెకండియర్‌లో ఉన్నప్పుడు వీరి ప్రేమ గురించి ప్రియ వాళ్ళ ఇంట్లో తెలిసిపోయింది. ఆ సమయంలో ఆమెను ఏమీ అనకుండా పరీక్షలు పూర్తికాగానే డిగ్రీ కోసం హాస్టల్లో చేర్పించారు. ఆమె దగ్గర ఫోన్ లేదు. బయట ఎవరితో మాట్లాడే అవకాశం కూడా లేదు. ఎవరితో ఎలాంటి కమ్యూనికేషన్ లేకుండా పోయింది. అలా ఐదేండ్లు గడిచిపోయాయి.

కానీ ప్రియ ఎప్పుడూ అశోక్ గురించే ఆలోచిస్తూ ఉండేది. ఎలాగైనా అతన్ని కలవాలని, మాట్లాడాలని అనుకునేది. అలా ఆలోచిస్తూ ఆకలి, నిద్ర మర్చిపోయింది. దేనిపైనా ధ్యాస ఉండేది కాదు. దాంతో కొంత కాలానికి ఆమె ఆరోగ్యం పాడైపోయింది. అయినా తల్లి దండ్రులు ఆమెను ఇంటికి తీసుకురాలేదు. అక్కడే ఉంచి చికిత్స చేయించారు. చదువు పూర్తయిన తర్వాత ఇంటికి తీసుకొచ్చి పెండ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. ప్రియకు మాత్రం అశోక్ గురించే ఆలోచన. మరో ఆలోచనే లేకుండా పోయింది.

ప్రియ ఎప్పుడూ అశోక్ గురించే ఆలోచిస్తూ ఉండేది. ఎలాగైనా అతన్ని కలవాలని, మాట్లాడాలని అనుకునేది. అలా ఆలోచిస్తూ ఆకలి, నిద్ర మర్చిపోయింది. దేనిపైనా ధ్యాస ఉండేది కాదు. దాంతో కొంత కాలానికి ఆమె ఆరోగ్యం పాడైపోయింది. అయినా తల్లి దండ్రులు ఆమెను ఇంటికి తీసుకురాలేదు. అక్కడే ఉంచి చికిత్స చేయించారు.

'అశోక్‌ను ప్రేమిస్తున్నాను, అతన్నే పెండ్లి చేసుకుంటాను' అని తల్లిదండ్రులకు చెప్పాలనుకుంది. మనసులో ఒకరిని పెట్టుకొని మరొకరిని పెండ్లి చేసుకోవడం ఆమెకు అస్సలు ఇష్టం లేదు. అలా చెప్పాలంటే ముందు తను అశోక్‌ను కలవాలి.

కానీ అశోక్‌ని కలవడం ఎలా? ఫోన్ చేయడానికి కూడా అతని నెంబర్ మారిపోయింది. తాను ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఇద్దరికీ మ్యూచవల్‌గా ఉండే స్నేహితుల సహాయంతో ఎలాగో అశోక్ ఫోన్ నెంబర్ తెలుసుకుంది. ఎలాగైనా అతన్ని కలిసి తన ప్రేమను అశోక్‌కు చెప్పాలనుకుంది. కానీ ఇక్కడ పరిస్థితి దానికి పూర్తి విరుద్ధంగా ఉంది. ఆమె అతని దగ్గరకు వెళ్ళే సరికి అశోక్ వేరే అమ్మాయితో, చిన్న పాపతో కనిపించాడు. అది చూసి ప్రియ తట్టుకోలేకపోయింది. తాను ఏండ్ల నుండి అశోక్ కోసం ఎదురు చూస్తుంది. కానీ అతను మాత్రం ఆమెను మర్చిపోయి ఇంకో అమ్మాయితో ఆనందంగా కనబడటంతో ఏం చేయాలో అర్థం కాలేదు. దాంతో ఐద్వా అదాలత్ దగ్గరకు వచ్చింది.

తన ప్రేమను అశోక్‌కు చెప్పాలి అనుకుంది. కానీ ఇక్కడ పరిస్థితి దానికి పూర్తి విరుద్ధంగా ఉంది. అశో వేరే అమ్మాయితో, చిన్న పాపతో కనిపించాడు. అది చూసి ప్రియ తట్టుకోలేకపోయింది. తాను కొన్నేండ్ల నుండి అశోక్ కోసం ఎదురు చూస్తుంది. కానీ అతను మాత్రం ఆమెను మర్చిపోయి ఇంకో అమ్మాయితో ఆనందంగా కనబడటంతో ఏం చేయాలో అర్థం కాలేదు.

'అశోక్ నన్ను ఎప్పటికీ మర్చిపోలేడు. నన్ను కాదని ఇంకొకరిని అతని జీవితంలోకి ఆహ్వానించలేడు. అసలు ఆ అమ్మాయికీ అశోక్‌కి సంబంధం ఏమిటో అర్థం కావడం లేదు? మా అమ్మానాన్న మా పెండ్లికి ఒప్పుకోక పోతే ఇద్దరం కలిసి వేరే చోటికి వెళ్ళి ఉంటాం. మాకు ఎవరితో సంబంధాలు అవసరం లేదు. ఎలగైనా అశోక్‌తో మాట్లాడి మా పెండ్లి జరిపించండి' అంటూ ఏడ్చింది. సరే అని మేము అశోక్‌కు ఫోన్ చేసి పిలిపించాము.

అశోక్ వచ్చి ప్రియను చూసి ఆశ్చర్యపోయి 'ప్రియా ఎలా ఉన్నావు, ఇన్ని రోజులు ఎక్కడికి వెళ్లావు. అసలు నాకు ఒక్క మాట కూడా చెప్పకుండా వెళ్ళిపోయావు. నీ కోసం ఎంత వెతికానో, కనీసం ఫోన్ అయినా చేసి మాట్లాడొచ్చు కదా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు. ఇలా ఇద్దరూ కొద్ది సేపు మాట్లాడు కున్న తర్వాత 'మేము ఇరు కుటుంబాల పెద్దలతో మాట్లాడి మీ పెండ్లికి ఒప్పిస్తాం, ఇద్దరూ పెండ్లి చేసుకొని సంతోషంగా ఉండండి' అని చెప్పాము.

దానికి అశోక్ 'లేదు మేడమ్, నేను ఈ పెండ్లి చేసుకోలేను. నాకు ఇంతకు ముందే నా మరదలితో పెండ్లి జరిగిపోయింది. ఒక పాప కూడా ఉంది' అన్నాడు. 'మరి ప్రియను ప్రేమిస్తున్నానని చెప్పావు' అంటే 'అవును మేడం నేను ఇప్పటికీ ప్రియనే ప్రేమిస్తున్నాను. కానీ ఆమె నన్ను వదిలి పెట్టి వెళ్లిపోయింది. నిజానికి ఆమె తల్లిదండ్రులే నన్ను ప్రియకు దూరం చేశారు. నేను ఎంత ప్రయత్నించినా ప్రియ ఆచూకి తెలియలేదు. ఆమె కోసం వెతికే ప్రయత్నం చేస్తుంటే 'ఇప్పుడు ఆమెను కేవలం దూరంగా మాత్రమే పంపించాము. ఇలాగే నువ్వు ప్రియ కోసం వెదికితే తనని చంపేస్తాం' అని బెదిరించారు. ఈ విషయంలో మా అమ్మానాన్నలతో పంచాయితీ కూడా పెట్టించారు. తర్వాత మేము అక్కడి నుండి వేరే చోటకు మారిపోయాము. కొద్ది రోజులకే మా నాన్న చనిపోయారు. అప్పటి నుండి కుటుంబ ఆర్థిక పరిస్థితి అస్సలేం బాగోలేదు. దాంతో నేను చదువు మధ్యలో మానేసి ఉద్యోగంలో చేరాను' అన్నాడు.

'అంతా బాగానే ఉంది ప్రియంటే ఇష్టమున్న వాడికి వేరే పెండ్లి ఎందుకు చేసుకున్నావు' అని అడిగితే, 'అనుకోని పరిస్థితుల్లో నా మరదలితో పెండ్లి జరిగింది. తను ప్రేమించిన అబ్బాయి ఆమెను మోసం చేసి వదిలిపెట్టి పోయాడు. అప్పటికే ఆమెకు మూడో నెల. దాంతో ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించింది. తనను కాపాడుకోవడం కోసం నా మరదలిని పెండ్లి చేసుకున్నాను. ఇప్పుడు ప్రియ కోసం తనని వదిలేస్తే అన్యాయం చేసినవాడినవుతాను. అందుకే ఇప్పుడు ప్రియను నేను పెండ్లి చేసుకోలేను' అన్నాడు.

కానీ అతని మాటలను ప్రియ ఒప్పుకోడానికి సిద్ధంగా లేదు. 'నాకు అశోక్ అంటే చాలా ఇష్టం. నేను అతనితోనే ఉంటాను' అంటుంది. దానికి మేము 'ఎలా జరిగినా అతనికి పెండ్లి అయ్యింది. భార్యా పాప ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నువ్వు అతనితో ఉండాలనుకోవడం సరైనది కాదు. ప్రేమించుకున్న వారందరూ పెండ్లి చేసుకోవాలని లేదు. కానీ పెండ్లి చేసుకున్న వ్యక్తిని ప్రేమిస్తేనే వారి జీవితం సంతోషంగా ఉంటుంది. భార్యాభర్తల మధ్య ప్రేమ ఉంటేనే ఆ బంధం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుంది. కాబట్టి అశోక్‌ను మర్చిపోయి నువ్వు కూడా కొత్త జీవితం ప్రారంభించి. అనవసరంగా వారిద్దరి మధ్యకు వెళ్ళి నీ జీవితాన్ని, వారి జీవితాన్ని పాడుచేసుకోవద్దు. నీ తల్లిదండ్రులు చూపించిన అబ్బాయిని పెండ్లి చేసుకొని సంతోషంగా ఉండు. పాత విషయాలు గుర్తు చేసుకుంటే నీ భవిష్యత్ ప్రశ్నగానే మిగిలిపోతుంది' అని నచ్చజెప్పాము. ఇలా సుమారు నాలుగు వారాలపాటు కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత ప్రియ మళ్ళీ పెండ్లి చేసుకోవడానికి అంగీకరించింది.

- వై వరలక్ష్మి,
9948794051

మెడ మెరిసిపోవాలంటే...

ఎక్కువగా బయట తిరుగుతుండటంతో ఎండకు మెడ చుట్టూ నల్లగా మారుతుంది. ఈ డార్క్ స్పాట్‌లను హైపర్‌పిగ్మెంటేషన్ అంటారు. అకాంథోసిస్ నైగ్రికన్స్ అనే హార్మోన్ల సమస్య కూడా తరచుగా మెడపై నల్లటి పాచెస్‌కు కారణమవుతుంది. ఈ సమస్యను ఎదుర్కోవడానికి చాలా మంది మార్కెట్‌లో దొరికే సౌందర్య సాధనాలను ఉపయోగిస్తుంటారు. కానీ, కొన్ని హోం రెమిడీస్‌తో నల్లమచ్చలను పోగొట్టుకోవచ్చు.



అలోవెరా - దీనిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని తేమగా ఉంచుతాయి. తాజా కలబంద ఆకుల నుండి తీసిన గుజ్జును మెడ చుట్టూ అప్లై చేసి 20 నిమిషాలు అలాగే ఉంచి చల్లటి నీటితో కడగాలి.



బేకింగ్ సోడా - రెండు చెంచాల బేకింగ్ సోడాను నీటిలో కలపండి. నల్ల మచ్చలపై రాయండి. అది ఆరిన తర్వాత... తడి వేళ్లతో స్క్రబ్ చేయండి. ఆ తర్వాత తప్పకుండా మాయిశ్చరైజర్ అప్లై చేయండి.



బంగాళాదుంప రసం - బంగాళాదుంపలో బ్లీచింగ్ లక్షణాలు ఉన్నాయి, ఇవి చర్మపు రంగును కాంతివంతం చేస్తాయి. ఒక బంగాళాదుంపను చిన్న ముక్కలుగా కోసుకోవాలి. ఆ తర్వాత దాన్ని మిక్సీలో పేస్టు చేసుకోవాలి. దాన్ని వడకట్టి వచ్చిన రసాన్ని నల్ల మచ్చపై అప్లై చేయండి. పూర్తిగా ఆరిపోయాక నప్పుడు, నీటితో కడగాలి.



యాపిల్ సైడర్ వెనిగర్ - యాపిల్ సైడర్ వెనిగర్ చర్మం యొక్క pHని బ్యాలెన్స్ చేస్తుంది. ఇందులో ఉండే మాలిక్ యాసిడ్ మృత చర్మ కణాలను తొలగించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌ను కొద్దిగా నీళ్లలో కలిపి మెడ చుట్టూ పట్టించాలి. 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. ■

ఆగస్టు 2 డెడ్‌లైన్

అంతలోపు కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయాలి
లేదంటే 50 వేల మంది రైతులతో కలిసి మేమే పంప్‌లు ఆన్ చేస్తాం : ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
నీళ్లు వృథాగా పోతుంటే ఎత్తిపోయరా..
రైతుల నోట్లో మట్టి కొడతారా?
కేసీఆర్ మీద కక్షతో ప్రజావ్యతిరేక రాజకీయాలు మానుకోవాలి
ఎల్ఎండీ, కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డను సందర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/ భూపాలపల్లి

'ఆగస్టు 2 లోపు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని నీటిని ఎత్తిపోయాలి. లేదంటే 50 వేల మంది రైతులతో కలిసి మేమే మోటార్లను ఆన్ చేస్తాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేసీఆర్ మీద కక్షతో రైతుల నోట్లో మట్టికొట్టే దుర్మార్గపు ఆలోచన చేయొద్దని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు కేటీఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకుల బృందం రెండ్రోజుల పాటు కాళేశ్వరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించింది. గురువారం సాయంత్రం కరీంనగర్‌లోని ఎల్ఎండీ ప్రాజెక్టును పరిశీలించి.. శుక్రవారం ఉదయం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్ హౌస్ సహా మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించింది. మార్గ మధ్యలో కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామిని దర్శించుకుంది. అక్కడే గోదావరి నదికి ప్రత్యేక పూజలు చేసింది. కన్నెపల్లి పంప్‌హౌస్ పరిశీలన తర్వాత అక్కడే మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. రాజకీయాల కోసం రైతులను బలి పెట్టొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరి స్తోందన్నారు. శ్రీరాం సాగర్, ఎల్ఎండీ, మిడ్ మానేరు, ఎల్లంపల్లిలో నీరు లేని కారణంగా రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు గోదావరి ఎగువన నీటి కరువు ఉంటే.. మేడిగడ్డ వద్ద మాత్రం పది లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని వివరించారు. ఈ నీటిని సకాలంలో ఎత్తిపోసుకుంటే శ్రీరాంసాగర్, ఎల్ఎండీ, మిడ్ మానేర్, రంగనాయకమ్మ సాగర్, కొండ పోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ జలాశయాలను నింపుకొని నీటి కొరత లేకుండా చేసుకోవచ్చన్నారు.

బాల్కీ ప్రాజెక్ట్ నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీటిని ఒడిసి పట్టుకోవాల్సిన సమయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కాళేశ్వరం బహుళ ప్రయోజనాలు ఇచ్చే ప్రాజెక్టు అని అన్నారు. రాజకీయ కక్షతో కేసీఆర్‌ను బదనాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాల తో నీటిని ఎత్తిపోయకుండా రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. గతేడాది తమ ప్రభుత్వం సకాలంలో నీటిని ఎత్తిపోసి అన్ని రిజర్వాయర్లను నింపిందన్నారు. ఈ ప్రభుత్వం రైతుల పంటలు ఎండిపోయినా సరే కేసీఆర్‌కు పేరు రావద్దన్న దురుద్దేశంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. గత డిసెంబర్-జనవరిలో కూడా రైతులకు నీళ్ల ఇవ్వాలని కోరితే రాజకీయ ప్రయోజనం కోసం యాసంగి పంటలను ఎండబెట్టారని అన్నారు. వర్షాకాలంలో కూడా నీరిచ్చే పరిస్థితులు లేకపోవడంతో పరిస్థితిని పరిశీలించేందుకు ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు.

ఈ నాలుగున్నరేండ్లు జనం కోసం పనిచేద్దాం..

ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకే రాజకీయాలు చేద్దామని.. ఆ తర్వాత నాలుగున్నరేండ్లు ప్రజల కోసం పనిచేద్దామని కేటీఆర్ హితవు పలికారు. ఈ అంశాన్ని తాము రాజకీయం చేయాలనుకోవటం లేదని.. రైతులకు మేలు చేయాలని మాత్రమే ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. బేషజాలకు పోయి, రైతులకు అన్యాయం చేయొద్దని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి కేసీఆర్‌ను గద్దె దింపేందుకు అన్ని కుట్రలూ చేశాయని ఆరోపించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) పేరుతో ఒక్క రోజులోనే నివేదిక ఇచ్చి మేడిగడ్డకు ఏదో జరిగిపోయినట్టు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కూడా కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు గంగపాలు అంటూ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. మొత్తానికి మీరు చేసిన కుట్రలతో కేసీఆర్‌ను గద్దె దించారని ఇంకా రాజకీయాలెందుకని ప్రశ్నించారు. ఇప్పుడు కూడా సుందిళ్ల, అన్నారంలో ఏదో ప్రమాదం అంటూ ఎన్డీఎస్ఏ పేరుతో సాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుందిళ్ల, అన్నారంలో గ్రౌటింగ్ పనులు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో భాగమేనని అధికారులు చెప్పారన్నారు. బ్రహ్మాండంగా నీటిని ఎత్తిపోసుకునేందుకు అవకాశం ఉందని, ప్రభుత్వం నిర్ణయం కోసమే ఎదురుచూస్తున్నామని అధికారులు చెబుతున్నారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చ పెట్టాలని ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్‌లో మోటర్లన్నీ ఆన్ చేసి రిజర్వాయర్లన్నీ నీటితో నింపి సాగు, తాగునీరు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 2 తర్వాత కూడా పంప్‌లు ఆన్ చేయకపోతే.. కాళేశ్వరం ద్వారా ప్రయోజనం పొందుతున్న రైతులందరితో కలిసి వచ్చి తామే మోటార్లను ఆన్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కోవా లక్ష్మి సునీత లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు వాణిదేవి, ఎల్.రమణ, గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్, బీఆర్ఎస్ భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పేరు మార్చుకుంటే బెటర్

● బాధ్యులపై తప్పనిసరి చర్యలంటూ వ్యాఖ్య ● మీడియాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మాజీ మంత్రి కేటీఆర్ తన పేరును జెసెఫ్ గోబెల్స్‌గా మార్చుకుంటే బెటరనీ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అబద్ధాలను ప్రచారం చేయడాన్ని ఖండించారు. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ఆపేశారని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో కాళేశ్వరం ప్రాజెక్టుపై మీడియాకు 'పవర్ పాయింట్ ప్రజెంటేషన్' ఇచ్చారు. ఇందులో ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులతో పాటు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు రూ. 38,500 కోట్ల నుంచి రూ.80 వేల కోట్లకు పెంచారని విమర్శించారు. ఇప్పటివరకు రూ.94 వేల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. కాగ్ లెక్కల ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఇంకా రూ. 47 వేల కోట్లు కావాలని చెప్పారు. దీని రన్నింగ్ కాస్ట్ కూడా చాలా ఎక్కువని చెప్పారు. ప్రాజెక్టులోని అన్ని పంపులను పూర్తిస్థాయిలో రన్ చేస్తే కరెంటు బిల్లు రూ. 10 వేల కోట్ల వరకు వస్తుందన్నారు. ప్రాజెక్టు మొత్తం పూర్తై అన్ని మోటార్లు రన్‌చేస్తే ఈ ఖర్చు రూ. 25 వేల కోట్లకు పెరిగే అవకాశముందని అన్నారు. ఈ ప్రాజెక్టు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు ఆర్థికేతర సంస్థల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చారని చెప్పారు. ఏడాదికి అసలు, వడ్డీ, నిర్వహణ కింద సుమారు రూ. 15 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. కాగా 18.25 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యానికిగాను కేవలం 93 వేల ఎకరాలు మాత్రమే సాగులోకి వచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ సర్కారు పదేండ్ల కాలంలో సాగునీటి రంగానికి రూ.1.81 లక్షల కోట్లు వ్యయం చేసినా ఫలితాలు నామమాత్రంగా వచ్చాయని స్పష్టమైందన్నారు. మేడిగడ్డపై కాంగ్రెస్ కుట్ర చేసిందని బీఆర్ఎస్ ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. మేడిగడ్డ కట్టినప్పుడు, కూలినప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందనే సంగతి మరిచిపోవద్దని చెప్పారు. మేడిగడ్డలో ఐదు అడుగుల లోతుకు ఆరు పిల్లర్లు కుంగాయనీ, నాసిరకపు పనుల వల్లే బ్యారేజీ కుంగిందని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసిందన్నారు. ఆ నివేదికను బీఆర్ఎస్ తప్పుబట్టడం సరికాదని చెప్పారు. ప్రత్యేక చట్టం ద్వారా ఎన్‌డిఎస్ఏ, ఏఏఐ, తెలికాం సంస్థలు ఏర్పాటయ్యాయని అన్నారు. అక్టోబరు 21, 2023 బ్యారేజీ కుంగిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని డిసెంబరులోనని గుర్తు చేశారు. మేడిగడ్డ వద్ద ఎవరో బాంబులు పెట్టినట్టు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారని తెలిపారు. బ్యారేజీ కుంగిన తర్వాత 45 రోజుల వరకు కేసీఆర్ నోరు మెదపలేదన్నారు. ఎన్డీఎస్ఏ సలహా, సూచనల మేరకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ గేట్లు తెరిచామన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రెండు రోజుల్లో పంపింగ్ ప్రారంభించి మిడ్‌మానేరుకు నీటిని తరలిస్తామని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీలో పూర్తి సామర్థ్యంతో పంపింగ్ చేయాలని బీఆర్ఎస్ చెబుతున్నదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే మేడిగడ్డ సమీపంలోని 44 గ్రామాలు, ఏటూరునాగారం, భద్రాచం పట్టణం ముంపునకు గురవుతాయని అన్నారు. సమ్మక్కసాగర్ కొట్టుకుపోతుందనీ, సీతారామా సాగర్ ప్రాజెక్టుకు ప్రమాదమన్నారు. మేడిగడ్డ కుంగినప్పుడు బీఆర్ఎస్ సర్కారే నీళ్లను కిందకు వదిలిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడేమో మేడిగడ్డ నుంచి నీళ్ల పంపింగ్ చేయాలనడం సిగ్గుచేటన్నారు. సెంట్రల్ డిజైన్ సంస్థ ప్రకారం నిర్మాణం జరగలేదనీ, ఒక వ్యక్తి ఆలోచనల ప్రకారం ప్లానింగ్, డిజైన్, నిర్వహణ, నిర్మాణంలో లోపాలు జరిగాయన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇంత ఘోరమైన తప్పిదం ఎవరూ చేసి ఉండరని అభిప్రాయపడ్డారు. తుమ్మిడిహెట్టి దగ్గర నీళ్ల అందుబాటులో ఉన్నాయని సీడబ్ల్యూసీ చెప్పినా, బ్యారేజీని మేడిగడ్డ దగ్గర నిర్మించారంటూ తప్పుబట్టారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్మించిన విషయాన్ని తెలియజేశారు. కేటీఆర్ కంటే ఎన్‌డిఎస్ఏకే సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా ఉందనీ, ఆమేరకే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు, కేసీఆర్, కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ నేతలు విహార యాత్రలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఎస్ఏ చేసిన సిఫారసులను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కేటీఆర్ విమర్శలు సరికావన్నారు.

క్యూబాపై అమెరికా ఆగడాలు ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉందని ఆరోపిస్తూ క్యూబాను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చిన అమెరికా దుర్మార్గాన్ని అంతం చేయడానికి అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచాలని సదస్సు పిలుపునిచ్చింది. కుట్రలో భాగంగానే ట్రంప్ హయాంలో క్యూబాను ఈ జాబితాలో చేర్చారని గులామి లాంగ్ విమర్శించారు. క్యూబాపై దీర్ఘకాలంగా ఉన్న ఆంక్షలను ఉపసంహరించుకోవాలని, దానికి అంతర్జాతీయంగా గళం వినిపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ స్వాతంత్ర్యం, గౌరవం కోసం పాటుపడే వారందరూ క్యూబాకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. క్యూబా రాయబార కార్యాలయానికి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న రాయబారి అబెల్ అబల్లె మాట్లాడుతూ ఎన్ని దాడులు ఎదురైనా క్యూబా సోషలిస్టు బాట నుంచి వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లబ్‌సేన్ గుప్తా, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి దేవరాజన్, సీపీఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యుడు రాజీవ్ దిమారి, దేవ్ రాయ్, ప్రొఫెసర్ సోనియా గుప్తా తదితరులు మాట్లాడారు.

అన్నదాతకు లభించని ఆసరా

(మొదటిపేజీ తరువాయి)

నిలుస్తున్న పంటల బీమా పథకానికి కేటాయింపులను మాత్రం స్వల్పంగా 0.17 శాతం నుంచి 0.30 శాతానికి పెంచారు. రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు 2019లో ప్రారంభించిన పీఎం కిసాన్ కార్యక్రమానికి 2019-20లో 1.8 శాతం బడ్జెట్ కేటాయింపులు జరపగా 2024-25లో 1.2 శాతం మాత్రమే కేటాయించారు.

పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

సభలు కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులర్పించాయి. కార్గిల్ యుద్ధ విజయోత్సవ 25వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభలో కార్గిల్ యుద్ధ వీరులకు నివాళిగా పార్లమెంట్ సభ్యులంతా ఒక నిమిషం మౌనం పాటించారు.లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. వెంటనే ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లో లేచి, నినాదాలతో హోరెత్తించారు. ప్రజా సమస్యలపై చర్చించాలని పట్టుబట్టారు. ప్రతిపక్షం దేశాన్ని అవమానించిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అనడంతో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. కేంద్ర మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్షాన్ని, అధికార పార్టీ ఎంపీలతో సమన్వయం చేయడం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కర్తవ్యమని, అంతే తప్ప ప్రతిపక్ష ఎంపీలపై విమర్శలు చేయడం కాదని కాంగ్రెస్ ఎంపీ కెసి వేణుగోపాల్ హితవు పలికారు. ప్రతిపక్షాల సభ్యుల ఆందోళనతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో వెంటనే సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో జీరో అవర్ జరిగింది. మధ్యాహ్నం సభలో ప్రయివేట్ మెంబర్ బిల్లు బిజినెస్ జరిగింది. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు.మరోవైపు రాజ్యసభలో కూడా ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. దీంతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ సభ్యులు వారించారు. తమ స్థానాల్లో కూర్చోవాలని కోరారు. రాజ్యసభలో కర్నాటకు చెందిన బీజేపీ ఎంపీ ఇరన్న కడడికి జాబితాలో పేరు లేకపోయిన మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడాన్ని ప్రతిపక్ష ఎంపీలు చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్‌ను ప్రశ్నించా రు. దీనికి వ్యతిరేకంగా వారు ఆందోళన చేపట్టారు. రాజ్యసభలో జీరో అవర్ అయిన తరువాత, ప్రశ్నోత్తరాలు జరిగాయి. మధ్యాహ్నం ప్రయివేట్ మెంబర్ బిల్లు బిజినెస్ జరిగిన తరువాత సభను సోమవారానికి వాయిదా వేశారు.


పేర్లు ప్రదర్శించాలని బలవంతం చేయలేం : సుప్రీం

(మొదటిపేజీ తరువాయి)

కావడియాత్ర మార్గంలో తినుబండారాలు విక్రయించేవారు దుకాణాలపై యజమానులు, సిబ్బంది పేర్లు ప్రదర్శించాలని బలవంతం చేయలేమని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఎవరైనా యజమానులు స్వచ్ఛందంగా పేర్లను ప్రదర్శించాల నుకుంటే వారిని ఆపేందుకు కూడా ఎవరూ బలవంతం చేయకూడదనే ఉద్దేశంతోనే మధ్యంతర స్టేను విధించామని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తమ స్పందనలు దాఖలు చేయాలని ప్రభుత్వాలను కోరింది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసే ప్రత్యుత్తరాలపై కూడా తమ స్పందనలు నివేదించేందుకు పిటిషనర్లకు అనుమతిస్తూ తదుపరి విచారణ ఆగస్టు 5కి వాయిదా వేసింది.దుకాణాలపై యజమానులు, సిబ్బంది పేర్లు ప్రదర్శించాలని ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలవగా జులై 22న సుప్రీం విచారించి మధ్యంతర స్టే విధించింది. తాజాగా జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్‌ల ధర్మాసనం ఈ స్టేను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోపక్క దుకాణాలపై పేర్లు ప్రదర్శించాలనే ఆదేశాలను వ్యతిరేకిస్తూ తణమూల్ ఎంపీ మహువా మొయిత్రా, ప్రొఫెసర్ అపూర్వానంద్, కాలమిస్ట్ ఆకర్ పటేల్ తదితరులు సుప్రీంలో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ యాత్ర శాంతియుతంగా సాగేందుకే ఈ నిర్ణయమంటూ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో తెలిపింది.

బిల్లులపై ఎందుకీ జాప్యం..!

(మొదటిపేజీ తరువాయి)



చేస్తూ కేరళ, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఏడాదికిపైగా ఎనిమిది బిల్లులపై గవర్నర్లు ఆమోదం తెలపకుండా ఆపుతున్నారని, ఆలస్యానికి గల కారణం తెలిపడం లేదని రెండు రాష్ట్రాలూ పిటిషన్‌లో పేర్కొన్నాయి. దీంతో సుప్రీంకోర్టు గవర్నర్లకు నోటీసులు జారీ చేసింది.

అండగా ఉంటాం

పావలా శ్యామలకు హీరో సాయి దుర్గ తేజ్ ఆర్థిక సాయం



హీరో సాయి దుర్గ తేజ్ తన గొప్ప మనసుని మరోసారి చాటుకున్నారు. తాజాగా ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్‌కు విరాళం అందించడమే కాకుండా.. ఆ సంస్థ ద్వారా దీనస్థితిలో ఉన్న నటి పావలా శ్యామలకు ఆర్థిక సాయాన్ని అందించారు. గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పావలా శ్యామలకు ఆ ఆర్థిక సాయం అందేలా చేశారు. ఈ క్రమంలో ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ మెంబర్స్ కలిసి ఆమెకు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు.

ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న పావలా శ్యామలకు హీరో సాయి దుర్గ తేజ్ సాయం చేస్తానని గతంలో మాట ఇచ్చారు. ఆ ఇచ్చిన మాటను గుర్తు పెట్టుకుని ఆర్థిక సాయాన్ని అందించడంతో నటి పావలా శ్యామల ఎమోషనల్ అయ్యారు. తన దీనస్థితి గురించి చెబుతూ కన్నీరు మున్నీరు అయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో సాయి దుర్గ తేజ్ తనను గుర్తు పెట్టుకుని మరీ సాయం చేయడం గొప్ప విషయమని ఆమె అన్నారు. ఇక సాయి దుర్గ తేజ్‌తో వీడియో కాల్‌లో నటి పావలా శ్యామల మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలో తాను అన్ని విధాల అండగా ఉంటానని సాయి దుర్గ తేజ్ భరోసానిచ్చారు. అందరూ సాయం చేస్తారని, తోడుగా ఉంటారని హామీ ఇచ్చారు. 'యాక్సిడెంట్ జరిగినప్పుడు.. మీరు బాగుండాలని, ఏమీ కాకూడదని ఆ దేవుడ్ని ప్రార్థించానంటూ నటి పావల శ్యామల చెబుతూ కన్నీరు పెట్టుకున్నారు. ఆమె ప్రేమకు, మాటలకు సాయి దుర్గ తేజ్ కూడా ఎమోషనల్ అయ్యారు. ఈ క్రమంలోనే చిరంజీవి చేసిన ఆర్థిక సాయాన్ని కూడా నటి పావల శ్యామల గుర్తు చేసుకున్నారు.

హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



నరేశ్ వికె, రాగ్ మయూర్, ప్రియా వడ్లమాని లీడ్ రోల్స్‌లో నటిస్తున్న హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'వీరాంజనేయులు విహారయాత్ర'. అనురాగ్ పలుట్ల దర్శకత్వం వహించారు. బాపినీడు.బి, సుధీర్ ఈదర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 14న ఈ సినిమా ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ టీజర్ రిలీజ్ చేశారు. పవిత్ర లోకేష్ ఈ టీజర్‌ని లాంచ్ చేశారు. డైరెక్టర్ సందీప్ రాజ్, వినోద్, ప్రవీణ్ కండ్రేగుల, హీరో తిరువీర్ పాల్గొన్న టీజర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది

నరేష్ వికె మాట్లాడుతూ, 'కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు అనే మాటకు నిదర్శనం రామోజీరావు. ఆయన కృషితో ఒక లెజెండ్‌గా ఎదిగి, తెలుగు సినిమాని ప్రపంచ సినిమా చరిత్రపుటలో పెట్టి నవ్వుతూ వెళ్ళిపోయారు. నా బండికి నాలుగు చక్రాలు. విజయ నిర్మల, కృష్ణ, జంధ్యాల, రామోజీరావు. ఉషాకిరణ్ మూవీస్ 'శ్రీవారికి ప్రేమలేఖ'తో హీరోగా స్టార్ట్ అవ్వడం నా అదృష్టం. ఆ సినిమాతోనే బాపినీడుతో పరిచయం. ఈ సినిమాకి ఆయన బ్యాక్‌బోన్. ఎక్కడా లోటు లేకుండా అద్భుతంగా సినిమాని నిర్మించారు. అనురాగ్ చాలా ప్రతిభ ఉన్న దర్శకుడు. స్క్రిప్ట్ విన్నాక.. జంధ్యాల, త్రివిక్రమ్, వివేక్ ఆత్రేయ అలాంటి వినూత్నమైన ఒరవడి తనలో కనిపించింది. ఇది విజువల్ ట్రీట్. శతమానం భవతి సినిమా ఎన్ఆర్ఐ ఆడియన్స్‌ని విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రం కూడా అలానే అలరిస్తుంది. చాలా అద్భుతమైన ఎమోషన్ ఉన్న కథ ఇది. ఇది నాకు గోల్డెన్ జూబ్లీ ఫిల్మ్. గోల్డెన్ ఫిల్మ్' అని తెలిపారు.

'ఈ సినిమా కోసం చాలా ఎగ్జైటెడ్‌గా ఎదురుచూస్తున్నాను. ఈ సినిమాతో ఈటీవీ విన్ ఇంకా గట్టిగా ఫ్యామిలీస్‌లోకి వెళుతుందని కోరుకుంటున్నాను' అని డైరెక్టర్ సందీప్ రాజ్ చెప్పారు.

ఈటీవీ విన్ - కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి మాట్లాడుతూ,'ఈ సినిమా ఫాదర్స్ అందరికీ అంకితం చేస్తున్నాం,. అనురాగ్ పెద్ద డైరెక్టర్ అవుతాడు. చాలా అద్భుతంగా తీశాడు. నరేష్ ఈ ప్రాజెక్ట్ డైమెన్షన్స్‌ని మార్చారు. అందరూ ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు.

దర్శకుడు అనురాగ్ పలుట్ల మాట్లాడుతూ,'ఓ మంచి సినిమాని ప్రేక్షకులకు అందించబోతున్నాం. ఈటీవీ విన్‌లో మా చిత్రాన్ని అందరూ తప్పకుండా చూడండి' అని అన్నారు.

నవచిత్రం

5 భాషల్లో డబుల్ ఇస్మార్ట్



రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబోలో రాబోతున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'స్టెప్పా మార్..'కి మంచి రెస్పాన్స్ వచ్చింది. సెకెండ్ సింగిల్ 'మార్ ముంత చోడ్ చింత..' బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. లేటెస్ట్‌గా మేకర్స్ థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. 'క్యా లఫ్డా..' సాంగ్‌ను ఈనెల 29న రిలీజ్ చేయబోతున్నారు. రామ్, కావ్యా థాపర్ రొమాంటిక్ కెమిస్ట్రీని వండర్‌ఫుల్‌గా ప్రజెంట్ చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ చాలా ఎట్రాక్టీవ్‌గా ఉంది.

పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ సినిమాలో సంజయ్ దత్ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు.

ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఐదు భాషల్లో విడుదల చేయనున్నారు. 'రామ్, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' విశేష ప్రేక్షకాదరణతో సంచలన విజయం సాధించింది. దీనికి సీక్వెల్‌గా ఇదే కాంబినేషన్‌లో ఇప్పుడు 'డబుల్ ఇస్మార్ట్' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్ అందరిలోనూ మరింత క్యూరియాసిటీని పెంచింది. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తన హీరోలను దర్శకుడు పూరీ జగన్నాథ్ స్క్రీన్‌పై చూపించే తీరు చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ చిత్రంలోనూ ఆయన హీరో రామ్‌ని వినూత్నంగా ప్రజెంట్ చేయబోతున్నారు. అలాగే ఇందులో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ప్రతినాయకుడిగా పవర్‌ఫుల్‌రోల్ చేస్తున్నారు. రామ్, సంజయ్‌దత్ కాంబోలో వచ్చే సీన్స్ ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తాయనటంలో సందేహం లేదు' అని చిత్ర యూనిట్ తెలిపింది.

అలీ, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, సీఈఓ: విషు రెడ్డి, సంగీతం: మణి శర్మ సినిమాటోగ్రఫీ: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, స్టంట్ డైరెక్టర్: కేచ, రియల్ సతీష్.




ప్రేక్షకుల్ని మెప్పించే కమిటీ కుర్రోళ్ళు

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాకు యదు వంశీ దర్శకుడు. శుక్రవారం ఈ చిత్ర ట్రైలర్‌ను యువ హీరో సిద్దు జొన్నలగడ్డ రిలీజ్ చేశారు. 'మా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేష్ లేకపోతే సినిమా ఇక్కడి వరకు వచ్చేది కాదు. మూవీకి పని చేసిన ప్రతీ ఒక్కరూ బెస్ట్ ఇచ్చారు. ఆగస్ట్ 9న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయండి' అని నిహారిక కొణిదెల చెప్పారు. దర్శకుడు యదు వంశీ మాట్లాడుతూ,సినిమా చూస్తే చాలా రీఫ్రెష్‌గా, నోస్టాల్జిక్‌గా అనిపిస్తుంది. మేం మంచి చిత్రాన్ని తీశాం' అని తెలిపారు. నిర్మాత ఫణి అడపాక మాట్లాడుతూ, 'ఎమోషన్ క్యారీ అయ్యేట్టుగా.. అనుకున్నది అనుకున్నట్టుగా యదు సినిమాను తీశారు' అని అన్నారు. 'ట్రైలర్ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. సినిమా కూడా అందరికీ నచ్చుతుంది. యదు మంచి సినిమాను తీశారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో వస్తున్న మంచి యూత్ ఫుల్ సినిమా ఇది' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేష్ చెప్పారు.

> ఇది చిన్న చిత్రం కాదని అర్థమైంది. ఇది చాలా పెద్ద బడ్జెట్‌తో తీసిన పెద్ద సినిమాలా కనిపిస్తోంది. విజువల్స్ బాగున్నాయి. ఇలా కొత్త వారితో ఇంత మంచిగా చిత్రాన్ని తీయడం అంటే మామూలు విషయం కాదు. యదుకి ఇది మొదటి సినిమాలా అనిపించడం లేదు. సినిమా కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ ఆల్ ది బెస్ట్. నిహారిక మల్టీ టాలెంటెడ్. నటిస్తున్నారు.. నిర్మిస్తున్నారు.. షోలు చేస్తున్నారు. ఆమెకు ఈ చిత్రం పెద్ద హిట్ అయి, భారీ లాభాల్ని తెచ్చి పెట్టాలి. ఇలాంటి మంచి చిత్రాలు వస్తే ఆడియెన్స్ తప్పకుండా ఆదరిస్తారు.. పెద్ద హిట్ చేస్తారు.
>
> - సిద్దు జొన్నలగడ్డ

మ్యూజిక్ డైరెక్టర్ అనుదీప్ దేవ్ మాట్లాడుతూ,'మా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన సిద్దుకి థ్యాంక్స్. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన సాంగ్స్ అందరికీ నచ్చాయి. ట్రైలర్ కూడా అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను. ఇంత మంచి సినిమాకు పని చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

మెకానిక్ రాకీ గ్లింప్స్ సందడి షురూ..



విశ్వక్‌సేన్

హీరో విశ్వక్ సేన్ తాజాగా నటిస్తున్న మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ'. నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి రైటింగ్, డైరెక్షన్ వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మాత రామ్ తాళ్లూరి నిర్మించారు.

ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబర్ 31న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ గ్లింప్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఈనెల 28న గ్లింప్స్‌ని లాంచ్ చేయనున్నారు. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో విశ్వక్ సేన్ లుక్ అదిరిపోయింది. ట్రై యాంగిల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

నరేష్, వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘు రామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: రవితేజ ముళ్లపూడి, సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మనోజ్ కటసాని, ప్రొడక్షన్ డిజైనర్: క్రాంతి ప్రియం, ఎడిటర్: అన్వర్ అలీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యం రాజేష్, విద్యాసాగర్ జె.

ఆటలు

కొత్త కోచ్, కొత్త కెప్టెన్...

- సరికొత్త ఆరంభం
- శ్రీలంకతో భారత్ తొలి టీ20 నేడు
- రాత్రి 7 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



పల్లెకెలె: టీ20 ప్రపంచ చాంపియన్ భారత్ కొత్త కోచ్, కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో సరికొత్త ప్రయాణాన్ని ఆరంభించేందుకు సిద్ధమైంది. గురువు గౌతమ్ గంభీర్, నయా నాయకుడు సూర్యకుమార ఆధ్వర్యంలో శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌లో పోటీ పడనుంది. ఈ సిరీస్‌లో భాగంగా శనివారం జరిగే తొలి మ్యాచ్‌లో భారత జట్టు శుభారంభమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. టీ20 ప్రపంచ కప్ గెలిచిన తర్వాత రాహుల్ ద్రవిడ్ ప్రధాన కోచ్‌గా తన పదవీ బాధ్యతలను ముగించగా.. అతని స్థానంలో మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ కోచ్‌గా పగ్గాలు చేపట్టాడు. వచ్చీరావడంతో జట్టులో మార్పులు మొదలు పెట్టాడు. టీ20లకు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను కాదని సూర్యకుమార్‌కు కెప్టెన్సీ అప్పగించాడు. ఈ నేపథ్యంలో కోచ్‌గా గంభీర్, కెప్టెన్ గా సూర్యకుమార్ తొలి సిరీస్‌తోనే తమ మార్కు చూపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. టీ20 ప్రపంచ కప్ నెగ్గిన జోరును జట్టును తమదైన శైలిలో నడిపించాలని భావిస్తున్నారు. 2026లో భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇచ్చే 2026 టీ20 ప్రపంచ కప్‌పై ఇప్పటి నుంచే ఇరువురు దృష్టి పెట్టారు. ఈ మెగా టోర్నీ నాటికి బలమైన జట్టును తయారు చేయాలని అటు బీసీసీఐ కూడా భావిస్తోంది. ఈ నేపథ్యంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా వంటి సీనియర్లు టీ20ల నుంచి తప్పుకోవడంతో వారి స్థానాలను భర్తీ చేసేందుకు శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రింకూ సింగ్, రియాన్ పరాగ్ ఆతృతగా ఉన్నారు. ఈ సిరీస్‌లో సత్తా చాటి జట్టులో తమ స్థానాలను సుస్థిరం చేసుకోవాలని చూస్తున్నారు. కెప్టెన్సీ ఆశించి భంగపడ్డ నేపథ్యంలో హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌లో ఎలా ఆడుతాడన్నది ఆసక్తిగా మారింది. ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడంతో ఇవ్వడంతో ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అర్షదీప్ సింగ్‌తో పాటు మహ్మద్ సిరాజ్ ఈ విభాగాన్ని నడిపించనున్నారు.

మరోవైపు టీ20 ప్రపంచ కప్‌లో ఆడి తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టిన శ్రీలంక కొత్త కెప్టెన్ చరిత్ అసలంక నాయకత్వంలో బరిలోకి దిగుతోంది. ప్రపంచ కప్‌లో నిరాశ తర్వాత కెప్టెన్ హసరంగతో పాటు కోచ్ క్రిస్ సిల్వర్‌వుడ్, కన్సల్టెంట్ కోచ్ జయవర్దనే రాజీనామా చేశారు. దాంతో అసలంకకు టీ20 పగ్గాలు అందించగా.. దిగ్గజ బ్యాటర్ సనత్ జయసూర్య ఈ సిరీస్‌లో లంకు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించనున్నాడు. కొత్త కెప్టెన్ నాయకత్వంలో సొంతగడ్డపై ఈ సిరీస్‌లో సత్తా చాటాలని లంక కోరుకుంటోంది. అయితే, ఇద్దరు సీనియర్ పేసర్లు దుష్మంత చమీర, నువాన్ తుషార గాయాలతో దూరం అవడంతో సిరీస్‌కు ముందే ఆతిథ్య జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. మరి, ప్రపంచ కప్ నెగ్గి సమరోత్సాహంతో ఉన్న భారత జట్టును శ్రీలంక ఏమేరకు నిలువరిస్తుందన్నది ఆసక్తికరం.


తుది జట్లు (అంచనా)

భారత్: శుభమన్ గిల్, యశస్వి జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), రిషబ్ పంత్ (కీపర్), రింకు సింగ్, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్.

శ్రీలంక: అవిష్క ఫెర్నాండో, చరిత్ అసలంక (కెప్టెన్), పాతుమ్ నిశాంక, కుశాల్ మెండిస్ (కీపర్), దినేశ్ చండిమల్, వానిందు హసరంగ, దాసున్ షనక, మతీష పతిరణ, మహేశ్ తీక్షణ, దునిత్ వెల్లలగే, బినుర ఫెర్నాండో

ఆసియా కప్ ఫైనల్లో భారత్

- సెమీస్‌లో 10 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం
- మంధాన అర్ధ శతకం, రాణించిన రేణుక,రాధ



దంబుల్లా: మహిళల ఆసియా కప్ టీ20 టోర్నమెంట్‌లో విజేతగా నిలిచేందుకు భారత్ ఒకే ఒక్క అడుగు దూరంలో నిలిచింది. ఈ టోర్నీలో అద్భుతంగా రాణిస్తున్న భారత అమ్మాయిలు అజేయంగా ఫైనల్‌కు చేరుకున్నారు. మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తా చాటిన భారత్ శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 10 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించి టైటిల్ పోరుకు సిద్ధమైంది. తొలుత బౌలింగ్‌లో పేసర్ రేణుకా సింగ్ (3/10)... బ్యాటింగ్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (39 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్సర్లతో 55 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో విజృంభించడంతో ఈ పోరులో బంగ్లాను చిత్తు చేసింది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా నిర్ణీత 20 ఓవర్లలో 80/8 స్కోరు మాత్రమే చేయగలిగింది. నిగర్ సుల్తానా (32), షోర్నా అక్తర్ (19 నాటౌట్) తప్ప మిగతా బ్యాటర్లంతా నిరాశ పరిచారు. రేణుకకు తోడు రాధా యాదవ్ (3/14) కూడా సత్తా చాటడంతో బంగ్లా క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు దిలార అక్తర్ (6), ముర్షిదా ఖాటున్ (4)తో పాటు ఇష్మా తంజిమ్ (8)ను ఆరంభంలోనే పెవిలియన్ చేర్చిన రేణుక బంగ్లాను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఒక ఎండ్‌లో కెప్టెన్ నిగర్ పోరాడినా మరో ఎండ్‌లో వికెట్ల పతనం ఆగలేదు. రుమాన అహ్మద్ (1), రబేయా ఖాన్ (1), రితు మోని (5) కూడా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం అయ్యారు. చివర్లో షోర్న పోరాటంతో బంగ్లా ఆమాత్రం స్కోరు చేయగలిగింది. లక్ష్య ఛేదనకు దిగిన భారత్ 11 ఓవర్లలోనే 83/0 స్కోరు చేసి సులువుగా గెలిచింది. ఓపెనర్ షెఫాలీ వర్మ (26 నాటౌట్) స్ట్రయిక్ రొటేట్ చేస్తూ సాయం చేయగా.. మరో ఎండ్‌లో స్మృతి మంధాన భారీ షాట్లతో ఆకట్టుకుంది. 38 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్న ఆమె భారత్‌కు పది వికెట్ల విజయం అందించింది. ఈ క్రమంలో టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచింది. 3433 పరుగులు చేసిన మంధాన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (3415 పరుగులు)ని వెనక్కునెట్టింది. రేణుకకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

'సహకార'మేదీ..?

75 సొసైటీలకు అందని రుణమాఫీ..

- నష్టపోతున్న 2 నుంచి 3 లక్షల మంది రైతులు
- రూ.502.79 కోట్లు మాఫీ కాని పరిస్థితి
- రెన్యువల్ చేయకపోవడమే కారణం
- ప్రభుత్వానికి నివేదికలందజేత



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రుణమాఫీ పథకం రాష్ట్రవ్యాప్తంగా 75 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (సీడెడ్) ఉన్న రైతులకు వర్తించలేదని సమాచారం. ప్రభుత్వం ఇచ్చిన నిర్దిష్ట గడువు డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 12, 2023 మధ్య సంబంధిత సంఘాల్లో రుణాలను రెన్యువల్ చేయకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇక్కడ సుమారు 2.50 నుంచి 3 లక్షల మంది రైతులకు రుణమాఫీ వర్తించే అవకాశం లేదని విశ్వసనీయ సమాచారం. 2018-2023 మధ్య ఏ సంఘంలోనూ రుణాలు ఇవ్వలేదు. దాంతో అంతకుముందు ఇచ్చిన రుణాలను రెన్యువల్ చేయాలని సంఘాలపై ఎలాంటి ఒత్తిడి లేదనేది అధికార వర్గాల సమాచారం. వాణిజ్య బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేయాలని ఉన్నతాధికారుల ఒత్తిడి నేపథ్యంలో పాత రుణాలను రెన్యువల్ చేయడంతో వాటికి రుణమాఫీ వర్తించింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 18న తొలిదఫాలో రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసింది. ఈ నేపథ్యంలో చాలా సంఘాల్లో రుణాలు మాఫీ కాలేదని తెలియడంతో రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 149 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుండగా, ఇందులో 70 సంఘాలు మాత్రమే ఉమ్మడి వరంగల్ డీసీసీబీ పరిధిలో ఉన్నాయి. మిగతా 79 సంఘాలు వాణిజ్య బ్యాంకులకు అనుబంధంగా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ డీసీసీబీ పరిధిలోని 70 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 77,288 మంది రైతులకు రూ.502.79 కోట్ల రుణమాఫీ కావాల్సి ఉంది. హన్మకొండ జిల్లాలోని పరకాల, సింగారం, వంగపహాడ్, పెగడపల్లి సంఘాల్లో రుణమాఫీ నిధులు జమ కాలేదు. ఈ నాలుగు సంఘాల్లో సుమారు 6 వేల మంది రైతులు ఆందోళనలో ఉన్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం సొసైటీలో 2,900 మంది రైతులకు రూ. లక్షలోపు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ జరగాల్సి వున్నా, నేటికీ ఒక్క రైతుకు రుణమాఫీ చేయలేదు.

ఆడిట్ లేకపోవడమే కారణమా..?

రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్య బ్యాంకులకు అనుబంధంగా ఉన్న పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సకాలంలో ఆడిట్ నివేదికలు పంపకపోవడం వల్ల రైతుల రుణాలు రెన్యువల్ కాలేదని తెలుస్తోంది. దాంతో రుణమాఫీ పథకం వర్తించలేదు. ఈ విషయంలో ఇప్పటికే రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆడిట్ రిపోర్ట్‌ను పంపాల్సిందిగా అధికారులను ఆదేశాలిచ్చింది. దాంతో అధికారులు ఆన్‌లైన్‌లోనే ఆడిట్ నివేదికలను పంపినట్టు తెలిసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి వుంది.

రెన్యువల్ చేయకపోవడమే కొంపముంచింది



2018 కంటే ముందు తీసుకున్న రైతు రుణాలను అధికారులు రెన్యువల్ చేయకపోవడమే కొంపముంచింది. గణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులకు రుణమాఫీ వర్తించలేదు. ఇటీవల వరంగల్‌కు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి సీతక్కకు.. వినతిపత్రం ఇచ్చినం. వెంటనే దీనిపై నిర్ణయం తీసుకోవాలి. ఇలాంటి సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా చాలా ఉన్నాయి.

- కన్నెబోయిన కుమార్ యాదవ్, గణపురం సొసైటీ చైర్మెన్

సీడెడ్ సొసైటీలకు రుణమాఫీ వర్తింపజేయాలి



వాణిజ్య బ్యాంకులకు అనుబంధంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలి. ఆడిట్ సమర్పించలేదనే పేరిట రుణమాఫీని వర్తింప జేయకపోవడం విచారకరం. రైతును రైతుగానే చూడాలి. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యానికి రైతులను బలి చేయొద్దు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇలాంటి సొసైటీలు ఎన్ని ఉన్నాయో గుర్తించి ఆ సొసైటీల్లోని రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

- ఎం. చుక్కయ్య, హన్మకొండ జిల్లా కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం

ఆడిట్ నివేదికలు పంపాం

సకాలంలో ఆడిట్ నివేదికలు పంపని సంఘాలకు రుణమాఫీ కింద డబ్బులు జమ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో ఆన్‌లైన్‌లోనే ఆడిట్ నివేదికలను సమర్పించాం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- నాగేశ్వర్‌రావు, జిల్లా సహకార అధికారి, హన్మకొండ జిల్లా

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886